# సాహితీ సౌరభం

## S.E.P. - 2024

**I Semester Telugu Textbook for**
**B.Com / B.Com (Industry & Integrated) /**
**B.B.A.**


*ప్రధాన సంపాదకులు*

**ఆచార్య కె. ఆశాజ్యోతి**

అధ్యక్షులు, తెలుగు అధ్యయన శాఖ



బెంగళూరు విశ్వవిద్యాలయం

జ్ఞానభారతి ప్రాంగణం

బెంగళూరు - 560 056

# సాహితీ సౌరభం

## S.E.P. - 2024

## I Semester Telugu Textbook for B.Com / B.Com (Industry & Integrated) / B.B.A.


ప్రధాన సంపాదకులు

**ఆచార్య కె. ఆశాజ్యోతి**

అధ్యక్షులు, తెలుగు అధ్యయన శాఖ



బెంగళూరు విశ్వవిద్యాలయం

జ్ఞానభారతి ప్రాంగణం

బెంగళూరు - 560 056

**SAHITI SOURABHAM :** A Prescribed Telugu Textbook for I Semester for B.Com/B.Com. (Industry & Integrated) B.B.A. Degree Classes. Chief Editor: Prof. K. Asha Jyoti, Chairperson, Department of Studies in Telugu, Bangalore University; Published by Bangalore University, Jnanabharathi Campus Bengaluru-560 056; pp. x + 84.

© బెంగళూరు విశ్వవిద్యాలయం

ప్రథమ ముద్రణ: 2024

*ప్రధాన సంపాదకులు:*

**ఆచార్య కె. ఆశాజ్యోతి**

అధ్యక్షులు, తెలుగు అధ్యయన శాఖ

బెంగళూరు విశ్వవిద్యాలయం

జ్ఞానభారతి, బెంగళూరు-560056

*ప్రకాశకులు* **:**

నిర్దేశకులు

ప్రసారాంగ, మరియు ముద్రణాలయ విభాగం

బెంగళూరు విశ్వవిద్యాలయం

జ్ఞానభారతి ప్రాంగణం, బెంగళూరు - 560 056

**ముద్రణ:**

బెంగళూరు విశ్వవిద్యాలయం, జ్ఞానభారతి ప్రాంగణం, బెంగళూరు-560056



# ఉపాధ్యక్షులవారి మాట

కర్ణాటక ప్రభుత్వం యొక్క కొత్త రాష్ట్ర విద్యావిధానం-2024 అభ్యాస ఫలితాలు మరియు విజయాల సమతుల్యతను నొక్కి చెబుతుంది. కళలు మరియు శాస్త్రాలు, వాణిజ్యం, స్వచ్ఛమైన విద్యా కార్యకలాపాలు, వృత్తిపరమైన విద్య మరియు పాఠ్యేతర కార్యకలాపాల మధ్య పరిపూరకరమైన సంబంధం ఉండాలనేది దీని ప్రధాన ఆకాంక్ష. విద్యా వ్యవస్థలో మరియు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసంలో భాషలు కీలక పాత్ర పోషిస్తాయని కొత్త విద్యావిధానం గుర్తించింది. మారుతున్న ప్రాంతీయ, జాతీయ మరియు ప్రపంచ దృగ్విషయాలకు అనుగుణంగా విద్యా నమూనాను రూపొందించడం దీని ప్రాథమిక లక్ష్యం. సమకాలీన సవాళ్లను ఎదుర్కొనేందుకు విద్యార్థులను బలమైన వ్యక్తులుగా తీర్చిదిద్దాలనేది ఆశ.

బెంగళూరు విశ్వవిద్యాలయం పాఠ్యాంశాలు, పాఠాల అభ్యాసం మరియు అభ్యాసం యొక్క మూల్యాంకనంలో ఆవిష్కరణలను అవలంబించింది. విద్యార్థులను చురుగ్గా ఉండేలా ప్రోత్సహించడానికి, విద్యావ్యవస్థలో పురోగతికి పూర్తి స్వేచ్ఛ, సమానత్వంగా స్వీకరించడానికి ప్రోత్సహించింది. భావవ్యక్తీకరణ నైపుణ్యాలతో పాటు వివిధ విభాగాల అనుసంధానం ద్వారా జ్ఞానాన్ని పెంపొందించడం, తెలుగు గ్రంథాలు నాలుగు మరియు నాలుగు సంవత్సరాల మల్టీడిసిప్లినరీ డిగ్రీ కోర్సులలో కమ్యూనికేషన్‌తో పాటు భాష, సాహిత్యం, సంస్కృతి మరియు విలువలను అభివృద్ధి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నాయి.

B.Com., (Industry & Integrated)/B.B.A., మొదలైన డిగ్రీ కోర్సుల మొదటి నాలుగు సెమిస్టర్లలో భాష మరియు సాహిత్యం బోధించేటప్పుడు విషయ ప్రధానమైన పాఠ్య గ్రంథాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తూ పాఠ్య గ్రంథాలు తయారు చేయడానికి పూనుకొనడం జరిగింది. సంబంధిత కోర్సులకు పాఠ్యరచన చేస్తున్నప్పుడు మానవీయ విలువలు, సామాజిక సమస్యలపై అవగాహన కలిగించే సాహిత్యం కంటే అంశాలను దృష్టిలో ఉంచుకుని పాఠ్య రచన రూపొందించే ప్రయత్నం జరిగింది. భాషా అధ్యయనంలో విద్యార్థుల నైపుణ్యానికి ప్రాధాన్యత

ఉంటుంది. పాఠ్య ప్రణాళికా సంఘం నిర్ణయంతో, సంపాదకుల కృషితో పాఠ్య గ్రంథాలను సిద్ధం చేసింది. ప్రస్తుతం మొత్తం ప్రణాళికకు ఎడిటర్-ఇన్-చీఫ్‌గా పని చేస్తున్న తెలుగు అధ్యయన శాఖాధ్యక్షులు ఆచార్య కె. ఆశాజ్యోతి గారు. వివిధ డిగ్రీలకు, ఐచ్ఛిక తెలుగు, ఓపెన్-ఛాయిస్ తెలుగును సిద్ధం చేశారు. తెలుగేతరులకు తెలుగు నేర్పే ప్రయత్నం జరుగుతోంది. ఆచార్య ఆశాజ్యోతిని మరియు అధ్యయన మండలి సభ్యులు ఆచార్య ఎం.రామనాథం నాయుడు, ఆచార్య వై. రెడ్డి శ్యామల, ఆచార్య, ఎన్.వి. కృష్ణారావు, డా॥ డి.కె. ప్రభాకర్‌లను అభినందిస్తున్నాను.

కర్ణాటక రాష్ట్రీయ విద్యా విధానం-2024లో రూపొందించిన ఈ పాఠ్య గ్రంథాలను తక్షణమే ముద్రించి తీసుకురావడం హర్షణీయం. ప్రసారాంగ సంచాలకులు ఆచార్య సి. నాగభూషణ మరియు బెంగళూరు విశ్వవిద్యాలయ ముద్రణాలయ సిబ్బందిని అభినందిస్తున్నాను.

**ప్రొ॥ డా॥ జయకర ఎస్.ఎం.**
**ఉపాధ్యక్షులు**
**బెంగళూరు విశ్వవిద్యాలయం**
**బెంగళూరు-560 056**



# సంచాలకులవారి మాట

అధ్యయన మండలి మరియు పరిశీలనా సంఘం సిఫారసుల మేరకు కొత్త కర్ణాటక రాష్ట్రీయ విద్యా విధానం-2024కి అనుగుణంగా స్నాతకోత్తర తరగతుల కోసం బెంగళూరు విశ్వవిద్యాలయం భాషా పాఠాలు, ఐచ్ఛిక తెలుగు మరియు శిక్షణ తెలుగు పాఠ్య పుస్తకాలను తెలుగు అధ్యయన శాఖ సిద్ధం చేసింది.

ప్రస్తుతం బి.కామ్.(ఇండస్ట్రీ & ఇంటిగ్రేటెడ్) / బి.బి.ఏ.తెలుగుభాషా పాఠ్య పుస్తకం తయారుచేసి ప్రచురణకు పంపడమైంది. దీని తయారీలో మార్గదర్శకత్వం వహించిన అధ్యయనమండలి (బోర్డ్ ఆఫ్ స్టడీస్) అధ్యక్షులు ఆచార్య కె. ఆశాజ్యోతి గారు మరియు మోడరేటర్‌గా వ్యవహరించిన అధ్యయన మండలి సభ్యులు ఆచార్య ఎం.రామనాథం నాయుడు, ఆచార్య వై. రెడ్డి శ్యామల, ఆచార్య, ఎన్.వి. కృష్ణారావు, డా॥ డి.కె. ప్రభాకర్‌లకు ధన్యవాదాలు. ప్రచురణ ప్రతిని సిద్ధంచేసి విద్యార్థులకు నేర్చుకునే అవకాశం కల్పించిన సంపాదకులకు, తమ విలువైన రచనలను ఉపయోగించుకోవడానికి అనుమతి నిచ్చిన రచయితలందరికీ నా ధన్యవాదాలు. ఈ రచనను ఇంత వేగంగా ముద్రించడానికి అనుమతించిన ఉపకులపతి ఆచార్య జయకర ఎస్.ఎం.గారికి మరియు ముద్రణాలయ సిబ్బందికి నా ధన్యవాదాలు,

**ఆచార్య సి. నాగభూషణ**
**సంచాలకులు, ప్రసారాంగ & ప్రచురణాలయం**
**బెంగళూరు విశ్వవిద్యాలయం, బెంగళూరు-560056**

**ఆచార్య కె. ఆశాజ్యోతి**
శాఖాధ్యక్షులు, తెలుగు అధ్యయన శాఖ
బెంగళూరు విశ్వవిద్యాలయం
జ్ఞానభారతి, బెంగళూరు - 560056

# ముందుమాట

బెంగళూరు కేంద్ర విశ్వవిద్యాలయం డిగ్రీ కళాశాలలో బి.కామ్.(ఇండస్ట్రీ & ఇంటిగ్రేటెడ్) / బి.బి.ఏ. కోర్సులు చేస్తూ, తెలుగు రెండవ భాషగా ఎన్నుకున్న విద్యార్థులకు మొదటి సెమిస్టర్ తెలుగు పాఠ్యాంశాలు ఈ 'సాహితీ సౌరభం' అనే ఈ పాఠ్యపుస్తకంలో ఉన్నాయి. 'పాఠ్య ప్రణాళికా సంఘం విద్యార్థుల కోసం నిర్దేశించిన ఈ 'సాహితీ సౌరభం'లో రెండు విభాగాలున్నాయి. వాటిలో మొదటిది "ప్రాచీన సాహిత్యం". ఇందులో నన్నయ ఆంధ్రమహాభారతంనుండి 'కుమారాస్త్ర విద్యాప్రదర్శనము', పాల్కురికి సోమనాథుని బసవపురాణం నుండి 'బెజ్జమహాదేవి', ఆతుకూరి మొల్ల రచించిన మొల్ల రామాయణం నుండి 'హనుమంతుడు సీతను చూచుట', మరియు వ్యాకరణంలో భాగంగా సంధులు ఉన్నాయి. రెండవది "గద్యభాగం". ఇందులో ఖండవల్లి లక్ష్మీరంజనంగారి 'ఆంధ్రుల సాంఘికాచారాలు', వేలూరి శివరామశాస్త్రి రచించిన 'తిరుపతి వేంకటకవుల-అవధానవిద్య', యస్వీ.జోగారావు రచించిన 'బొమ్మలాట- యక్షగానము', తూమాటి దొణప్పగారి 'తెలుగు సంస్థానాలు-సాహిత్య పోషణ' అనే అంశాలు గురించి సంక్షిప్తంగా పరిచయం చేయడం జరిగింది.

**ఆచార్య కె. ఆశాజ్యోతి**
**శాఖాధ్యక్షులు, తెలుగు అధ్యయన శాఖ**
**బెంగళూరు విశ్వవిద్యాలయం**
**జ్ఞానభారతి, బెంగళూరు-560056**



# సాహితీ సౌరభం

**బి.కామ్./బి.బి.ఏ.**

**మొదటి సెమిస్టర్**

## I. ప్రాచీన సాహిత్యం

1. కుమారాస్త్ర విద్యా ప్రదర్శనము - నన్నయ 1
2. బెజ్జమహాదేవి - పాల్కురికి సోమనాథుడు 14
3. హనుమంతుడు సీతను చూచుట-ఆతుకూరి మొల్ల 23

## II. గద్యభాగము

1) ఆంధ్రుల సాంఘికాచారాలు - ఖండవల్లి లక్ష్మీరంజనం 41
2) తిరుపతి వేంకటకవుల అవధాన విద్య-వేలూరి శివరామశాస్త్రి 49
3) బొమ్మలాట-యక్షగానము - యస్వీ. జోగారావు 59
4) తెలుగు సంస్థానాలు - సాహిత్య పోషణ 69

## వ్యాకరణము

**1) సంధులు-**
సవర్ణదీర్ఘ సంధి, గుణ సంధి, యణాదేశ సంధి,
వృద్ధి సంధి, రుగాగమ సంధి, గసడదవాదేశ సంధి
ద్విరుక్తటకార సంధి, త్రిక సంధి. 77

# I. ప్రాచీన సాహిత్యం

## 1. కుమారాస్త్ర విద్యాప్రదర్శనము

**(నన్నయభట్టు–ఆంధ్రమహాభారతము ఆదిపర్వము–షష్ఠాశ్వాసము 1వ పద్యం నుండి 60వ పద్యం వరకు)**

**కవి పరిచయం:**

నన్నయ తెలుగు సాహిత్యానికి శ్రీకారం చుట్టిన ఆదికవి. సంస్కృతంలో వేదవ్యాస ప్రణీతమయిన మహాభారతాన్ని తెలుగులోనికి అనువాదాన్ని ప్రారంభించిన ఋషికల్పుడు. క్రీ.శ.11వ శతాబ్దంలో రాజమహేంద్రవరం రాజధానిగా వేంగీదేశాన్ని పాలించిన రాజరాజ నరేంద్రుని ఆస్థానకవి. అవిరళ జపహోమతత్పరుడు: నిత్యసత్యవచనుడు, ఉభయ భాషా కావ్యరచనా శోభితుడు, సనాతన ధర్మాన్ని, భారతీయ సంస్కృతిని పునరుద్ధరించడానికి వ్యాస భారతానువాదాన్ని మొదలు పెట్టిన మహాకవి.

నారాయణభట్టు తోడ్పాటు అందించగా నన్నయభట్టు మహాభారత రచనకు ఉపక్రమించాడు. భారతంలోని 18 పర్వాలలో నన్నయ ఆది, సభాపర్వాలను, అరణ్య పర్వంలో కొంత భాగాన్ని రచించగా, మిగిలిన దానిని తిక్కన, ఎఱ్ఱన పూర్తి చేశారు. భారతానువాదం చేసిన ఈ ముగ్గురు కవులను 'కవిత్రయం' అంటారు.

నన్నయ భారతానువాదభాగంతోపాటు ఇంద్ర విజయం, చాముండికా విలాసం అనే కావ్యాలను, 'ఆంధ్రశబ్దచింతామణి' అనే వ్యాకరణ గ్రంథాన్ని, 'లక్షణసారం' అనే ఛందో గ్రంథాన్ని రచించాడని ప్రతీతి. కాని వీనిలో 'ఆంధ్ర శబ్దచింతామణి' తప్ప తక్కినవి దొరకడం లేదు.

నన్నయకు 'ఆదికవి', వాగనుశాసనుడు అనే బిరుదులు ఉన్నాయి. ప్రసన్న కథాకవితార్థయుక్తి, అక్షర రమ్యత, నానారుచిరార్థసూక్తి నిధిత్వము అనేవి తన కవితా గుణాలుగా నన్నయ చెప్పుకున్నాడు. నన్నయ కవిత్వంలో 'ఉభయ వక్రోక్తి' ఉంటుందని శ్రీనాథుడు మెచ్చుకున్నాడు.

ప్రస్తుత పాఠ్యభాగమైన 'కుమారాస్త్ర విద్యాసందర్శనము' నన్నయ రచించిన ఆంధ్రమహాభారతం – ఆదిపర్వం – షష్ఠాశ్వాసం నుండి గ్రహింపబడింది. శౌనకుడు మొదలైన మహామునులకు మహాభారత కథను చెపుతున్న రోమహర్షణి – 'ఆ విధంగా శస్త్రాస్త్ర విద్యలు నేర్చుకొన్న కురుపాండవ రాకుమారుల విద్యా నైపుణ్యాన్ని – పెద్దల ముందు ప్రదర్శింపచేయాలనుకొన్న సందర్భంలోనిదీ పాఠ్యభాగం.

* * *

వ. కృతా స్త్రశస్త్రులయిన రాజకుమారుల విద్యాకౌశలంబు వ్యాస గాంగేయ విదుర
కృప శల్య శకుని సోమదత్తాదుల సమక్షంబునం జూప సమకట్టి యొక్కనాఁడు.
ద్రోణుండు ధృతరాష్ట్రున కిట్లనియె. 1

క. ఘోరా స్త్రశ స్త్రీవిద్యల
నారూఢత మిగుల నిపుణులైరి కుమారుల్
మీరలు వీరలవిద్యా
పారము చను టెఱుఁగవలయు భవదీయసభన్. 2

వ. అనిన నట్ల చేయుదునని ధృతరాష్ట్రుండు గుమారుల విద్యా సందర్శనరంగంబు రమ్యంబుగాఁ జేయింపు మని విదురుం బనిచిన నతండు వల్లె యని శాస్త్రోపదిష్ట ప్రమాణోపేత వృత్తాయామంబును నపాకృతవృక్ష గుల్మవల్మీకంబును నంగీకృతపూర్వోత్తర ప్లవంబును సమాకృత నిమ్నోన్నత ప్రదేశంబును దూరీకృతకంటక పాషాణశల్యశకలంబును విడ జీకృతరజోధూసరస్థలంబును విరచిత బహువిధ ప్రేక్ష గారమంచక ప్రపంచంబును నానాధ్వజ నవపల్లవ రంభా స్తంభమాలా లంకృత ద్వారతోరణంబును బ్రతిదిశ నిర్వర్తి తశాంతికబలి విధానంబునుంగాఁ జేయించి పంచాంగ శుద్ధదినంబున సుముహూర్తంబున ధృతరాష్ట్రుండు



గాంధారీ పురస్సర దేవీశతపరివృతుండై వివిధ భూషణభూషితా నేక విలాసినీ నివహంబుతోఁ జనుదెంచి విలంబితకదంబ స్థూలముక్తాఫలదామరమణీయంబై యాబద్ధ మరకత వజ్ర వైదూర్య పద్మరాగప్రవాళ ప్రభానికర వ్యతికరవిరచితా పూర్వసురచాప చారుగౌరవంబై యతిమనోహరంబై న శాతకుంభ మయ ప్రేక్షాగారంబున నున్న. 3

తే. అందుఁ గర మొప్పి 'సుందరీబృంద మఖిల
రత్న రాజితకనకధరాధరేంద్ర
కందరాంతరమున నున్న సుందరామృ
తాశనాంగనాబృందంబు ననుకరించె 4

తే. సుతులవిద్యాప్రవీణతఁ జూచు వేడ్క
నెంతయును సంతసంబునఁ గుంతిదేవి
రాజసన్నిధి గాంధార రాజపుత్రి
కెలన నుండె నున్మీలిత నలిన నేత్ర. 5

సీ. వ్యాసపురస్కృతావని దేవనివహంబుఁ
గృపశల్యశకునిగాం గేయవిదుర
సోమదత్తాదిభూసురగురు బాంధవ
మిత్రవర్గంబు న మేయమంత్రి
సామంతమండ లేశ్వరసమూహంబును
గాయక వైతాళిక ప్రవరులుఁ
దమతమనియమిత స్థానంబులం దోలి
నుండిరి బోరన నులిసె భేరు

ఆ. లస్త్రదర్శనాగ తాఖిలక్షత్రియ
వైశ్యశూద్రవివిధ వర్ణజనుల
కలకలంబు ప్రళయ కాలసంక్షోభితాం
భోధినిస్వనంబుఁబోలెఁ జెలఁగె. 6

వ. అట్టి యవసరంబున నాచార్యుండు శుక్లాంబరాభరణమా ల్యానులేపన యజ్ఞోపవీత పలితశ్మశ్రు కేశకలాపోపశోభిత దేహుండై రంగమధ్యంబున నశ్వత్థామ సహితుండై విముక్త జలధరవియన్మధ్యంబున సంగారక సహితుండైన యాదిత్యుండును బోలెనున్న నగణ్య భూసురవరేణ్య పుణ్యాహవాచనా నంతరంబున. 7

శా. ద్రోణాచార్యుపిఱుంద నొప్పి దృఢహస్తుల్ బద్ధగో ధాగుళి
త్రాణుల్ మార్గణపూర్ణతూణులు మహాధన్వుల్ కుమారుల్ తను
త్రాణోపేతులు రంగ మధ్యమున నంతన్నిల్చి రుద్యద్గుణ
శ్రేణీరమ్యులు ధర్మజప్రముఖులై జ్యేష్ఠాను పూర్వంబుగాన్. 8

వ. ఇట్లు నిలిచి యాచార్యుననుమతంబున, 9

సీ. అసివర్మకౌశలం బమరంగఁ జూపెడు
వారును దృఢ సౌష్ఠవంబు లొప్పఁ
దమతమనామాంకితములైన శరముల
నేర్పడ లక్ష్యంబు లేయువారు
హయమదద్విరదరథారూఢదక్షతఁ
బ్రకటించువారును బ్రాసశక్తి
కుంతతో మరగదా కుశలత్వ మెఱిఁగించు
వారునుగా నిట్లు వసుధలోని

ఆ. రాజసుతులతోడ రమణఁ బాండవధృత
రాష్ట్రసుతులు వృద్ధరాజులొద్దఁ
దద్ద ముదముతోడఁ దమతమ నేర్పుల
మెఱసి రెల్లజనులు మెచ్చి పొగడ. 10

వ. అంత ననంత పరాక్రము లగు భీమదుర్యోధను లుద్యద్గ దాహస్తులయి మహా మత్సరంబుతో నేకశృంగసము త్తుంగ శైలద్వయంబు ననుకరించుచు వశానిమి త్తక్రుద్ధ గంధసింధురంబులుంబోలె నొండొరులం దాఁకుచు సవ్యా పసవ్యచిత్ర మండలమార్గప్రచారంబుల గదాకౌశలంబు మెఱయు నెడ. 11



మ. అవనీచక్రము పాదఘాతమున నల్లాడంగ నత్యుచ్ఛభై
రవహుంకారరవంబునన్ వియదగారం బెల్ల భేదిల్లఁ బాం
డవ కౌరవ్యగ దావిఘట్టన మకాండప్రోత్థమై భావిపాం
డవకౌరవ్యరణాభిసూచనపటిష్ఠం బయ్యె ఘోరాకృతిన్. 12

క. ఆరాజసుతుల విద్యా
పారగపటు చేష్టితములఁ బరువడి నగ్గాం
ధారీధృతరాష్ట్రుల కతి
ధీరుఁడు విదురుండు సెప్పి తెలుపుచు నుండెన్. 13

వ. అంత భీమదుర్యోధనుల గదాకౌశలంబు చూచుజనంబుల పక్ష పాత వచనంబులు విని ద్రోణుండు రంగభంగభయం బున నశ్వత్థామం బంచి వారి నిద్దఱ వారించి వారాశి యుంబోలే మ్రోయుచున్న వాదిత్రశబ్దంబు లుడిగించి నాప్రియశిష్యుండయిన యర్జును ధనుర్విద్యాకౌశలంబుఁ జూడుం డనిన నయ్యాచార్యవచనానంతరంబున. 14

ఉ. హారివిచిత్ర హేమకవచావృతుఁ డున్నత చారుచాపదీ
ర్ఘోరుభుజుండు భాస్వదసితోత్పలవర్ణుఁడు నైంద్రచాపశం
పారుచిమేఘమో యనఁగఁ బాండవమధ్యముఁ డొప్పె బద్ధతూ
ణీరుఁడు రంగ మధ్యమున నిల్చి జనంబులు దన్నుఁ జూడఁగన్. 15

క. నరు నింద్రాత్మజు నింద్రా
వరజసఖున్ వీరుఁ బాండవప్రవరు ధను
ర్ధరుఁ జూచి చూప జెల్లం
బరమాద్భుత చిత్తులగుచుఁ బలికిరి తమలోన్. 16

తే. వీఁడెకృతహస్తుఁడఖిలాస్త్ర విద్యలందు
వీఁడె యగ్రగణ్యుఁడు ధర్మవిదులలోన
వీఁడె భరతవంశం బెల్ల వెలుఁగ గుంతి
కడుపుచల్లగాఁ బుట్టిన ఘనభుజుండు. 17

క. అనిపలుకు జనులపలుకులు
విని కుంతి యంతహర్ష విస్తారితలో
చనయై నందను నృపసం
దనసంఘములోనఁ జూచి తద్దయుఁ బొంగెన్. 18

క. చారుమనస్సమ్మదరస
పూరము వెలి వచ్చినట్లు పొలఁతికి విగళ
ద్భూరి స్తనజనితపయో
ధారలు నానంద బాష్పధారలు నొప్పెన్. 19

వ. అయ్యర్జునుస్తుతివచనంబు లొక్కట జనసంఘంబువలన నెగసి వియ
త్తలవిదళనంబయిన నమ్మహాధ్వని విని యదరి పడి ధృతరాష్ట్రుం డిది యేమి
రవంబని విదురు నడిగిన నతం డిట్లనియె. 20

క. భూరిభుజుం డర్జునుఁ డతి
శూరుఁడు దనయస్త్రవిద్యఁ జూపఁగ రంగ
ప్రారంభుఁ డయిన నతనిన్
వారక వర్ణించుజనరవం బిది యధిపా. 21

క. అనవుడు ధృతరాష్ట్రుఁడు దన
మనమున సంతోష మంది మానుగ వీనుల్
గనినఫల మిపుడు గంటిని
వినఁ గంటిని బాండుసుతుల విద్యాశక్తుల్. 22

క. భూరినిజద్యుతితోడఁ బృ
ధారణిసంభూత పాండ వాగ్ని త్రితయం
భారఁగ నస్మత్కులదురి
తోరుతరారణ్యదాహ మున్నతిఁ జేయున్. 23

వ. అని పొగడు చుండ నర్జునుం డాచార్యననుమతంబున నస్త్రలాఘవ విచిత్ర
ప్రకాశన పరుండయి యెల్ల వారును. జూచు చుండ. 24



సీ. ఆగ్నేయశరమున నతిభీక రాగ్నియు
వారుణాస్త్రమున దుర్వారజలము
ననిల బాణంబున నధికానిలంబును
మేఘాస్త్రమున మహామేఘచయముఁ
బుట్టించు మఱియును భూమి బాణంబున
భూప్రవిష్టుం డగు భూరి ఘోర
శైల బాణంబున శైలకూపముదాల్చు
వీరుఁ డదృశ్యాస్త్ర విద్య పేర్మిఁ

గీ. దా నదృశ్య దేహ్నుడగు దత్క్షణంబ
హ్రస్వుఁడగుదీర్ఘుఁడగుసూత్ముఁడగు రయంబు
తోడరథమధ్యగతుఁడగు దురగగతుఁడు
నగుమహీగతుఁడగునిట్టు అద్భుతముగ. 25

వ. మఱియుం బాలెడు సింహవ్యాఘ్రవరాహాది మృగంబుల ముఖంబులందొక్కొక్క
యమ్మేసినట్లేనేసి యమ్ములతిలా ఘవంబున నేసియు రజ్జుసమాలంబితం బయిన
గోశృంగంబునం దేకవింశతిశరంబులు వరుసను నాటనేసియు నిట్లస్త్ర విద్యా
వైచిత్ర్యంబు మెఱసి గదాఖడ్గాదివివిధాయుధ దక్షతం జూపి యర్జునుండు
జనుల కాశ్చర్యంబు సేయుచున్నంతఁ గర్ణుండు నిజవిద్యాకౌశలంబు మెఱయ
సమ కట్టివచ్చి రంగద్వారంబున భుజాస్ఫాలనంబు సేసిన. 26

మ. జను లెల్లంగడు సంభ్రమింపఁగ నజస్రంబై భుజాస్ఫాలన
ధ్వని శైలప్రకరంబుపై ఁబడు మహాదంభోళిశబ్దం బొకో
యన వీ తెంచినఁ బాండవుల్ సనిరి ద్రోణాచార్యు డాయ న్సుయో
ధను వేష్టించిరి తమ్ము లందఱును దద్వారంబు నీక్షించుచున్. 27

శా. సాలప్రాంశు నిజోజ్జ్వలత్కవచు శశ్వత్కుండలో ద్భాసితున్
బాలార్క ప్రతిము న్శరాసనధరు న్బద్ధోగ్రనిస్త్రింశు శౌ
ర్యాలంకారు సువర్ణవర్ణు ఘనుఁ గర్ణాఖ్యు న్జగత్కర్ణపూ
ర్ణాలోలద్గుణుఁ జూచి చూపఱు ప్రభూతాశ్చర్యులై రచ్చటన్. 28

వ. అంతఁ గర్ణుండు జనుల నందఱ నదల్చి చొత్తెంచి రంగ మధ్యంబున నిలిచి
కలయం జూచి కృపద్రోణులకు నమస్కరించి సజలజలధర ధ్వాన గంభీర
వచనంబుల నర్జును నాక్షేపించి యిట్లనియె. 29

క. నీవ కడు నేర్పుకాఁడవు
గా వలవదు వీనిఁ గొన్ని గఱచితి మేమున్
నీవిద్య లెల్లఁ జూపుదు
మే వీరులు సూచి మేలుమే లని పొగడన్. 30

క. అనిన నినతనయుపలుకులు
జనులకు విస్మయము సవ్యసాచికిఁ గోపం
బును సిగును మఱి దుర్యో
ధనునకుఁ బ్రీతియును జేసెఁదత్క్షణమాత్రన్. 31

వ. అంత ద్రోణుచేత సనుజ్ఞాతుండయి కర్ణుం డర్జునుచూపిన యస్త్రవిద్యా విశేషంబు
లెల్ల నశ్రమంబునఁ జూపినఁ జూచి దుర్యోధనుండు దానుం దమ్ములును
గర్ణునిం గౌఁగిలించు కొని నాతో బద్ధసఖ్యుండ వయి నాకును బాంధవులకును
హితంబుసేసి నన్నుం గురదరాజ్యం బేలించి నా యైశ్వర్యం బుపయోగింపు
మనిన నట్ల చేయుదునని కర్ణుం డొడంబడి యిమ్ముఁగిన రాజలోకంబును
నీవునుఁ జూడఁ బార్థుతో ద్వంద్వయుద్ధంబు సేయవలయు ననిన ధార్తరాష్ట్ర
మధ్యంబున నున్న యక్కర్ణుంజూచి పార్థుం డిట్లనియె. 32

క. పిలువంగఁ బడక సభలకు
బలిమిం జని పలుకుపాపభాగుల లోకం
బులకుఁ జన వేఁడి పలికెదు
పలువ యెఱుంగవు పరాత్మపరిమాణంబుల్. 33

క. అనిన విని పారునకు ని
ట్లనియె నినాత్మజుఁడు దుర్బలాయాసక్షే
పనిబంధమ్ములు వలుకక
ఘననిశితాస్త్రములఁ బలుకఁ గడగుము నాతోన్. 34



క. ఈరంగభూమి యస్త్రవి
శారదు లగువారి కెల్ల సామాన్యముగా
కారయ వీరికిఁ జొర నగు
వీరికిఁ గా దను విచారవిషయము గలదే. 35

వ. అని గర్వించి దుర్యోధనానుమతంబునఁ బార్థుతో ద్వంద్వ యుద్ధంబు సేయబూని
రణసన్నద్ధుం డయి రవితనయుండు రంగ మధ్యంబున నున్నంత నర్జునుండును
నాచార్య భ్రాతృ చోదితుండై యుగాంత కాలానలుండునుంబోలెఁ బ్రతిఘ
టించి నిలిచిన. 36

## కర్ణార్జునుల ద్వంద్వయుద్ధము

మా. జనితామర్షణుఁ డంతఁ బార్థుపయిఁ బర్జన్యాస్త్ర మక్కర్ణుఁ డే
సెనపారంబయి భూనభోంతరముఁ దజ్జీమూతయూథంబు గ
ప్పినఁదద్ధ్వాంతతిరోహి తాపఘునుఁ డైబీభత్సుఁడుండెన్ విరో
చనుఁ డాత్మద్యుతి విస్తరించే సుతుపై సంప్రీత చేతస్కుఁడై. 37

వ. అయ్యవసరంబున దుర్యోధనుం దొట్టి ధృతరాష్ట్రనందను లందఱుఁ గర్ణువలన
నుండిరి భీష్మద్రోణకృపపాండవులు పార్థువలన నుండిరంత. 38

క. రవిసుత పార్థుల్ ఘోరా
హవమునకును నెఱచుచున్నయది కుంతి తదు
ద్భవఘనతర శరతిమిరౌ
ఘవృతాంగుఁ దనూజుఁ జూడఁ గానక వంతన్. 39

క. ధృతి దఱిఁగి మోహమూర్ఛా
న్వితయైనను సంభ్రమించి విదురుఁడు ప్రత్యా
గతజీవఁజేసె నప్పుడ
యతిశీతలచందనోద కాసేకమునన్. 40

వ. అంత నర్జునుం డనిల బాణంబున నమ్మేఘపటలంబు పఱవ నేసి యాదిత్యసమ
తేజుండయి యున్న విదురదర్శితులై న యక్కర్ణార్జునులం జూచి కుంతి సంతసిల్లె

నపుడు ధర్మ విదుం డఖిలద్వంద్వయుద్ధసమాచారనిపుణుండు కృష్ణా చార్యుం
డయ్యిద్ధఱ నడుమ నిలిచి కర్ణున కిట్లనియె. 41

చ. కురుకులజుండు పాండునకుఁ గుంతికిఁబుత్త్రుఁడు రాజధర్మబం
ధుర చరితుండు నీ వితనితోడ రణం బొనరించెదేని వి
స్తరముగ నీదువంశమును దల్లిని దండ్రిని జెప్పు చెప్పినన్
దొర యగుదేని నీ కెదిరి దోర్బలశక్తి నితండు సూపెడిన్. 42

వ. అనిన విని కర్ణుండు దనకులంబును దల్లిదండ్రులను జెప్ప సిగ్గువడి తల
వాంచి యున్నం జూచి దుర్యోధనుఁడు గృపున కిట్లనియె. 43

క. కులము గలవాఁడు శౌర్యము
గలవాఁడును సధిక సేన గలవాఁడును భూ
తలమున రా జనునామము
విలసిల్లఁగఁ దాల్చు మూఁడువిధముల పేర్మిన్. 44

తే. రాజవరుఁ డైన పార్థుతో రాజు గాని
యీతఁ డని సేయఁగాఁ దగఁడేని వీని
నెల్లవారును జూడంగ నీక్షణంబ
రాజుఁ జేసెద నే నంగ రాజ్య మిచ్చి. 45

వ. అని యప్పుడ భీష్మధృతరాష్ట్రులకుం జెప్పి వారి యనుమతంబున. మహా
మహీసురసహస్రంబునకు గోసహస్రా యుతంబు దానంబు సేసి యంగ
రాజ్యంబునకు వీఁ డర్హుం డయ్యెడు మనుబ్రాహ్మణవచనంబు వడసి కర్ణుం
గాంచన పీఠంబున నునిచి యంగరాజ్యమున కభిషిక్తుం జేసినం గర్ణుండు
మణిమకుట కేయూరహారాదిభూషణభూషితుండై సకల రాజచిహ్నంబుల నొప్పి
పరమహర్షంబుతోడఁ గురుపతి కిట్లనియె. 46

శ. బృహదబ్ధి మేఖలాఖల
మహీతలకు త్ర వరసమక్షమునమహా
మహిమాన్వితుఁగా నన్నును
మహీశుఁగా జేసి తతిసమర్థత వెలయన్. 47



క. దీనికి సదృశముగా మఱి
యే నేమి యొనర్తు నీకు నిష్టం బనిసన్
మానుగ నాతోఁ జెలిమి మ
హీనుతముగఁ జేయు మిదియ యిష్టము నాకున్. 48

వ. అనిన విని దుర్యోధనున కెంతయు సంతోషంబుగాఁ గర్ణుం డతనితోడ్ యిష్ట
సఖత్వంబున కొడంబడియె నంతఁ గొదుకు రాజ్యాభిషేకోత్సవంబు సూచి
హర్ష పరవశుం డయి సూతుండు రథంబుడిగ్గి కర్ణునొద్దకుం బఱతెంచినఁ
గర్ణుం డును బితృగౌరవంబున సంభ్రమించి వినయవినమితో త్త మాంగుం
డయిన. 49

తే. కడఁగి సూతుండు పుత్రకుఁ గౌఁగిలించి
కొని తదీయ మూర్ధాఘ్రాణ మొనరఁ జేసి
యంగ రాజ్యాభిషే కార్ద్రమైన శిరముఁ
దడిపై వెండియు హర్షాశ్రుతతులఁ జేసి. 50

వ. దానిం జూచి భీముండు గర్ణుని సూతకులసంభవుంగా నెఱింగి నగుచు
నిట్లనియె. 51

క. నీదుకులమునకుఁ దగఁగఁ బ్ర
తోదముగొని రథము గడపఁ దొడఁగుము నృపధ
ర్మోదయుఁ డగునర్జునుతోఁ
గా దనక రణంబు సేయఁగా నీ కగునే. 52

వ. మఱి యదియునుం గాక, 53

తే. ఉత్తమక్షత్త్రియప్రవరోపయోగ్య
మైన యంగ రాజ్యంబు నీ కర్హమగునె?
మంత్రపూతమై గురుయజమానభక్ష్య
మగు పురోడాశ మది గుక్క కర్హమగునె. 54

వ. అనినం గర్ణుండు వెల్ల నయి యెద్దియుం జేయునది నేరక దీర్ఘోష్ణనిశ్వాస
వ్యాకులితవదనుండయి యాకాశంబువలన నున్న యాదిత్యుం జూచుచు
మిన్నకుండె నంత నంత ర్విలులితుం డయిన యక్కర్ణుం జూచి భ్రాతృపద్మవన
మధ్యంబున నుండి దుర్యోధనమదాంధగంధసింధురంబు వెలువడి వచ్చి
కడునలిగి భీమున కిట్లనియె. 55

క. అనిలజ నీ కిట్లని ప
ల్కను దలఁపను నగునె లేడికడుపునఁ బులి పు
ట్టునె యిట్టి దివ్య తేజం
బున వాఁ డదమాన్వయమునఁ బుట్టునె చెపుమా. 56

సీ. సూరుజన్మంబు సురలజన్మంబును
నేఱులజన్మంబు నెఱుఁగ నగునె
మొగికి దధీచియెమ్ముఁ బుట్టదయ్యెనే
వాసవాయుధ మైనవజ్ర మదియు
గాంగేయుఁ డన మఱి కార్తికేయుం డన
నాగ్నేయుఁ డన రౌద్రుఁడనఁగ శరవ
ణోద్భవుం డన గుహుం డుద్భవిల్లఁ డె
శ్వర స్తంబజన్ముఁడు గాఁడె ధర్మవిదుఁడు

తే. గృపుడు ఘటసంభవుఁడుగాఁడె కీర్తిపరుఁడు
వరుఁడు ద్రోణుండు విప్రులవలసఁబుట్ట
రైరె సత్క్షత్త్రియప్రభు లవనిఁ గావఁ
గడఁగి మీ జన్మములు నిట్లకావె విసఁగ. 57

వ. వానితోడిదేమి దివ్యలక్షణలక్షితుండును సహజకవచ కుండల మండితుండును
గాని ప్రాకృత పురుషుండు గాఁడు తన బాహుబలంబున నీయంగరాజ్యంబునక
కాదు సకల మహీరాజ్యంబునకు నర్హుండగు నను చున్నయంత నాది త్యుం
డస్తగతుండైన నస్త్రసందర్శనరంగంబు వెలువడి దుర్యోధనుందు గర్ణుం దోడ్కొని



కరదీపికాసహస్రంబుతో నిజమందిరంబునఁ కరిగె. పాండవులును
భీష్మద్రోణవిదుర కృపా చార్యులతో నిజనివాసంబుల కరిగిరి. 58

ఆ. కుంతి యంత సహజ కుండలకవచాభి
రాముఁ గర్ణుం జూచి రవిసమానుఁ
బ్రత్యభిజ్ఞ నెఱిఁగి ప్రథమపుత్త్రస్నేహ
మెఱుక పడక యుండ నింతియుండె. 59

క. వినుతధనుర్విద్యావిదు
ఘనుఁ గర్ణు సహాయుఁ బడసి కౌరవవిభుఁ డ
ర్జునువలనిభయము సెడి తొ
మ్మునఁ జే యిడి నిద్రవోయె ముదితాత్మం డై. 60

# 2. బెజ్జమహాదేవి

**(పాల్కురికి సోమనాథుడు-బసవపురాణము - తృతీయాశ్వాసము)**

**కవి పరిచయం:**

ఆంధ్రదేశమున వెలసిన వీరశైవ కవులలో పాల్కురికి సోమనాథుడు అగ్రగణ్యుడు. ఇతడు వరంగల్ సమీపమునందలి పాల్కురికి (పాలకురి) నివాసి. ఇతడు మొదటి ప్రతాపరుద్రుని కాలము (క్రీ.శ.1190) వాడనియు, రెండవ ప్రతాపరుద్రుని కాలము (క్రీ.శ.1300) వాడనియు రెండు వాదములున్నవి. ఇతడు అనుభవసారము, బసవపురాణము, చతుర్వేదసారము, పండితారాధ్య చరిత్రము, వృషాధిప శతకము మొదలైన తెలుగుకృతులను, గంగోత్పత్తిరగళే, సద్గురురగళె, శీలసంపాదనె మొదలైన కన్నడ కృతులను, సోమనాథభావ్యము (వీర మాహేశ్వరాచార సారోద్ధారము) మొదలైన సంస్కృత కృతులను రచించెను. జాను తెనుగు ప్రసన్నతకు ముఖ్యమని తన తెలుగు - కృతులందు భాను తెలుగు నుపయోగించెను. ఇతని బసవపురాణము, పండితారాధ్య చరిత్రము ద్విపద కృతులు, బసవపురాణము సంస్కృత కర్ణాట తమిళాది బాషలలోనికి పరివర్తితమైనది. సోమనాథుని కృతులన్నియు స్వతంత్రములు ఇతడు తన వృషాధి పశతక పండితారాధ్య చరిత్రములలో తన కితర భాషలందున్న పాండిత్యమును ప్రదర్శించెను. పండితారాధ్య చరిత్రమున నితని వేద శాస్త్రపురాణాగమ పాండిత్య ప్రకర్ష వ్యక్తమగును. ఇతడు భావ, భావము, ఛందస్సు, ఇతివృత్తముల స్వీకరణమున తన ప్రత్యేకతను చూపెను. ఇతడు దేశికవి.

శివభక్తులలో ముగ్ధభక్తులనేకులు గలరు. ముగ్ధులనగా అమాయకులు. వారు భాగవంతుని ప్రీతి విశ్వాసముల తోడను, స్నేహ వాత్సల్యముల తోడను, భక్తి ప్రపత్తులతోడను నేవించిరి. భగవంతునికై తమ సర్వస్వము నర్పించి తరించిరి.



ముగ్ధులైన భక్తురాండ్రలో బెజ్జమహాదేవి అగ్రగణ్య. ఆమె పరమేశ్వరుని తన కుమారునిగా భావించి ఆడించుచు అలరించుచు అతని ఆలన పాలన చూచికొని ఆనందించినది. భక్తికి వశ్యుడైన పరమేశ్వరుడు ఆమెకు ముక్తిని ప్రసాదించెను. ఇది యిందలి కథ.)

## బెజ్జమహాదేవి

మఱియును విను బెజ్జమహాదేవి యనగా
గఱకంఠ శ్రీపాదకమలాంతరంగ
"యెల్ల నియోగంబు లెల్ల బాంధవులు
నెల్ల వారలు గల విట్లు భర్గునకు
దల్లి లేకుండుట దా విచిత్రంబు
దల్లిలే కది యెట్లు దా నుదయించె?
దల్లి సచ్చెనొ కాక త్రైలోక్యపతికి
జెల్లబో! యి ట్లేమి సేయంగవచ్చు?
దల్లి సచ్చిన కాదె తాను దస్సితిని
యెల్లవారికి దుఃఖ మిట్టిదకాదె!
తల్లి గల్గిన నేల తపసి గానిచ్చు
దల్లి గల్గిన నేల తల జడ ల్గట్టు?
దల్లి యున్న విషంబు ద్రావ నే లిచ్చు?
దల్లి యుండిన దోళ్లు దాల నే లిచ్చు?
దల్లి పాముల నేల ధరియింప నిచ్చు?
దల్లి బూడిద యేల తా బూయ నిచ్చు?
దల్లి పుచ్చునె భువి దనయుని దిరియ?
దల్లి పుచ్చునె సుతు వల్లకాటికిని?
దల్లి లేకుండినతనయుడు గాన
ప్రల్లదుండై యెన్నివాట్లకు వచ్చె;

జన్నిచ్చి పలుమాఱు వెన్నయుబెట్టి
పన్నుగా నిన్నియుబాలును బోసి
యాకొనగా గడు నరసి పాలిచ్చి
సాకించి పెనుపదే జనని గల్గినను?
దా నింతవాడయ్యెందల్లి లేక యును
దా నెంత పెరుగునో తల్లిగల్గినను?
బెండ్లిండ నోముల బేరంటములను
బందువుదినములం బాటిజాతరల
దగినపోడిమి నేయుతల్లి లేకున్న
వగవరే మఱి యెట్టి మగబిడ్డ లైన?
నూర కుపేక్షించి యుండగదగునె?
యారంగదల్లి నై హరుని నేనైన
నరనెదగాక; యి ట్లఱలేక వెనుచు
తరుణీయకా దెట్లు దల్లి దా" ననుచు
ననయంబు బెజ్జమహాదేవి దాన
జనని యై పరమేశు దానయు గావించి
తొంగిళ్లపై నీది లింగమూర్తికిని
నంగన గావించు నభ్యంజనంబు;
ముక్కొత్తు, జెక్కొత్తు, ముక్కన్ను బులుము,
నక్కొత్తు, గడుపొత్తు అట వీపు నివురు,
బెరుగంగవలె నని తరుణి వీడ్వడగ
జరణము లఱ్రముల జాగంగ దిగుచు.
నలుగులు నలుచు నర్మిలి గట్టిపెట్టి
జలములు వీపున జఱచు నంతంత.
వెగచి బెగడకుండ వెన్ను వ్రేయుచును
నొగి మస్తకమును నీ రొత్తు దోయటను;



వదనంబు సొచ్చునో యదకంబు లనుచు
నదుము బొట్టను నోరి కడ్డంబువట్టు;
జెన్నుగా – బసుపార్చి చేయు మజ్జనము
గన్నులు జేవులును గాడంగ నూదు;
నంగిటిముల్లొత్తు నందంద వ్రేల
దొంగిళ్ల గార్నీరు దోనెత్తి మిడుచు;
బడతిచే నీరందూపొడిచి బొట్టిడును;
మడది యంగుష్ఠంబుమ న్నింత మెదిచి
కడవ నంటినయట్టి పిడుక విభూతి
యదర బుత్రుని నొసలారంగ బూయు;
నెత్తు గ్రుంగెడు నని యెత్తంగ వెఱచి
యత్తన్వి ఱొమ్మున నక్కువ నదుము;
కాటుక యిడ నింత గన్నగు ననుచు
గాటుక యిడు మూడుగన్నులగలయ;
జన్నిచ్చు; బక్షుల జననీదు మీద;
నన్నాతి గొండొక వెన్నయు బెట్టు;
జెక్కిలి గీటుదు బెలగి యేద్వంగ
నొక్కనే లిడి పోయు నొకకొన్నివాలు
ఉగ్గులు వోసియు నువిద సంప్రీతి
నగ్గించు నొగియించు ముద్దులు వేదు;
ముద్దాడు నగియంచు ముద్దులు వేదు;
నద్దికొన్ వీ రెవ్వ రయ్యరో యనుచు
బన్నుగా నుదరంబు బాన్పుగా జేసి
కున్న జోసఱచుచు సన్నుతిబాడు"
గొడుకని యిబ్బంగి గొనియాడుచుండ
బడతి నిశ్చలముగ్ధభావంబునకును

శివుడును మెచ్చి తాజేకొనియుండె
నువిద గావించు బాల్యోపచారములు.
శ్రుతి "యేకయేవ హి రూవేణ" యనియు
స్మృతి "సాధక స్సంస్మరే త్సదా" యనియు
ధరతస "తన్మయతాంయాతి" యనియు
హరునివాక్యము గాన యది యేల తప్పు?
భక్తుడెబ్భంగిగా భావించు శివుడు
వ్యక్తిగాదద్రూపుడై యుండు టరుదె?
యని భక్తమండలి వినుతింప గొన్ని
దినములు సనగ నద్దేవదేవుండు
వెండి యమ్మకు బ్రసన్నుండుగా దలంచి
'దండిరోగం బైన తఱుచంటిక్రియను
జన్నును గుడువక సంధిల్ల నోరు
వెన్నకుం దెఱవకయున్న యాక్షణము
బిట్టుల్కిపడి తల్లి బిమ్మిటి నొడలు
బట్ట లే కాపద గిట్టి" నాయన్న!
నాకున్న ! నాపట్టి ! నాచిన్నవడుగ!
నాకుట్టు చ న్నేలరా కుడ్వవైతి?
నీచెమటయు జూచి నెత్తురు నవుదు
నోచెల్ల! యెటు సూడనోపుదునన్న!
తల్లింగదన్న! యింతటి కోర్తునన్న!
యెల్లెడ నొరుల నే నెఱుగగదన్న!
కలిగితి లేక యొక్కడవు గదన్న !
తలరక యే నెట్లు దరియింతునన్న !
నేలపై నాకాళ్లు నిలువవురన్న!
యేల పల్కవు నెప్పవే యన్న! నీకు



నతిమియో? కోపమో? యంగిటిముల్లా!
యెఱుగను మందుమ్రాకేమియు" ననుచు
బనవు బలవరించు, బయింబడి పొరలు,
గనుగొను మైవుడ్కు, గౌగిటజేర్చు,
గప్పు, దెఱచు, గప్పు, గ్రమ్మఱ దెఱచు,
దప్పిక వీక్షించు, దల్లడం బందు
బొంగెడుగడుపుముప్పునను 'బొప్పనికి
సంగిటిము అయ్యో' నని నరు లనగ
నడలుచుం గడుశోకజడధి దేలుచును
యెప్పాట నినంబొందునే తెపు ల్నొప్పి?
నిప్పునజెద లంటునే? నీకు నీవ
చేసికొనగ దెవు ల్సిద్ధించె గాక
యీసంకటంబు నీ కేల తావచ్చు?
బనియేమి? మాటల బాయునే తెవులు
నిను గొంత వీటిడితన మద నేల?
చాల జాడగ నీసంకటం బింక
బాలుండ ! నీమీద బ్రాణము ల్విడుతు."
నని తనిశిరమున కలుగ నున్నంత
దనతల్లి కపుడు ప్రత్యక్ష మై నిలిచి,
"యదుగు మిచ్చెద నీకు నభిమతం" బనుడు
"గొడుక: నాకొకకోర్కికొఱతయం గలదె?
నీవు నిరోగి వై నిత్యుండవై సు
ఖవాప్తి నుండు నా కంతియె చాలు;
కన్న మోహంబునకంటె నగ్గలము
ఎన్న బెంచిన మోహ మెందు నటంద్రు
అటుగాన నినుగన్నులార జూచుచును

నిట యుండుటయె నాకు నీప్సితం" బనిన
మందస్మితముఖారవిందుడై తల్లి
వందంద కౌగిట నప్పలింపుచును
ముల్లోకములకెల్ల ముత్తవ ! నాకు
దల్లివి గాన నాతల్లి ! నీయట్టి
తల్లిని గలుగంగ దనకు రోగంబు
బెల్లడ బొందంగ నెట్లుండవచ్చు?
ననుచు నిత్యత్వ మాయమ్మకు నొసగె.
ననుపమపరముపరానంతమూర్తి,
యమ్మయై శివుగొనియాడుటజేసి
యమ్మవ్వ యనునామ మయ్యె. సార్థకము

**సంక్షిప్త ప్రశ్నలు :**

1. తల్లి తనయుని ఎట్లు పెంచును?
2. తల్లి కుమారునెట్లు తీర్చిదిద్దును?
3. శివుడు బెజ్జమహాదేవి కడ వర్తించిన విధమెట్టిది?
4. శివుడు బెజ్జమహాదేవికి ప్రసన్నుడు కాదలచి యేమిచేసెను?
5. బెజ్జమహాదేవికి అమ్మవ్వ అను పేరు ఎట్లు వచ్చెను?

వివరణాత్మక ప్రశ్నలు :

1. పరమేశ్వరునికి తల్లియుండిన నెట్లుండెడిది?
2. బెజ్జమహాదేవి శివుని తన తనయునిగా చూచికొనిన విధమెట్టిది?
3. స్తన్యము నొల్లని శివుని గురించి బెజ్జమహాదేవి ఎట్లు తల్లడిల్లెను?
4. శివుడు బెజ్జమహాదేవికి ముక్తినిచ్చిన వృత్తాంతమును వ్రాయుము.

**అర్థములు :**

| | | |
|---|---|---|
| కళకంఠుడు | = | గరకంఠుడు విషకంఠుడు (శివుడు) |
| భర్గుడు | = | శివుడు |
| త్రైలోక్యపతి | = | ముల్లోకములకు అధిపతి |
| తొంగిళ్ళు | = | తల్లులు చంటిపిల్లలకు తలంటునపుడు వారు పరుండుటకై దగ్గర చేర్చి సాచి యుంచెడి తొడలు పై భాగము |
| ప్రల్లదుడు | = | ధూర్తుడు, ఆగడములు చేయువాడు |
| అక్కు | = | రొమ్ము |
| అంగిటిముల్లు | = | కొండనాలుక, (ఉపజిహ్వక) |
| మజ్జనము | = | స్నానము |
| ఏకఏవహిరూవేణ | = | ఒకే రూపముతో |
| సాధక స్సంస్మరేత్ సదా | = | సాధకుడు సంస్మరింపవలెను |
| తన్య తన్మయతాంయాతి | = | తనయొక్కతన్మయత్వమును పొందున |
| బిమ్మిటి | = | పారవశ్యము |
| వీటిడి తనము | = | అవివేకము |
| అటిమి | = | కంఠరోగము |
| బొప్పడు | = | పిల్లవాడు |

**వ్యుత్పత్త్యర్థములు:**

| | | |
|---|---|---|
| 1. భర్గుడు | = | కానుకాలాదుల భరించు(అంతమొందించు) వాడు పరమేశ్వరుడు |
| 2. పక్షి | = | రెక్కలుగలది |

**పర్యాయపదములు:**

| | | |
|---|---|---|
| హరుడు | = | శివుడు, పరమేశ్వరుడు, రుద్రుడు |
| జనని | = | మాత, తల్లి, సావిత్రి |
| ఉదకము | = | నీరు, వారి, సలిలము, జలము |

**వ్యతిరేకపదములు:**

| | | |
|---|---|---|
| దుఃఖము | × | సంతోషము |
| ఉపేక్ష | × | అవేక్ష |

**సంధులు:**

| | | |
|---|---|---|
| ఉగ్గులు + పోయు | = | ఉగ్గులుపోయు (గసడదవాదేశసంధి) |
| జడలు + కట్టు | = | జడలుగట్టు (గసడదవాదేశసంధి) |
| అంత + అంత | = | అంతంత (ఆమ్రేడితసంధి) |
| ఏ + పాట | = | ఎప్పాట (త్రికసంధి) |
| ఆ + తన్వి | = | అత్తన్వి (త్రికసంధి) |
| ముద్దు + ఆడు | = | ముద్దాడు (ఉకారసంధి) |
| చేకొని + యుండె | = | చేకొనియుండె (యడాగమ సంధి) |



# 3. హనుమంతుడు సీతను చూచుట

**–మొల్ల రామాయణము**

## హనుమంతుడు సీతాదేవిని దర్శించుట

**కవయిత్రి చరిత్ర:**

ఈ పాఠ్యభాగము మొల్ల రామాయణములోనిది, ఈ గ్రంథమును 'మొల్ల' యను కవయిత్రి రచించెను. ఆంధ్రభాషలో మొదటి కవయిత్రి యీమెయే. ఈమె కుమ్మర వంశమునకు చెందినది. తండ్రిపేరు కేసన. ఇంటి పేరు ఆతుకూరివారు, కృష్ణరాయలకాలమున (16వ శతాబ్దమున) నుండెనని విమర్శకుల అభిప్రాయము.

ఈమె కవిత్వము మృదుమధురమైనది. "కందువ మాటలతో సామెతలతో నిండి వీనులవిందై" యందముగ నుండవలయునని గ్రంథ కర్త్రియే చెప్పినది. "గూఢ శబ్దములనుగూర్చిన కావ్యమ్ము మూగ చెవిటివారి ముచ్చటగును" అని యామె తలపు. శ్రీరాముని ప్రేరణముననే తానీ కావ్యమును రచించితినని చెప్పినది. మొల్ల రామాయణము ధారాళమగు శైలితో నొప్పారెడి ఒక మధురమైన కావ్యము.

ప్రస్తుత పాఠ్యభాగము సుందరకాండములోనిది, సీతా దేవిని లోబఱచు కొనుటకు రావణుని పన్నాగములను సీత పాతివ్రత్యమును, హనుమంతుఁడు సీతాదేవిని దర్శించి, శ్రీరాముని కుశలవృత్తాంతమును తెలిపి యంగుళీయక మిచ్చి యామె శిరోరత్నమును గైకొనిపోవుటయు నిందలి ఇతివృత్తము.

సీతను వెదకుటకై సుగ్రీవునిచే దక్షిణ దిక్కునకుఁ బంపఁబడిన హనుమంతుఁడు మొదలగు వానరులు సీతను కనుగొన నేరక దుఃఖితులై యుండఁగా 'సంపాతీ' యను పక్షిరాజువలన సీతాపహరణ వృత్తాంతమును విని హనుమంతుఁడు

సముద్రమునుదాటి లంకలో ప్రవేశించి సీతాదేవిని వెదకుచు అశోక వనమున కేగి సీతాదేవిని చూచెను. ఇంతలో నావణుడచటి కేతెంచెను. ఇచటి నుండి కథ యారంభమగును.

*   *   *

క. పావని కనుఁగొనే నప్పుడు
పావన విఖ్యాతసుగుణ భానో పేతన్
సేవితదనుజవ్రాతన్
భూవనితాజాత. నిత్యపూతన్ సీతన్. 1

వ. ఆరామం జూచి శ్రీరామచంద్రుని దేవినిఁగాఁ దలంపుచు నగ్గోపురంబునుండి డిగ్గి సూక్ష్మరూపంబుఁ గైకొనిశింశుపా వృక్షంబారోహించి యందు. 2

సీ. పతిఁ బాసినట్టియాపదకంటెఁ బలుమాఱు
వివిధమాయల చేత వేఁగి వేఁగి
వీర దానవకోటివికృత వేషంబులు
కనుఁగొని చిత్తంబు క్రాఁగి క్రాఁగి
తనదిక్కు లేమికై తల్లడిల్లుచు నాత్మ
లోపల మిక్కిలి లోఁగిలోఁగి
కర్ణకఠోరంబుగా నాడుమాటలఁ
దొరఁగెడికన్నీటఁ దోఁగి తోఁగి

ఆ. రాముఁ దలంచుకొంచు రామునిఁ బేర్కొంచు
రామ! రామ! యనుచు రమణి పలుకఁ
గపివరుండు సూచి కామినీరత్నంబు
సీత యనుచుఁ బొంగె జిత్తమందు. 3

వ. అట్టి సమయంబున రావణాసురుండు సీతాపహృతహృద యుఁడై పన్నీట మజ్జనం బాడి దివ్యాంబరంబులు గట్టు కొని కర్పూసమ్మిళితంబైన శ్రీ గంధంబు నెఱపూఁత పూసి పారిజాత పుష్పంబులు ముడిచి మవ్వంపుఁ దావి నివ్వటిల్లెడు జవ్వాది మెత్తి దశశిరంబులయందును రత్న ముకుటంబులు ధరించి మణిమండితంబు లగుకుండలములు పూని భానుప్రభావిలసితంబు లగుపతకంబులును ముక్తా హారంబులును భుజకీర్తులును బాహుపురులును నంగుళీ యంబులును నవరత్న స్థగితం బగునొడ్డాణంబును నమరించి చంద్రహాసహస్తుండై కందర్పవిలాససుందరం డగుచుఁ గిన్నర కింపురుష గంధర్వామరోరగ సిద్ధ విద్యాధరాంగన లుభయ పార్శ్యంబుల నాలవట్టంబులు పట్టి మౌక్తికచ్ఛత్రంబులుమ దాలవృంతంబులును వింజామరంబులును ధరి యించి రాఁగొందఱు కరదీపికాసహస్రంబులు గైకొని ముందఱఁ బిఱుఁదనేతేర నశోకారామంబునకు జనుదెంచె నప్పుడు గంధవాతూలంబునం దూలు పుష్పలతయునుం బోలె వడవడ నడచుదన సుందరాంగంబులు హస్తోరు వస్త్ర కేశంబుల మాటియుఁ గప్పియు నడంచియు నివురుగప్పిన నిప్పు చందంబున ధూళిధూసరం బగు రత్నంబుకై వడి మేఘచ్ఛన్నంబగు చంద్రబింబంబు డంబున నిత్తడిపొదిగిన కుందనంపుశలాక లాగున మాఱుపడి యున్న జానకిని గదిసి. 4



క. సీతను కనుఁగొని రావణుఁ
డాతతనయవాక్యఫణితి నతికుతుకమునన్
జేతో భవనిశి తాంబక
పాతంబులఁ జాల నొచ్చి పలుకఁగఁ జొచ్చెన్. 5

లయగ్రాహి
తోయజదళాక్షి వలరాయఁ డిటు లేచి పటు
సాయకము లేర్చి యొపు డేయఁగఁ గడంగెన్
దోయదపథంబున సమేయరుచితోడ నుడు
రాయఁడును మించి వడ గాయఁగఁ గడంగెన్
గోయిలలుఁ గీరములుఁ గూయఁగ నళివ్రజము
లేయెడలఁ జూచినను మ్రోయుచుఁ జెలంగెన్

నాయెడఁ గృపారసము సేయ కవివేకమున
నీయెడల నుండు టిది న్యాయమె లతాంగీ! 6

వ. అని మఱియును, 7

సీ. అలకేశ్వరం డుపాయనముగా నిచ్చిన
అంచిత చీని చీనాంబరములు
దివిజాధినాథుండు దినదినంబును నిచ్చు
పారిజాతోల్ల సత్ప్రసవములును
దక్షిణాధీశుండు తగఁ గాన్క లంపిన
సురభికర్పూరాదిపరిమళములుఁ
బాతాళముననుండి ఫణిసార్వభౌముండు
పుత్తెంచినటువంటిభూషణములుఁ

తే. గలవు నాయింట నేప్రొద్దుఁ గడమ లేక
దేహపరితృప్తిఁ గావించి మోహమలరఁ
గాము కేళిసుఖంబులఁ గీలయుటొప్పు
విడువు మడియాస రామభూవిభునిమీఁద. 8

సీ. ఎవ్వానివీటికి నేడువారాసులు
పెట్టనికోటలై పెచ్చు పెరుఁగు
నెవ్వాని సేవింతు రింద్రాది దేవత
లనుచరబలులయి యనుదినంబు
నెవ్వానిచెఱసాల నేప్రొద్దునుందురు
గంధర్వ సుర యక్ష గరుడ శాంత
లెవ్వానిభండార మిర వొంద విలసిల్లు
నవనిధానంబుల వివిధ భంగి

తే. సకలలోకంబులును మహోత్సాహవృత్తి
నెవ్వనికిఁ జెల్లుఁ బుష్పక మ్మెక్కి తిరుగ



నాకెతక్కంగఁ గలదె యేనాఁటనైన
మద్భుజాశక్తి ప్రతిపోల్ప నద్భుతంబు. 9

సీ. శ్వసనుండు లోగిలి సమ్మార్జనముఁజేయ
నభినాథుఁడు కలయంపి సల్లఁ
బావకుం డరుదెంచి పాకంబు లొనరింప
శమనుండు వెసఁ బరిచర్యఁ జేయఁ
బాకారి కల్పక ప్రకరంబు లర్పింప
దనుజేశ్వరుండు కైదండ యిడఁగ
నరవాహనుండు దా నగరివెచ్చము వెట్ట
నీశానుఁడు విభూతి నెలమి నీయ

తే. గురుఁడు పంచాగ మెప్పుడు సరవిఁజెప్ప
నమరకిన్నరగంధర్వయక్ష భుజగ
సిద్ధకింపురుషాంగనల్ చేరి కొలువ
వైభవంబునఁ జెలు వొందువాఁడఁ దరుణి! 10

ఉ. ఎత్తితి శంకరాచల మహీనబలంబున బంతిలాగునన్
మొత్తితి సర్వదిక్పతులు మూఁగినగర్వము విచ్చి పాఱఁగా
నొత్తితి శత్రుభూపతుల నుగ్రరణంబున భూమిఁ ద్రెళ్ళంగా
మొత్తితి భోగికంఠము లమోఘజవంబున మేటికీర్తులన్. 11

తే. జడలు ధరియించి తపసులచందమునను
దమ్ముఁడును దాను ఘోరదుర్గమ్ములందు
కూరగాయలు గూడుఁగా గుడుచునట్టి
రాముఁ డేరీతి లంకకుఁ రాంగలందు 12

ఆ. ఇంకఁ జేయ నేర రీదంగ నోపరు
కట్టలేరు చుట్టి పట్ట లేరు

జలధి దాఁట లావు చాలదు నరులకు
వచ్చు టెట్టు చెపుమ వారిజాక్షి. 13

క. దానవు లెప్పుడు చూచిన
మానవులను గెలువఁ గలరు మది నూహింపన్
మానవభక్షకులై మను
దానవులను గెలువ నరులతరమే జగతిన్. 14

క. జగతీశుఁడు మానవుఁ డంట
నగరే భుజశక్తి చేత నా కెదు రన్నన్
నగధరుఁడో నగధన్వుఁడొ
నగ భేదియొ కొంత కొంత నాతోఁ బోరన్. 15

వ. ఆ సంగతి యట్లుండ నిమ్ము. 16

క. నీకన్నులసౌభాగ్యము
నీకుచములఁ గలుగుమేలు నీముఖ కాంతుల్
నీ కరముల లావణ్యము
నాక స్త్రీలందు లేవు నాకుం జూడన్. 17

మ. సురకాంతల్ సరిరారు యక్షసతులున్ సూటింపఁగా రారు కి
న్నర భామల్ ప్రతిరారు సిద్ధవనితల్ న్యాయంబుఁ గాబోలరా
గరుడ స్త్రీలసమాన లెంతో చవుకల్ గంధర్వలోలాక్షులున్
మఱియేరీ? నినుఁ జెప్పి చెప్పఁ దరుణుల్ మత్తేభకుంభ స్తనీ. 18

క. క్రీడ యలంకారముగా
నాడుము భయ ముడిగి మధుర మైనమృదూక్తుల్
బేడినల నేలుకన్నులఁ
జూడుము కనుజెప్ప లెత్తి సుదతీ నన్నుకొ. 19

వ. అని యిట్లు నోరికి వచ్చినమచ్చునఁ బ్రేలుచున్న యా నీచుని దుష్టభాషణంబులకు
రోసి తృణంబు చేపట్టి జనక భూపాల నందనయిల్లనియె. 20



క. పతి దైవముగా నెప్పుడు
మతిఁ దలంచుచు నుండునట్టిమగువలఁ
జెఱువన్ బ్రతిన గలయట్టితోఁ
బ్రతివచనము లాడుకంటెఁ బాపము గలదే. 21

క. పరదారాపేక్షకులగు
పురుషుల కాయువు నశించుఁ బుణ్యము సెడు స
త్పురుషులు దూషింపఁగఁ దుది
నరకంబునఁ బడుదు రనెడిన్యాయము వినవే. 22

వ. అదియునుంగాక, 23

క. తనసాహసంబు తానే
కొనియాడునతండు హీనగుణుఁ డని వినుచున్
నిను నీవ పొగడుకొంటివి
వినఁ గూడదు నీదునీతివిరహిత భాషల్. 24

ఉ. సంగరరంగమందు నతిశౌర్యమునన్ రఘురాముతోడమా
తంగతురంగ సద్భటశ తాంగబలంబులఁ గూడి నీవు పో
రంగను నోప కిప్పుడు విరాధఖరాదులపాటుఁ జూచియున్
దొంగిలి నన్నుఁ దెచ్చితివి తుచ్ఛపుఁబల్కులుపల్కఁబాడియే. 25

సీ. కూకటిముడికినై కురులు గూడనినాఁడె
బెదరక తాటక, బీఁచ మణఁచె
గాధేయుఁ డొనరించుక్రతువును రక్షింపఁ
బెక్కండ్రు దైత్యుల నుక్కణం చె
నవనిపై విలసిల్లునఖిలరాజన్యులు
వ్రేలఁ జూపఁగ లేనివిల్లు విఱిచె
ఘోరాటవులలోనఁ గ్రుమ్మడనప్పుడు
ఖరభూషణాది రాక్షసులఁ జంపెఁ

తే. బాదరజమున నొకతాయిఁ బడఁతిఁ జేసె
లీలమాయామృగంబును గూలనేసె
రాజమాత్రుండె మేదినీరక్షకుండు
రామభూపాలుఁ డాదినారాయణుడు. 26

తే. అట్టి రామున కీయబ్ధి యనఁగ నెంత
లంక యన నెంత దనుజులపొంక మెంత
నీ వనఁగ నెంత నీలావు చేవ యెంత
చెప్ప నేటికి నీ వె చూచెదవు గాక. 27

శా. వీరాలాపము లాడ నేల వినుమీ విశ్వప్రకాశంబుగాఁ
బారావారముఁ గట్టి రాఘవుఁడు కోపస్ఫూర్తి దీపింపఁగా
ఘోరాజిన్ నిను డాసి లావు కలిమిన్ గోటీరయుక్తంబుగాఁ
గ్రూ రాస్త్రంబుల మస్తములునిమి భుక్తుల్ పెట్టు భూతాళికిన్. 28

శా. ఆరూఢ ప్రతిమానవిక్రమక ళాహం కార తేజోనిధిన్
శ్రీరామున్ సుగుణాభిరాముఁ దెగడన్ జేకొన్ననిన్నాజిలో
దారన్ దొంగిలితంచు నిష్ఠురగతిన్ దండించి ఖండింప ము
న్నీ రెట్టైనను దాఁటివచ్చు నలుకన్ నేఁడెల్లి శాంతింపుమా. 29

వ. అని తన్నుఁ జీరికిం గొనక వీరాలాపంబు లాడ రావణుం డొడుపుదప్పిన
కాలాహిచందంబున నుగ్రుడై మండిపడి యిట్లనియె. 30

క. ఆఁటది గా యని కూరిమి
పాటించినకొలఁది నన్నుఁ బలుకఁగఁ జొచ్చెన్
మాటాడకుండ నాలుక
తూఁటులుఁగా జేయకున్న దోసము గాదే. 31

క. కుయ్యాడక నాముందఱఁ
గయ్యమునకుఁ గాలు దువ్వఁ గడఁగెను దీనిన్



దయ్యాలకు బలి పెట్టెద
వ్రయ్యలుగా నతికి యెల్ల వారును జూడన్. 32

క. కాకున్న దీని బలిమిని
బైకొని నాకాంక్ష దీఱ భావజ కేళిన్
జేకొనక విడిచిపెట్టినఁ
గైకొనునే నవ్వుఁగాక గర్వము పేర్మిన్. 33

శా. భీమాటోపభుజప్రతాపమహిమ భీమాచలం బెత్తి సు
త్రామాద్యష్టదిగీశ సైన్యముల సంగ్రామంబులో నోర్చి యు
ద్దామప్రౌఢిఁ జెలంగుచుండెదుకళాధాముండనాముందటన్
రామున్ గీమునిఁ జెప్ప గిప్ప నగరా రాకేందుబింబాననా! 34

సీ. అఖిలలోకముల నాయాజ్ఞ నిల్పితి నేక
హేలను బుష్పకం బెక్కి తిరిగి
వేల్పు మూఁకల చేత వెట్టి సేయించితి
దితివంశవల్లభుల్ నుతులు సేయ
గణములతోఁగూడ గైలాసమె త్తితి
జటువైన పూవులబంతి పగిది
వనజగర్భుని చేత వరములు గై కొంటి
దండిగా నత్యుగ్రతపముసల్పి

తే. చెఱను పట్టితి గంధర్వసిద్ధసాధ్య
భుజగ సురయక్షకిన్నరముఖ్యసతుల
నిట్టిసామర్థ్య మెవరి కేనాఁడు గలదు
మహిని నాకొక్కనికె కాక మంజువాణి. 35

తే. నాకు నెదిరింప నొక పేదనరుని నొడ్డి
వెఱవ కీరీతి దుర్భాష లఱచు దీని

జిహ్వ మొదలంటఁ బట్టి యీశితకుఠార
ధారఁ దునుమాడి ధారణి బారవైతు. 36

వ. అని చంద్రహాసంబు జంకించి లేవనుంకించుతఱిఁ గొందఱు ప్రియసుందరు
లడ్డంబు సొచ్చి. 37

చ. సురవరుఁడో ధనంజయుఁడొ సూర్యతనూజుఁడొ యాతుధానుఁడో
శరధివిభుండొగాడ్పొ పురశాసనుమిత్రుఁడొ భోగిభూషుడో
గురుభుజశక్తిఁ గైకొనుచుఁగోపముసూపఁగనీకు నెంత యి
త్తరుణీపయిం బ్రతాపమున దారుణకృత్యముసేయఁ గూడు. 38

క. ఏటికి మీ రేటు కీనియంగ
గాటపుజం కెన యె చాలుఁ గరవాలున కీ
యాటఁది యర్హ మె మము నీ
మాటికి మన్నించి కావుమా యిఁకఁ జాలున్. 39

వ. అని శాంతవచనంబులఁ బ్రియంబు సెప్పిన నప్పంకరదహాక్షుల విన్నపంబులు
మన్నించి యారాక్షసచక్రవర్తి వైదేహికిఁ గావలియున్న యేకజటా ద్విజటా
త్రిజటా దుర్మఖీ వాయుముఖీ శూర్పణఖ లాదిగా గల దైత్య కామినులవంకఁ
గనుఁగొని. 40

క. గడు విచ్చితి నిరుమాసము
లొడఁబఱుపుఁడు నేర్చునట్టు లొడఁబడ కున్నన్
గడికండలు గాఁ గోసుక
పడతులు భక్షింపు డింతివలలం బంతన్. 41

వ. అని రోషారుణిత నేత్రుండై యతిభీషణాకారంబుఁదాల్చి పలికిన. 42

క. తనపతి నిందించుటకును
దనప్రియములు చెప్ప వినక తక్కినమీఁదన్



దనుఁజంపుఁ దన్న మాటకు
నినకులవల్లభుని దేవి యేడ్చెన్ బెలుచన్. 43

సీ. జానకి శోకింప సాధ్యకిన్న రయక్షి
గుడోరగా మరకాంత లెల్ల
వెంటనే శోకింప విని గంధవహుపుత్రుఁ
డాత్మలోఁ జింతించి యాగ్రహమున
నీదుష్టదైత్యుపై నిప్పుడే లంఘించి
చెండాడ నా చేతఁ జిక్క నేని
కార్యంబు లెస్సగుఁ గాక సత్త్వము తూలి
బలువీడి వీనిచే బడితి నేని

తే. సీతఁ గానంగ లేక కృశించి రామ
భద్రుఁడఁగిన సీతయుఁ బ్రాణ మెడలు
లక్ష్మణుండును జూడ నాలస్య ముడిగి
తెగును నట్లైనఁ గార్యంబు తెలుగుఁదప్పు. 44

చ. అని పవనాత్మజుండు దివిజారిపయిం దెగ వేళగాదు భూ
తనయకు నాదురాక వసుధావరుమేలు నెఱుంగ జెప్పి మీఁ
దను మఱి చూత మంచు నుచితస్థితి నూరకనుండె నప్పుడా
దనుజవిభుండు వోయె నిజధామముఁ జేర సతీసమేతుఁడై. 45

వ. అప్పుడు యామినీచర కామినులు రావణానుమతంబున ననేక విధంబు
లగుమధురాలాపంబుల మిథిలాధీశుకు మారిం గుఱించి బోధించి కార్యంబు
సాధింప నోపక యలసి యుంటం జేసి యొక్కింత సేపు నిద్రించుచుండ
మేల్కొని త్రిజట యను నిశాచరి యిట్లనియె. 46

మ. కలగంటిన్ వినుఁడింతులార మనలంకాద్వీప మీయబ్ధిలో
పల వ్రాలన్ మనరావణేశ్వరునిశుంభ ద్రత్నకోటీరముల్
కలనన్ గూల రఘూద్వహుండెలమితో గంధద్విపం బెక్కియు
జ్జ్వల కాంతిన్ విలసిల్లుసీతఁ గొనిపోవన్ మిన్న కేనిప్పుడే. 47

క. శుద్ధాత్ముఁ డైన రాముఁడు
శుద్ధాంతపు దేవిఁ గాన శుభసూచకముల్
శుద్ధ మయి తోఁచుచున్నవి
సిద్ధం బీమాట వేదసిద్ధాంతముగాన్. 48

క. కావున నిక్కోమలియెడఁ
గావలి యున్నట్టిమీరు కఠినోక్తులు గా
నేవియు నాడకుఁ డింక నీ
దేవియ రక్షింప మనకు దిక్కగు మీఁదన్. 49

వ. అని చెప్పి మఱియును. 50

క. అమ్మా వెఱవకు మదిలో
నిమ్ముగ మఱి వేడ్క నుండు మిఁక నీమగఁడున్
నెమ్మిగ నినుఁ గొనిపోవును
మమ్మందఱ మనుపు మమ్మ మఱువక కరుణన్. 51

ఆ. అనుచు దనుజ కాంత లంతంత నెడఁబాసి
నిదుర వోయి రంత నదరి సీత
తనకు దిక్కు లేమిఁ దలపోసి దుఃఖింపఁ
బవనసుతుఁడు మనుజభాషఁ బలికె. 52

క. ఉన్నాఁడు లెస్స రాఘవుఁ
డున్నాఁ డిదె కపులఁ గూడి యురుగతి రానై
యున్నాడు నిన్నుఁ గొని పో
నున్నాఁ డిది. నిజము నమ్ము మూర్వీతనయా. 53

సీ. ఆమాట లాలించి భూమిజ తనలోన
వెఱ గంది శింశుపావృక్ష మరసి
చూడంగ నప్పుడు సూక్ష్మరూపంబున
నొడిక మాశాఖలనడుమ నున్న



కపికుమారునిరూప మపురూపముగఁ జూచి
స్వాంతంబులోన హర్షంబు నొంది
దనుజమాయల చేత దరచు వేఁగుటఁ జేసి
మారాడ నేరక యూర కున్న

తే. భావ మూహించి తన్ను నా దేవి యాత్మ
నమ్మ కుండుటఁ దెలిసి యాకొమ్మమీఁది
నుండి క్రిందికి లంఘించి నిండుభక్తి
మ్రొక్కి నిలుచుండి కరములు మోడ్చి పలికె. 54

ఉ. తమ్మునిఁగూడిపుణ్యగుణధాముడు రాముఁడువచ్చి మాల్యవం
తమ్మునసై న్యసంఘము ముదంబునఁ గొల్వఁగనుండి భూమిపై
మిమ్ములఁ జూచిరండనుచు మేటికపీంద్రులఁ బుచ్చియందు మొ
త్తమ్ముగమమ్ముఁగొందఱను దక్షిణభాగముచూడం బంపుచున్. 55

క. అంగన బొడఁగన నీ వి
య్యంగను గడుఁ జాలువాఁడ వంచును నాచే
నుంగర మంపెను శ్రీ రఘు
పుంగవుఁ డిదె కొ మ్మటంచు భూమిజ కిచ్చెన్. 56

ఉ. ఇచ్చినఁ జూచి రామధరణీశ్వరుముద్రికఁగా నెఱింగి తా
నిచ్చను మెచ్చి యాకువలయేక్షణ యాత్మగతంబునందు నీ
వచ్చిన దానిభావమును వల్లభుచందము నేర్పడంగ నేఁ
జెచ్చెర నంతయుం దెలియఁ జెప్పుము నమ్మిక పుట్టునట్లుగన్. 57

వ. అని విచారించి యిట్లనియె. 58

క. నిను విశ్వసింపఁ జాలను
వినుపింపుము నీ తెఱంగు విభునివిధము నా
కనవుడుఁ బావని తెలియఁగ
వినయంబున విన్నవించె విస్ఫుట ఫణితిన్. 59

ఉ. రాముని దాఁగురించి నినురావణుఁ డెత్తుక వచ్చు వేళ నీ
హేమవిభూషణావళుల నేర్పడ ఋశ్యమహాద్రివైచినన్
మే మని తీసి దాఁచితిమి మీపతి యచ్చటి కేఁగు దేరఁగాఁ
దామరసా ప్రనందనుఁడు తానవి సూపినఁజూచి మెచ్చుచున్. 60

సీ. అర్కసంభవునకు నభయంబు దయచేసి
దుందుభి కాయమ్ము దూలఁదన్ని
యేదుతాడుల సర్వ మేకమ్ముగాఁ ద్రుంచి
వాలి నద్భుతశక్తి గూలనేసి
సుగ్రీవునకుఁ దార సుదతిగా నిప్పించి
యంగ్గదు యువరా జనంగ నిలిపి
వారలతోడను వానర సైన్యంబు
లెన్నేనిఁ గొలువంగ నేఁగుదెంచి

తే. మాల్యవంతంబునం దుండి మనుజవిభుఁడు
నిన్ను వెదకంగ నందజ నన్ని దిశలఁ
బనుచునప్పుడు దక్షిణభాగ మరయ
సంగదుతోడఁ గొందర మరుగు చేర. 61

తే. వారిపంపునఁ నవలీల వార్ధి దాటి
వచ్చి సకలంబుఁ జూచి యీవంకఁ గంటి
రావణుఁడు వచ్చి నిన్ను నుగ్రంబు గాఁగ
బలుకునప్పుడు నున్నాఁడఁ బాదపమున. 62

వ. ఇవ్విధంబునఁ బలుకుచుండినను నమ్మక యతనిం గనుగొని రాముఁ డేరీతి వాఁడో యతనిచందం బెరింగింపు మనవు డావాయునందనుండు రఘు నందనునకు వందనం బాచ రించి భూమినందనకి ట్లనిచెప్పుచున్నాడు. 63

సీ. నీలమేఘచ్ఛాయ బోలు దేహమువాఁడు
ధవళాబ్దపత్ర నేత్రములవాఁడు



కంబుసన్నిభ మైనకంఠంబు గలవాఁడు
బాగై సయట్టి గుల్ఫములవాఁడు
తిన్ననై కనుపట్టు దీర్ఘ బాహులవాడు
ఘనమైన దుందుభిస్వనమువాఁడు
పద్మరేఖలు గల్గుపదయుగంబులవాఁడు
చక్కని పీనవక్షంబువాఁడు

తే. కపట మెఱుఁగనిసత్యవాక్యములవాఁడు
రమణి! రాముడు శుభలక్షణములవాఁడు
ఇన్ని గుణముల రూపింప నెసఁగువాఁడు
వరదస సౌమిత్రి బంగారువన్నె వాఁడు. 64

తే. ఉరుతరాటవిలోన మహోగ్రతవము
వాయు దేవుని గుఱియించి వరుసఁ జేసి
యంజనా దేవి గనియె న స్సర్థితోడ
సర్కజుని మంత్రి హనుమంతుఁ డంద్రు నన్ను. 65

వ. అని యిట్లు తాత్పర్యంబునఁ బట్టునట్లుగా విన్నవించి దేవీ! నీ దేవుండయిన శ్రీరాముండు నా చేతి కిచ్చి యంపిన నూత్న రత్నాంగుళీయకంబు నీకు సమర్పించితి నింక నాకు రిక్తహస్తంబులతోఁ జనుట దూతల కుచితమైన కార్యంబు. గాదు గావున నిన్ను దర్శించినందులకు శ్రీరామునకును నమ్మిక పుట్టునట్టులుగా నీశిరోరత్నంబు దయచేయవలయు ననుటయు నాకు శేశయనయన యిట్లనియె. 66

క. నానాథుక్షేమ మంతయు
ధీనిధి నీచేత వింటిఁ దెలియఁగ నైనన్
నీనిజరూపము చూడక
నే నారత్నంబు నమ్మి నీ కీయఁ జుమీ. 67

వ. అనుటయు నా హనుమంతుండు, 68

క. చుక్కలు తలపూవులుగా
నక్కజముగ మేను వెంచి యంబరవీథిన్
వెక్కస మై చూపట్టిన
నక్కో మలి ముదము నొందె నాత్మ స్థితికిన్. 69

వ. ఇట్లు తనమహోన్నతరూపంబు చూసి యెప్పటియట్ల మరల సూక్ష్మరూపంబు గైకొని నమస్కరించిన నాహనుమంతునకు నద్దేవి తనశిరోరత్నంబు సనుగ్రహించి యిట్లనియె, 70

చ. రవికులవార్ధిచంద్రుఁ డగురాముని సేమము చాల వింటి నా వివిధము లైనపాట్లు పృథివీపతికిం దగఁ జెప్పఁ గల్గె నేఁ డవిరళభంగి నీవలన నచ్చుగ నే నుపకార మేమియుం దవిలి యొనర్ప లేను వసుధాస్థలి వర్ధిలు బహ్మకల్పముల్. 71

వ. ఇట్లు దీవించి మఱియును. 72

క. ఏయెడఁ జూచినధరణీ
నాయకు శ్రీపాదయుగము నాచిత్తములో
బాయ దని విన్న వింపుము
వాయుతనూజుండ పుణ్యవంతుఁడ తెలియన్. 73

తే. ఇపుడు రావణుఁ డేతెంచి కపటబుద్ధి
గర్వమునఁ జేసి నన్నెన్ని కాఱులాడె
నన్నియును నీవు చెవులార విన్న తెఱఁగు
పతికి దయ పుట్టంగా విన్నపంబు సేయు. 74

సీ. నిడుద పెన్నెఱివేణి జడలుగా సవరించి
మలినజీర్ణాంబరం బొలియఁ గట్టి
భూమీరజంబు విభూతిపూతగఁబూసి
తనదివ్యమూర్తిఁ జిత్తమున నిల్చి
నిరశన స్థితితోడ నిలిచి భూశయ్యను
బవళించి నిదుర యేర్పడఁగ విడిచి



తారక బ్రహ్మమంత్రంబుఁబఠింపుచుఁ
గతిన రాక్షస దుర్మృగములలోన

తే. సహితలం కామహాద్వీపగ హనసీమఁ
దపము సేయుచు నున్నాను తన్నుఁ గూర్చి
నాకుఁ బ్రత్యక్షమగుమని నాథునకును
విన్నవింపుము సత్త్వసంపన్న! నీవు. 75

వ. అని చెప్పి మఱియును. 76

చ. జనకుని భంగి రామనృప చంద్రుని నన్నును దల్లిమాఱుగాఁ గని కొలువ్వంగ నేర్చుగుణగణ్యుని లక్ష్మణు నీతి పారగున్ వినఁ గని రానిపల్కు అవివేకముచేతను బల్కినట్టి యా వినుతమహాఫలం బనుభవించితి నంచును జాటి చెప్పుమా. 77

క. ఆమాటలు మది నుంచక
నామానముఁ గావు మనుచు నయవిషయగుణో
ద్దాముడుఁ రాముని తమ్ముఁడు
సౌమిత్రికిఁ చెప్పవయ్య సాహసివర్యా! 78

వ. అని యిట్లు జనక రాజతనయ పలికినపలుకు లాలకించి హనుమంతు డాజననితో నిట్లనియె. 79

క. ఇనుఁ డుదయింపకమున్నే
వననిధి లంఘించి మనుజవల్ల భుకడకున్
నినుఁ గొనిపో యెద వీఁపున
జననీ! కూర్చుండు మనిన సంతోషమునన్. 80

క. నీ వంతవాఁడ వగుదువు
నీవెంటనె వత్తునేని 'నెగడవుకీర్తుల్
రావణునికన్న మిక్కిలి
భూవరుఁడే దొంగ యండ్రు బుధనుత చరితా. 81

వ. అదియునుం గాక రామచంద్రునిం దప్ప నితరుల నంటు దానం గాను గావున నీతో రాఁ దగదు మఱియును. 82

క. దొంగిలి తెచ్చిన దైత్యుని
సంగడు లగువానివారిసాహస మొప్పన్
సంగర ముఖమునఁ జంపక
దొంగిలి కొనిపోవఁ దగునె దొరలకు నెందున్. 83

వ. మఱియు రామచంద్రుండు త్రిజగ దేక వీరుండును గోదండ దీక్షా గురుండును రాక్షసకులాంతకుండును నగుటంజేసి రాణివాసద్రోహి యగు రావణుని సంగరరంగంబునఁ బ్రఖ్యాతంబుగాజంపి కొనిపోవుట ధర్మంబు; నీవు రామ చంద్రునకుఁ బరమభృత్యుండువును బుత్రసముండవును నగుటంజేసి నీ వెంట నరుగుదెంచుట తప్పుగాక పోయినను బగ తీర్పకవచ్చు టుచితంబు గాదు, గావున నీవు రాఘు వేశ్వరుల కిన్నియుం దెలియ విన్నపంబుసేసి తడయక తోడ్కొని రమ్మనిన నద్దేనికి నమస్కరించి హనుమంతుం డిట్లనియె. 84

ఉ. నీవిభుఁ డబ్ధి దాటి ధరణీతలనాథులు సన్ను తింప సు
గ్రీవసుషేణీముఖ్యబలబృందముతో నరుదెంచి నీచునిన్
రావణు నాజిలోఁ దునిమి రాజన మొప్పఁగ నిన్నుఁగొంచుసే
నావళితోడ నీపురికి నారయ నేఁగు నిజంబు నమ్ముమా. 85

వ. అని విన్నవించి సమ్ముండై యద్దేవిచేత దీవనలు బొంది మరలి చనియె. 86



# II. గద్యభాగం

## 1. ఆంధ్రుల సాంఘికాచారములు

**– ఖండవల్లి లక్ష్మీరంజనం**

**కవి పరిచయం:**

ఖండవల్లి లక్ష్మీరంజనంగారు ఆచార్యులుగా, విశిష్ట పరిశోధకులుగా, భాషాశాస్త్రవేత్తలుగా, విమర్శకులుగా, పేరొందినవారు. వీరు ఉస్మానియా విశ్వవిద్యాలయమున ఆచార్యులుగా పనిచేయు కాలమున వివిధ విషయాలలో చర్చా సదస్సులను నిర్వహించి, విద్యార్థులలో చక్కని సాహిత్యాభి రుచిని పెంపొందించిరి.

'సిద్ధేశ్వర చరిత్రము', 'అహోబల పండితీయము' వంటి గ్రంథములకు వీరు సంతరించిన పీఠికలు వీరి గవేషణప్రాభవమునకు నిదర్శనములు.

తెలుఁగుదుక్కి, ఆంధ్ర వాఙ్మయచరిత్ర సంగ్రహము, ఆంధ్రుల చరిత్ర సంస్కృతి, శ్రీగిరి శతకాంగ్లానువాదము వీరి ముఖ్య రచనలు. సంగ్రహాంధ్ర విజ్ఞానకోశ నిర్మాణము, పరిశోధితాంధ్ర మహాభారత గ్రంథప్రచురణము, ఆంధ్ర చారిత్రక భౌగోళిక విజ్ఞాన సర్వస్వము వంటి వాఙ్మయ మహోద్యమములు ఖండవల్లి వారి కృషిని చాటుచున్నవి.

ప్రస్తుత వ్యాసము 'లక్ష్మీరంజన వ్యాసావళి' నుండి గ్రహింప బడినది.

* * *

భారత దేశంలో భావైక్యతను క్రొత్తగా నెలకొల్పి. తద్వారా జాతీయ భానమును పెంపొందించవలెనని తలచువారు నేడు పెక్కుమంది కాన్పింతురు. ఇటువంటి భావైక్యత శతాబ్దులనాటి నుండి దేశంలో వ్యాపించి ఉందని వీరు గుర్తించాలి. దాని అంతర్యం ఏమిటో, అది దేనిమీద ఆధారపడి ఉందో. అది కూడ చక్కగ పరిశీలించి తెలుసుకోవాలి. సాధ్యమైనంతవరకూ దానికి దోహదం చేస్తూ వెళ్లడమే విజ్ఞత అవుతుంది. కొందరు దీనికి విరుద్ధంగా ఆలోచిస్తారు. దేశంలో ఇదివరకుండిన భావైక్యత నామమాత్రమైనది. ఇంతే కాక అదివర్గ పీడనముమీద ఆధారపడి నిల్చినది. అందుచేత దానిని విచ్ఛిన్నముచేసి, శాస్త్రీయము, ఇతోధిక మానవతాభావ పూర్ణములయిన వ్యవస్థలను ప్రచలితం చేయాలంటారు. హేతువాదమునకు ఈ ఆలోచనా పరంపర నిలువగలిగి ఉన్నను అది యెంతవరకు ఆచరణ సాధ్యమో కాలమే నిర్ణయించాలి.

భారత జాతీయైక్యతకు మూలము అన్ని రాష్ట్రములందును ఒక విధమైన సాంఘిక వ్యవస్థ, ఆచారవ్యవహారములు వాడుకలో నుండుటయని చెప్పవచ్చును. ప్రస్తుతము ఆంధ్ర దేశమునందలి ఆచార వ్యవహారములను పరిశీలిద్దాము. పాశ్చాత్య సభ్యతపై ఆధారపడిన నూతన భావములు దేశమునందు ఇప్పుడు వ్యాపిస్తున్నాయి. ఒక తరానికి ముందు పూర్వపు సాంఘిక వ్యవస్థ తాలూకు ఛాయలు దేశంలో కనబడేవి. సాంఘికాచారాల్ని యథాతథంగా తెలుసుకోవాలంటే సంఘంలో కనబడే వివిధ వర్ణాలను గుర్తుంచుకోవాలి. ప్రధానంగా బ్రాహ్మణులు మున్నగు అగ్ర వర్ణములవారు మిగిలిన అవర వర్ణ ములవారు అనే విభాగం గమనించాలి. మనకు ఇష్టమా, అయిష్టమా అనే ప్రశ్న ప్రకలతము అనవసరము. 'స్థితిస్యగతిశ్చింత నీయా' అన్నట్లు ఉన్న దానిని గ్రహించాలి. ఆర్య-ద్రావిడ సంస్కృతీ భేదములను గూడ మనము జ్ఞాపకం ఉంచుకోవాలి. మరొక పేరుతో వీటిని పిలవాలంటే ఆర్యాచారములు అని పిలువవచ్చును.

సాంఘికాచారములని చెప్పబడేవానినే పూర్వులు 'షోడశకర్మలు' లేక' సంస్కారాలు అనేవారు. వానిలో ముఖ్యం జాతకర్మ, నామకరణం, అన్నప్రాశనం,



చౌలం, ఉపనయనం, విహోహం, గర్భాధానం, అంత్యక్రియలు. వీటిలోకూడ ఉపనయనం, ద్విజులకు మాత్రమే వర్తిస్తుంది. స్త్రీలకును ద్విజేతరులకును ఈ బాధ్యత లేదు. స్త్రీల విషయంలో పుంసవనం, సీమంతం అను విశేషాచారాలు కనిపిస్తున్నాయి. గర్భచిహ్నములు కనబడగానే పురుష శిశువు కలుగవలెనని చేసే సంస్కారం పుంసవనం, ఆఱవమాసమన గర్భిణికి చేసే శుభ సంస్కారమును సీమంతం లేక సీమంతోన్నయనం అని చెప్పుదురు. ఇప్పుడే గాజులు పెట్టించుట జరుగును. కొన్ని కుటుంబములందిది ముత్తైదువులకు పసుపు కుంకుమ తాంబూ లము మున్నగునవి ఇచ్చుటతోనే ముగియును. గాజులు పెట్టించుట ఉండదు. మన సంఘమునందు ఆర్యద్రావిడ జాతిజనుల కలయిక జరిగిన దనుటలో విప్రతిపత్తి లేదు. కావున వారి యాచారములను సమ్మేళనము చెంది ఒక నూతన సమన్వయ మేర్పడినది. మన సాంఘికాచారము లన్నిటిలోను ఆర్యుల సంప్రదాయములును దేశీయ సంప్రదాయములును సమ్మిశ్రితములైనవి. ఆర్యాచారములు కొంతవఱకు సంస్కృతిచే ప్రసన్నములై ఉంటాయి. దేశీ యాచారములందు మూఢ విశ్వాసములపాలు అధికంగా కనబడుతుంది. ప్రసూతికా గృహములో చేయవలసిన వ్యవస్థను గూర్చి తెలుగు కావ్యములలో ఎన్నో వివరాలు లభిస్తాయి. ఇందులో కొన్ని ఆరోగ్యసూత్రముల మేఱకు పరంపరగా వచ్చేవి. కొన్ని ఆచారములు భూతప్రేతాదులను పురిటియింటి నుండి దూరముగానుంచుటకై అనుష్ఠింప బడేవి.

వివాహమునందు ఆర్యాచారములు దేశీయ పద్ధతులు కలకలుపుగా కనబడతాయి. పాణిగ్రహణము, సప్తపది, సన్నెకల్లు త్రొక్కుట మొదలగునవి అర్యాచారములు. కావుననే వీటికి వైదిక మంత్రాలు ఉన్నాయి. మంగళ సూత్రధారణము దేశీయాచారముగానే భాసిస్తుంది. దీనిని మంత్రములతో గాక శ్లోకములతో నడుపుతున్నారు. తాళి కట్టుట అను సంస్కారము జనులలో బహుళ వ్యాప్తినందినట్లు కనిపిస్తుంది. వివాహమునందు పెక్కు వేడుకలు దేశీయా చారములుగ వాడుకలోనున్నవి. బాలదంపతులకు అన్యోన్య ప్రేమ కలిగించడానికి ఎన్నో ఏర్పాట్లు ఉండేవి. బంతులాడుట (పూల చెండ్లు) తలుపుల దగ్గర పేర్లు

చెప్పించుట, ఒకే కంచములో అన్నము తినిపించుట! దండాడింపు మున్నగునవి. దండాడింపు అనునది వేడుక నృత్యము. పనివారైన వధూవరులను పెద్దవారు ఎత్తుకొని బుక్కావల్లుచు నృత్యమాడుదురు. పెండ్లిలో దొంగవేలము అనుముచ్చట గలదు. పెండ్లి కూతురు బావగారు (అక్కమగడు) మఱదలిని దాచిపెట్టును. అప్పుడు పెండ్లి కొడుకు వంకవారు పెండ్లి కుమార్తె బావకు కట్నమిచ్చి నవవధువును విడిపించు కొందురు. మరియొక అందమైన వేడుక అయిరేని కుండలకు సంబంధించినది. అయిరేని కుండలు మనోజ్ఞముగా రంగులు పూసిన పెండ్లికుండలు, బ్రాహ్మణేతరులు వివాహతంత్రమునందు వీటి కెక్కువ ప్రాధాన్యం ఇస్తూన్నట్లు కనబడుతుంది. ముత్తైదువులు ఈ కుండలు పట్టుకువస్తారు. వీని ప్రయోజన మేమిటంటే, కుండనీళ్లలో బంగారము, వెండి వస్తువులు, ఉంగరము, మట్టె వంటిని నేసి నూతన వధూవరులచే తీయిస్తారు. వాటిని వెతకడంలో ఔత్సుక్యము కలిగి ఆ లేత దంపతులు ఆనందం పొందుతారు. బంగారపు వస్తువు పట్టుకొన్న వారు గెలిచినట్లు. ఈ యాచారము బ్రాహ్మణులందును కలదు. నాకబలి నాడిది చేయించుచుండిరి. కుండలకు బదులు బిందెలు వాడుదురు. రంగు పూత గలిగిన చిన్న కుండలను వివాహమునందు నాకబలినాడు బ్రాహ్మణ కుటుంబములవారును అలంకరించుచుండిరి.

తలంబ్రాలు పోసుకొనుట మిక్కిలి ప్రాచీన కాలమునుండియు వచ్చు చున్న ఆచారంగానే కనబడుతూంది. అక్షతలకు బదులు జొన్నలు వాడుట కొన్ని కులములలో నున్నది. అరుంధతీ దర్శనము చేయుట ప్రాచీనాచారముగనే ఉన్నది. అత్యంత ప్రాచీన కాలముననే ఆర్యులు జ్యోతిర్మండలమును బాగుగా పరిశీలించుటకు ఇది యొక తార్కాణము. మగ పెళ్లివారు వివాహమునకై తరలి వచ్చినప్పుడు ఆడపెళ్లివారు వారిని సన్నాహముతో ఎదురుకొని ఆదరించి పెండ్లికి తీసుకు వెళ్లుదురు. ఇవియే ఎదురుకోళ్ళు. వివాహములో చిట్టచివరి అంగము అప్పగింతలు. పెండ్లికుమార్తెను అత్తవారివంక వారికి పేర పేర అప్పగించి నూతన వస్త్రములు బహూకరింతురు. ఈ సమయము నందు కన్నీరు పెట్టని గృహస్థు దుండడు. ఇవికాక బూజముబంతి వంటి వేడుకలు పెళ్లిళ్ళలో ఎన్నో నడుస్తూ



ఉంటాయి. వివాహములో అంతా సంతోషమే గనుక ఎప్పుడో గృహస్థులయిన వారు కూడ నూతన కౌతుకమునకు లోనయి భోజనముల వేళ పిండి వంటలతో మొత్తులాడుదురు. పెండ్లిపాటలు నాటి హాస్యకరుణసన్నివేశములు. అదొక వెన్నెల జల్లు. ఈనాటి దుర్భర వ్యాపార నాగరకతయందు ఈ మహా సంరంభమంతయు తియ్యనికలగా మారిపోయినది.

పురుషులు నాడును నేడును బయటి జీవితమున కలవడిన వారే గనుక గృహ వాతావరణమునందు వారంతగా శోభించరు. అందుచేత సాంఘికా చారములన్నీ చాలావరకు స్త్రీలకు సంబంధించినవిగానే ఉంటాయి. పసుపు, కుంకుమ, పరిమళములు, రంగులు, అలంకరణములు, నగలు, అన్నీ వారి సొమ్ములు. శిశువు జన్మించిన పదకొండవనాడు 'బాలసారె' అను ఆచారము నడుపుదురు, జన్మ నక్షత్రము శుభాశుభములను బట్టి నూనెలోనీడ చూచుట మున్నగు ఆచారములు లాంఛనముగావైన ఇప్పటికీ ఉన్నాయి. పదకొండవ దినమునగాని, 21వ దినమునగాని, శిశువును తొట్టెల్లో వైతురు. ఈనాటి నుండియే శిశువు తల్లి చిన్న చిన్న యింటి పనులతో ప్రవేశించును. దీనికి గుత్తుగా కాబోలు స్త్రీలందరు బావికడకు వెళ్లి బాలెంతరాలిచే నూతిలో చేద చేయింతురు. ఇక్కడ ఒక మనోహరమైన ఆచారము వినవస్తుంది. జన్మించిన శిశువుయొక్క బొడ్డును తీసియుంతురట. అంతవరకును పిల్లలుపుట్టక మక్కువ పడుతున్న కొమ్మలచే ఆ బొడ్డుతునకలను తినిపించుటయో వాసన చూపించటమో చేయుదురు. దీనిచే వారికిని సంతానము కలుగునని నమ్ముదురు. "మీరు తినండంటే మీరుతినండనీ, మాకొద్దంటే మాకొద్దనీ' పూబోండ్లందరు పరాచికములాడికొనుట ఉంటుంది. మగపిల్లలకు పుట్టు వెంట్రుకలు తీయింతురు, ఇదియే చౌలము కావచ్చును. ఆడపిల్లలకు కొన్ని ప్రాంతములలో నీలాలు తీయుదురు. దేవుళ్ళకు మీదుకట్టి తిరుపతి, అన్నవరం మొదలైన పుణ్యస్థలాల్లో జుట్టు తీయించుట జరుగుచుండును. ఆభరణాలు పెట్టుకోడానికి వీలుగా ఆడపిల్లలకు చెవులు కుట్టించు మర్యాద నేటికిని కలదు.

ఉపనయనము ఆర్యాచారము. ఇది ద్విజులందరికిని వర్తించును. కాని యీటీవల అక్కడ కూడ గగన కుసుమము ఆపుచున్నది. ఇంక ఆడపిల్లలకు ఎన్నియో శిక్షణలు ఉంటాయి. అవి బాలికను గృహిణిగా దిద్దడానికి అవసరమైన ప్రణాళికలు. పూర్వపు సాంఘిక వ్యవస్థలో సమష్టికుటుంబము సదాచారము ఆడపిల్ల పొరుగింట జీవించవలసిన విదాయకము అన్ని కాలములందును అన్ని దేశములందును కలదు. అదియొక అసిధారావ్రతము. దానిలో విజయం పొందటానికి రెండే ముఖ్య ఉపాయములు. ఓర్పు, మిత భాషిత్వము. మితభాషిత్వము నేర్పడానికే కాబోలు మూగనోము అను విచిత్రాచారము ఏర్పడింది. సూర్యాస్తమయ సమయమున, సుభగంకరణము పూర్తి చేసుకొని కుంకుమ బరణి, అక్షంతలు తీసుకొని బాలికలు పొరుగిళ్ళ ముత్తయిదువుల వద్దకు వెళ్లి వారిచే అక్షంతలు వేయించుకువస్తారు. ఇది మాంగల్యమును పెంపొందించుట కొరకు ఇంత సేపును ఆ పడుచులు పెదవి కదపి మాట్లాడరాదు. పెద్దలైనవారు, కొంటెపిల్లలు వారి నియమ భంగం చేయించడానికై పలకరించినా, వారు మాట్లాడకూడదు. మూగనోము దీపావళి వెళ్లిన మరువాటి నుండి కార్తిక శుద్ధపూర్ణిమవరకు ఒక పక్షము దీపములు చేయుదురట. ఇవికాక ఇంకను చిన్నచిన్న నోములు, నియమాలు బాలికలకు బాలికలు ఎప్పుడూ శుభ్రంగా అందంగా ఉండడం నేర్పడానికై ఐదవ తనము పెంపొందించుటకు ఉద్దేశింపబడినది. రథసప్తమినాడు స్త్రీలు పాలపొంగలిచేసి సూర్యనారాయణమూర్తిని ఆరాధిస్తారు. సంవత్సరాది లేక ఉగాదికి కొత్తబట్టలు కట్టుట, వేపపూవు మామిడి పిందెలతో గూడిన పచ్చి పులుసు ఆరగించడము – ఇవి సర్వజన విదితములు.

పురుషుల ఆచారములు వైదిక పౌరాణిక సంప్రదాయములకు దగ్గరగా ఉంటాయి. శ్రీరామనవమి, శ్రీకృష్ణాష్టమి, శ్రావణపూర్ణిమ, విఘ్నేశ్వర భవితి, విజయదశమీయాత్ర, శమీ సందర్శనము, గ్రామములోని శివకేశవాలయము లందలి కళ్యాణోత్సవములు, సంక్రాంతి వేడుకలు, బోగిమంటలు, కాముడిపున్నమ, శివరాత్రి జాగరములు వంటివి పేర్కొనవచ్చును. దసరా దినములలో



నవరాత్రములు, సరస్వతీపూజ, రైతులు తమవృషభములను, పశువులను కొమ్ములకు పసుపు రాచి అలంకరించుట, దీపావళి సందర్భమున గొల్లలు బఱ్ఱెలకు రంగులు పూసి వాని నాడించుచు కట్నములు సేకరించుట, అప్పటి వారి జానపద వీర నృత్యములు స్మరింపదగియున్నవి. సంక్రాంతికి కోడిపందెములు, పొట్టేళ్ళపందెములు కొన్ని ప్రాంతాల్లో సాగుతాయి. దొమ్మరాటలు, తోలుబొమ్మలాటలు, పగటి భాగవతులు, దేవుని పల్లకీలు మోయుట, వెన్నెల కోలాటములు, మొదలైనవి పురుషులు వినోదములు.

భారతీయులందరికిని తీర్థములు, జాతరలు, సంతలు మొదలైనవి ప్రాచీన కాలమునుండియు ప్రీతిదాయకములు. యాదవ వంశ ప్రళయము జాతర సందర్భముననే జరిగినట్లు మహాభారత మౌసల పర్వమునందు కలదు. వీటినే తిరునాళ్ళు అనుటయు కలదు. చిల్లర గ్రామదేవత నుండి ఏడుకొండల స్వామి వఱకు ఆరాధనకొరకై సంవత్సరమున ప్రత్యేక సందర్భముల దినములు గలవు. అట్టి పుణ్యదినమునకు దూర దూరములనుండి భక్తులు స్త్రీ పురుషులు బృందములు కట్టివచ్చి దేవునికి మొక్కులు చెల్లించుకొని, తీర్థము చూచి, వలసిన వస్తువులు కొనుక్కొని వెళ్ళిపోవుచుందురు. యాత్రకెళ్ళి పాత్ర తెచ్చుట సామెతయైపోయినది. ఇప్పటివలె పూర్వకాలమున నగరములు అంతగా లేకుండుటచేతను, తీర్థములు వర్తక స్థానములుగా గూడ ఉపయోగించెడివి. తిరునాళ్ళలో అవినీతి కూడ తాండవించెడిదని శ్రీనాథాదులు వర్ణించిరి. తీర్థముల దోషము లెట్లున్నను అవి మంచి సాంఘిక ప్రయోజనముసే సాధించెడివి. అనేక కళలను, చేతిపనులను ప్రదర్శించుటకు జాతరలు మంచి రంగములుగా ఉపయోగపడెడివి.

తీర్థము లేని గ్రామమే లేదనుట అతిశయోక్తికాదు. యాత్రికులు వేల సంఖ్యలలో వెళ్ళే పుణ్యస్థలములు ఆంధ్రదేశములో అసంఖ్యాకములుగానే యున్నవి. తిరుపతి, అన్నవరము, భద్రాద్రి, సింహాద్రి, శ్రీశైలము, మహానంది వంటివి లెక్కలేనన్ని; దేవస్థానములును తక్కువకాదు. బెజవాడ కనకదుర్గ అనుమకొండ పద్మాక్షి, వానపల్లి పళ్ళాలమ్మవంటి దేవతలు గొప్ప మహిమకలవారని జనుల

విశ్వాసము. కేవల శైవులైనవారు ప్రబల తీర్థము నిర్వహింతురు. మన దేశమునందు పూర్వము జైనమతము బాగుగా వ్యాప్తిలో నుండెడిది. తరువాత శైవము దానిని వెనుకకు నెట్టినది. వీరశైవ విజయమునకు చిహ్నముగా ప్రభల తీర్థము ఏర్పడిన దేమోయను సందియము జనించును. తెరచాపలవంటి వస్త్రములతో ప్రభలను నిర్మించి, మోకులపై నెత్తి యూరేగింపు తీసికొనిపోవుదురు అప్పుడు భక్తులు కత్తులు మొదలైన ఆయుధములు దాల్చి వీరత్వముట్టి పడునట్లు “అశ్శరభ! శరభ; అల్లల్లభీర నీగ్రుడ్లు తీయిస్తునా! నీపళ్ళు పీకిస్తునా” అని భీకర నాదములు చేయుచు సాగి పోవుదురు. సాధారణముగా పంచాణమువారును సాలెవారును ఇట్టి వీరభక్తి ప్రదర్శనములు చేయు చుండినట్లు గాన్పించును.

ఇటీవల యాంత్రిక నాగరకత గ్రామసీమలలోనికి కూడ వ్యాపించుట చేతను, రాకపోకల సౌకర్యములు విస్తారముగ అభివృద్ధి చెందుట చేతను. పూర్వాచారములు మోటుగా తోచుటచేతను, సినిమా–రేడియో వంటి ఆధునిక వినోద సాధనములు విస్తరిల్లుటచేతను. జనపదము నందలి ప్రజలుకూడ తమ పెద్దల వేడుకలను విస్మరించి విసర్జించుచున్నారు.



# 2. శ్రీ తిరుపతి వేంకటకవుల అవధాన విద్య

**– వేలూరి శివరామ శాస్త్రి**

**కవి పరిచయం:**

తమ ఆశుకవిత్వ అష్టావధాన శతావధానాది బహువిధ ప్రదర్శనలచే తెలుగుదేశము నాలుగు చెరగుల వీరవిహారము సల్పి పెక్కు రాజాస్థానములలో సమ్మానితులై ‘ప్రాచీనకవితకు భరతవాక్యము, నవ్యకవితకు నాందీ వాక్యము’ పల్కిన అసమాన ప్రజ్ఞాధురంధరులు శ్రీ తిరుపతి వేంకటకవులు. వారి శిష్యవతంసులలో శ్రీ వేలూరి శివరామ శాస్త్రిగారు ప్రసిద్ధులు. పరమ తాత్త్వికులుగ, ఖగోళశాస్త్రవేత్తలుగ, బహుభాషాధురీణులుగ, అల్పాక్షరముల ననల్పార్థ దార్శనికులుగా, కవితా మర్మజ్ఞులుగ వాసిగాంచిన వీరు కృష్ణా మండలములోని గన్నవరం తాలూకాకు చెందిన విరివాడ గ్రామమున జనంచి, తమ జీవిత చరమదశవఱకును శిష్యవాత్సల్యముతో బహువిధ శాస్త్ర పాఠములను ఓర్పుతో అధ్యాపన మొనర్చుచునే తమ దార్శనిక చింతనను కొనసాగించిన అవధాన ధురీణులు.

శతావధాన ప్రదర్శనా ప్రభంజనములు ముమ్మరముగ వీచుచుండిన ఆ దినములలో గురువుల సన్నిధానమున పదునాలేడుల ప్రాయముననే శతాబ్ధా ధానమును దిగ్విజయముగ సల్పిన ప్రజ్ఞాసంపన్నులు శ్రీ శాస్త్రిగారు. శరత్ సాహితీ సముద్రమును ఆపోశనముపట్టి తెనుగున వెలయించిన అగస్త్యులు వీరు. వీరి పద్యగద్య రచనా రీతి నిసర్గ రమణీయము, వీరి బాణి యపూర్వము. కథలు–గాథలు, ఏకావళి అనుపద్యకావ్యములును, శరత్ సాహిత్యానువాదములు అనేకములును, కథాషట్కము, కథాసప్తకము అను కథానికా సంపుటులును, ప్రాచీన ఖగోళము, మహాత్ముని ఆత్మకథయును, దర్శనములను గూర్చిన పెక్కు

పరిశోధనా వ్యాసములును వీరి చిరస్మరణీయతా చిహ్న ములు. మధుర రాగరంజిత గశముతో ఆశుధారా వాహినులలో సభికుల నోలలాడించిన వీరి సరసకవితా ప్రావీణ్యము గురుప్రశంసలను చూఱగొనుట గమనార్హము. శ్రీతిరుపతి వేంకటకవుల అవధాన స్మృతులీ వ్యాసమున నిక్షిప్తములు.

* * *

అవధాన మంటే ఒక వస్తువుమీద మనసు నిలపడం. దీనికి "చిత్తైకాగ్రత" అని పేరు. క్షిప్తమనీ, మూఢమనీ, నిక్షిప్తమనీ, ఏకాగ్రమనీ, నిరుద్ధమనీ చిత్తానికి అయిదు భూమికలు అని యోగశాస్త్రం. భూమిక అనగా అవస్థలు. దీనిలో ఏకాగ్రభూమికలో ఉండే చిత్తం సంప్రజ్ఞాత సమాధికి అనుకూలం. కాని శతావధానాదులకు కాదు. ఏకాగ్రం అంటే ఏకమాత్రావలం జనం కలది. దానికి లక్షణం చలింపని స్మృతిలేక ఆత్మస్మృతి. ఇది వృద్ధి అయితే ఏకాగ్రతా పరిణామం కలుగుతుంది. ఒక వృత్తి అడగి, పిమ్మట విత్తానికి అట్టివృత్తే ఉదయించి. దానికి అనురూపమైన వృత్తి ప్రవాహం పారుతూవుంటే, ఆ చిత్తం ఏకాగ్రచిత్తం. అష్టావధానాదులకు కావాలిసింది అదికాదు. ఈ అవధానాలు చేసేవారు అనేక విషయాలను ఏక కాలంలో మనస్సున నిలిపి గుఱుతు పెట్టుకొని అప్పగిస్తారు. కాబట్టి యోగాంగమైన చిత్తైకాగ్రత వేరు; అష్టావధానాదులకు పనికి వచ్చే ఏకాగ్రత వేరు.

అవధానం చేసేవారు ఒక సమయంలో ఎనిమిది విషయాలను గాని. నూరు విషయాలను గాని ధారణ పడతారని అనుకోవడం నిక్కం కాదు. మనస్సు అణువని చెప్పేవారి మతంలో ఒకే కాలంలో దానికి ఇతరేంద్రియ సంబంధం ఉండదు. కాబట్టి ఒకే క్షణంలో జ్ఞానద్వయం గాని, త్రయం గాని ఉండదు. మనకు ఎన్నిజ్ఞానాలు కలుగుతవో, అన్ని క్షణాంశలు అతి స్వల్పాలు వానికి ఆధారంగా వున్నవని అనుకోవడం తప్పని సరి. క్షణమే అతిసూక్ష్మం. ఇక దాని అంశలనా, మనం గురుతు పెట్టుకొనేది? కాబట్టి అనేక జ్ఞానాలు ఏక క్షణంలోనే జరిగిపోయినై అని అనుకుంటాం. ఇది భ్రమ. పూవును చేతబట్టుకొన్నప్పుడు,



దాని పరిమళము ఆస్వాదించడమూ, అందాన్ని ఆకలింపు చేసుకోవడమూ, మృదుత్వాన్ని గ్రహించడమూ, ఏకక్షణంలో కాక వేర్వేరు క్షణాలలో జరుగుతుంది. మనస్సు విభువు అని అనేవారు ఒక కాలంలో అనేకజ్ఞానాలు కలుగుతై అని అంటారు. కాని అది వేరే మాట.

ఈ ప్రసంగం శ్రీ తిరుపతి వేంకటకవుల అవధాన విద్యను గూర్చినది. వారి అవధానాలు అపూర్వములూ అధునాతనములూ, తెలుగునాట అవధానాలలో అడిగే వారి ప్రశ్నలను గ్రహించడము, ఆ ప్రశ్నలకు అవధాని తాను చెప్పిన పద్యపాదాలను గురుతుపెట్టుకోవడమూ, చిట్ట చివరకు అన్ని టినీ ఏకరవు పెట్టడమూ జరుగుతూ వస్తుంది. వీని నన్నింటిని కలిపి మనం కాసులలో అడిగే వారి ప్రశ్నలను గ్రహించడమూ, ఆ ప్రశ్నలకు అవధాని "అవధాన" మని అంటాం. అవధానమూ-ధారణా-స్మృతీ- ఇవి వేరు వేరు మనోవ్యాపారాలు, వీని నన్నింటినీ కలిని మన మవధానమని వ్యవహరిస్తున్నాం.

బందరు శతావధానంలో శ్రీ వేంకట శాస్త్రులవారు "ధారణ నిల్చునా నిలువదా యను సందియ మొందు దక్క గాథా రచనా విశేషమున ధారణ కింతయు లోటులేదు" అనిన్నీ: శ్రీ తిరుపతి శాస్త్రులవారు- "ప్రాయం బెంతయు కొంత యేగె. నికс జత్వారింశ దబ్దంబు రానాయెన్, విస్మృతి మెందుగాс దొడగె, విద్యా పక్షపాతంబునన్ దాయన్ లేక, శతావధాన మొనరింప బూనినా మమ్మరో!" అనిన్నీ చెప్పారు. ఈ రెండు పద్యాలలోనూ "ధారణ- స్మృతి- అవధానమూ" ఈ మూడింటకి గల ఐక్యమూ అనైక్యమూ విస్పష్టంగా తెలుస్తున్నవి. ఈ అవధానం శ్రీ తిరుపతి వేంకటకవులకు పూర్వం శ్రీ మాడభూషి వేంకటాచార్యులవారూ, దేవులపల్లివారూ చేసినటులు పలువురు కన్నారు; నేను విన్నాను. ఈ విద్యలో ఇంకా వెనుక ఎవరయినా ఉన్నారా అంటే ఉన్నారని అనడానికి గ్రంథాలలో సాక్ష్యాలు ఉన్నవి.

"చిత్రభారతము రచించి మించిన చరి
కొండ ధర్ముండను కొండ నెక్కి

వసుచరిత్రము వ్రాసి వాసికెక్కిన రామ
రాజ భూషణు వాగరమ్ము గ్రమ్మి
మూడర్థముల కావ్యముం జెప్పు నెల్లూరి
రాఘవ కవి వచో హ్రదము నింపి
అపర పండిత రాయలౌ వేంకటాచార్యు
వాచా స్రవంతిలో వచ్చి కలిసి
వఱలి తిరుపతి వేంకటేశ్వరుల దరుల
మూలమున దీర్ఘరాజులై యోలిఁ గడలి
కరిగెడు శతావధాన దివ్యస్రవంతి"

ఈ సీసంలో చెప్పబడ్డ మొదటి మూపుర అవధాన ప్రక్రియ ఏలాటిదో మనకు తెలియదు. శ్రీ వేంకటాచార్యుల వారి ప్రక్రియయున్నూ. దేవులపల్లి వారి ప్రక్రియయున్నూ, తిరుపతి వేంకటకవులదిన్నీ ఒకటే.

ఇట్టి వారింకా ఎందరో ఉండి ఉంటారు. మరింగంటి సింగరా చార్యులవారు శతావధానులు, రఘునాథ భూపాలుని సభలలో మధురవాణి వీణవాయిస్తూ నూరు సంస్కృత సమస్యలు పూరించేదట! సంస్కృతంలో బాలభారతం వ్రాసిన మహాకవి శతావధానులందరకూ శతావధాని, మిగతా దేశాలకంటే తెలుగుదేశానికి అవధాన ప్రశస్తి ఎక్కువ.

శ్రీ తిరుసతి వేంకటకవులు అవధానమును ఒక విద్యగా చేశారు. వారు అవధానము చేస్తూఉంటే వేలాదిగా శ్రోతలు చెవులు దోరబెట్టుకొని వినేవారు. కవితావేగము, సద్యఃస్ఫూర్తి, హాస్యమూ, చమత్కారమూ, వీటన్నింటికి మకుటాయ మానమైన వారి ప్రతిభ–బాలుర దగ్గరనుంచీ పండితులవఱకూ ఆకర్షించేవి. వారి అవధానము మానస క్రతువు.

ఆశువుగా కవిత్వం చెప్పలేకపోతే అసలు అవధానం చేయనక్కరలేదు. గద్వాల సంస్థానంలో:



"ఆశుధారా కవిత్వాడంబరం బన్న
నల్లేరుపై బండి నడక మాకు" – అనిన్నీ,

వనపర్తిలో:

"నూటికొక్కడు చక్కని ధాటి గల్గి
సరస కవనమ్ము చెప్పడి చతురుడుండు
నట్టివారలలో వేయి కమరు నొకడు
శతావధానాదికమ్మును సల్పుజాడ" – అనిన్నీ

ఆ వనపర్తిలోనే,

"ఇచ్చెదవుగాక మా నెదనేమి కొదువ
మా కవిత్వ పరీక్ష సమ్యగతిని ర
చింపు మే కథనేనియుఁ జెప్పునపుడు
వేయి యాపిన నది తెగవేయు మధిప?" – అనిన్నీ

వారే తమ వడితనం చెప్పుకున్నారు.

శతావధానానికి చాలా కాలం పడుతుంది. ఎంతో మంది పృచ్ఛకులు ఉండాలి. వినేవారికి, చేసేవారికి, చేయించేవారికి విసువు పుడుతుంది. ఎట్లా చేస్తారో చూద్దామనే కుతూహలం ఒకటి తప్ప, పృచ్ఛకులు తామడిగిన ప్రశ్నకు సమాధానంగా వచ్చే పద్యం ఎట్లా ఉంటుందో ఊహించరు.

మొగలుతుర్తి అవధానంలో శ్రీ వీరేశలింగంగారిని గూర్చి చెప్పమని ఒకరు ప్రశ్న వేశారు. దానికి పూర్వ రంగం చెప్పాలి. అప్పుడుగాని ప్రత్యుత్తరం వింటే దాని గుణం బాగా తెలుస్తుంది. శ్రీ లింగంగారి సంస్కరణోద్యమం ఆనాడు ప్రతిఘటించిన ప్రతిభావంతులలో అజ్జాడ ఆదిభట్ట నారాయణ దాసుగారూ వేదం వేంకట్రాయశాస్త్రిగారూ మొదలయిన దిగ్గంతులు ఉన్నారు. శ్రీ తిరుపతి వేంకటకవులు కూడా అలవారిలో ఒకరు. అయినా సంస్కరణాభిలాషులలో కూడా మహామహులున్నారు. వీరందఱలో ఏ ఒకరికీ కోప తాపాలు కలుగజేయరాదు.

ఇట్టి స్థితిలో వీరేశలింగంగారి విధవా వివాహాలను గూర్చి తిరుపతి వేంకటకవులు చెప్పిన పద్యం ఇది:

"మా డబ్బు చెడద్రొబ్బె మా ప్రబుద్ధు" డటంచు
మంగలివాండ్లు తన్నుం గుణింప
పెండ్లములకు వండి పెట్టగా సుఖియించు
వారలెల్లరు తన్ను దూఱుచుండ
విద్యార్థులును మెట్ట వేదాంతులును గూడి
తన్ను నేవేళ నిందను నొనర్ప
"మును చచ్చినట్టి మగని తద్దినం బెట్టు?"
లని బుధవరులు వాదొనరఁజేయ
నన్నిటికి నోర్చి విధవలౌ నంగనలకు.
"భ్రూణ హత్యలు జరగక పోవుగాక"
యంచుఁ బెండ్లిండ్లు సేయ యత్నించు చుండెఁ
గందుకూరి వీరేశలింగ ప్రధాని!

వేమవరంలో చీకుముల్లును గూర్చి ఒకరు చెప్పమన్నారు. విరోధమనే విషం వ్యాపించిన సమయం అది. అప్పుడు దాని సమాధానం:

"నిన్నుఁ గాల్చినగాని నీ బుద్ది మానవే
ఛీ! యే మనందునే, చీకుముల్ల!
దొంగరీతిని దూటి దొరక కుందువుగదే
ఛీ! యే మనందునే, చీకుముల్ల!
పొరలోపలం జేరి పోటు గూర్చెదు గదే
ఛీ! యే మనందునే, చీకుముల్ల!
పద మాశ్రయించియు బాధ పెట్టెదు గదే
ఛీ! యే మనందునే, చీకుముల్ల!



నిన్ను మర్యాదగాఁ జూచునేని యెట్టి
చట్టుఁడేనియు నీదు కోతలకు లోఁగు
చెప్పుదెబ్బకుఁ దప్ప నీ చెడ్డగుణము
నీకదు సుమీ, యిసీ యిసి! వీరుముల్ల!

ఒకరు మాత్రం చేసే శతావధానాన్నే వెనుకటి వారెరుగుదురని అనుకుంటాను. శ్రీ తిరుపతి వేంకటకవులు గద్వాలలో:

"ఒక చరణం బతండు మఱి యొక్కటి నేను; మఱొక్క టాతడున్
సకల కవీంద్ర సంతతులు సమ్మతిచే తలలూచి మెచ్చగాఁ
బ్రకటత రాశుధార దనరన్ రచియింపగ నేర్తుమయ్య, నూ
టికి సెలగయ్య! నిక్కమిది డెబ్బది మాటలు చెప్పనేటికిన్."

అని చెప్పుకొన్నారు. ఒకరు చేయడం తేలికా? ఇరువురు చేయడం తేలికా? అంటే ఒకరు చేయడమే తేలిక అని అనిపిస్తుంది. ఇరువురూ గనుక చెప్పడం లోనూ, ధారణ పట్టడంలోనూ సమస్కంధులయితే ఇరువురు చేయడం తేలిక కావచ్చు. ఎలాగంటే, ఒకరొక పాదం అల్లాక, రెండవ వారు రెండవ పాదం అల్లేటప్పుడు మొదటివారు ఆ రెండవ వారు చెప్పే రెండవ పాదం వింటూ. తాము చెప్పిన మొదటి పాదం సైతమూ నెమరు తీసుకోవచ్చు. మొదటివారూ మళ్లా మూడోపాదం చెప్పేటప్పుడు రెండవ వారికిన్నీ రెండోవారు నాలుగో పాదం చెప్పేటప్పుడు మొదటివారికిన్నీ అలాగే ఆవృత్తి చేసుకొనే వీలుంటుంది. అయితే శ్రీ తిరుపతికవుల అవధానం మరలాగా సాగి పోయేది. మొదటిపాదం శ్రీ వేంకట శాస్త్రులవారు చెప్పినాక, శ్రీ తిరుపతి శాస్త్రులవారు గుక్కతిప్పుకోకుండా రెండోపాదం విసరి వేసేవారు. మళ్లా తిరుపతి శాస్త్రులవారే మూడు నాలుగు పాదాల విషయంలో పరుగులు తీసేవారు. ఆ వేగం చూచి తీరవల సిందే! శ్రీ తిరుపతి శాస్త్రులవారితో కలిసి నేను రెండు మూడు అవధానాలు చేశాను. మొదటి మారు నాకు చాలివచ్చింది. రెండోసారి చెమరు నారు పోసిందంటే నమ్మండీ! వీరి విషయంలో కొంచెం విరామం కలగడమున్నూ ఆ – నందులో ఎవరైనా

ఒకరు ధారణ పట్టిడమున్నూ ఉంటుందో ఉండదో నాకు తెలియదు. ఎందుకంటే నేనెరిగిన తరువాత వీరిరువురూ చెరోపాదంగా నాలుగు పాదాలు చెప్పి చేసిన అవధానం లేదు. ఇరవై మందికీ ముప్పది మందికీ చేసినవి నే చూశాను. కాని అవి పిపీలికాయమానాలు.

ఇంకొక గొప్ప విశేషమేమంటే, చెరి యొక పాదం చెప్పుకొని పోయిన నీతి అవధాన పద్యాలతో రెండు తలపులున్నటులు తెలియదు. మొదటి పాదానికి రెండవ పాదం సమ్మసరిపోతుంది. బందరు శతావధానంలో:

"గంగాధరుడు నీ మగండని నవ్వంగ
నేషధరుండు నీ పెన్మిట నియె
నెద్దు నెక్కును నీదు నెమ్మెకాడని నవ్వ
గ్రద్ద నెక్కును నీ మగం డటనియె
నల్లకాడిల్లు నీ వల్లభున కనంగ
నడి సంద్రమిల్లు నీ నాథునకనె
నాట్యంబు సేయు నీ నాయకుండన నంగుఁ
గావించు వెన్క నీ కాంతు డనియె
ముష్టి కెక్కడి కేగె నీ యిష్టు డనిన
బలి మఖంబున కేగెనో లలన! యనియె
నిట్టు లన్యోన్య మర్మంబు లెంచుకొనెడు
పర్వతాంభోధి కన్యలఁ బ్రస్తుతింతు"

విశాఖపట్టణం శతావధానంలో : (మీసమువలని నష్టము)

"మెసవుచో నన్నంపు మెతుకులోఁ జిక్కినఁ
బై వారి నెల్ల నవ్వంగ జేయుఁ
దన ముద్దియను ముద్దుగొనినచో నత్తులోఁ
దవిలి యత్యంత బాధను ఘటించు



పొడుము పీల్చిన రెల్లుకడ అంకవృద్ధి చే
సిన యట్లు మాలిన్యమును ఘటించు
తేనె పానము సేయుచో నెఱుంగక కొంచె
ముగఁ దగిల్చినఁ దెలుపును ఘటించు
పొట్టిదౌ చుట్టఁ గాల్చినప్పుడొక కొంత
కాఁక దగిలిన సురసుర కాలి, పాడు
వాసన ఘటింప జేయు; వహ్వా యటైన
వాసి మీసాలు లౌకికాగ్రేసరులకు!"

ఈ రీతిని కొన్ని అవధానాలు ఉదాహరింప వచ్చు. ఈ సమస్కంధత్వం వీరికి ఎంతో ఉపకరించింది. ఇది అవధానాలకే కాదు. వీరి గ్రంథరచన కన్ను. ఇది అసాధారణమైన విషయం. ఈ సంగతే జాతక చర్యలో ఇట్లా చెప్పుకున్నారు:

"ఇరువురు గూడియే రచన యెప్పుడు జేయుదు, రొక్కవేళ నొ
క్కరొకటి యొక్క రింకొకటి కైకొని చేయుదు, రందు హెచ్చు త
గ్గొరులకు గానరాక యది యొక్కరు చేసిన భంగి నుండు, నొ
క్కరు రచియించి రేనియును గాదగు తిర్పతి వేంకటీయమై"

ధారణాశక్తి శతావధానికి ముఖ్యమని వేంకట శాస్త్రులవారు "దివాకరాస్త మయము"లో వ్రాశారు. "గ్రహణధారణ పటుర్బాలః" – చెప్పినది గ్రహించడమున్నూ, గ్రహించిన దానిని గుఱుతు పెట్టుకోవడమున్నూ– అనగా గుఱుతు పెట్టుకొని అప్పగించడమున్నూ, ఈ ధారణలో స్మృతి సహజంగా ఉంటుంది. – ధారణశక్తి లో తచుకు తిరుపతి శాస్త్రిగారు కొం వెం తగ్గుతారనిన్నీ వెం. గారు వ్రాశారు. నేను వారి శిష్యుడనై, వారు చేసే అవధానాలు చూస్తూ వచ్చాను. కసింకోటలో పినపాడులో నాటినుండి జరిగిన వానిలో మొదటి పాదం వెంకట శాస్త్రిగారు చెప్పుటయే కాని, తతిమ్మావి శ్రీ తిరుపతి శాస్త్రిగారు నిర్వహించినవే; ఎక్కడా నాకాలోటు కనబడలేదు. కాని ఒక మాట. వేంకట శాస్త్రిగారికి ఎన్నో ఎన్నో ప్రబంధాలలోని పద్యాలు. ప్రాచీనాశువులు, చాటువులు గుఱుతు. తెలుగు భారతం – అందులో తిక్కన వారికి కొట్టిన పిండి.

తిరుపతి వేంకటకవులలో వెం.శా.గారు మోహన రాగంలోనూ, తఱచు శ్రీ రాగంలోనూ పద్యం చదివితే జగన్మోహనంగా ఉండేది. ఇంతేకాక ప్రశ్నలు అడిగే వారిలో కొంటెవారు, అవధానికి భయం కలిగించాలని చూస్తే వారూ, ప్రతిస్పర్థులూ, ఇలాగా ఎన్నో రకాల వారుంటారు, వారివారికి సరి పడే రీతి సమాధానాలు చెప్పి ఆశ్చర్య చకితులను చెయ్యడంలో వెంకట శాస్త్రిగారిది పెట్టింది పేరు.

తిరుపతి శాస్త్రిగారు నాలుగుపాదాలు కలిపి చదువుతుంటే వల్లించిన గ్రంథం ఏకరువు వేసేటట్లు ఉండేది. తడుముకోకుండా పట్టపగటి వెలుగులో ఉరుకెత్తు తున్నటు లుండేది. పాదాలు చెప్పడ మొక యెత్తు; చివరకు అప్పగించడం ఒక యెత్తు, వారు రాగం పాడక పోయినా చిట్ట చివర ఆ మహా వేగంతో చదివెయ్యడమే మహాగానంగా ఉండేది.

ఈ రీతిగా వడితనంతో పాటు సరసత్వం–గిలిగింతలు పెట్టేలేత ఎత్తి పొడుపు–ప్రతి పక్షుల మీద వ్యంగ్యంగా విసరే విసురూ – తమ ఇష్టాన్నీ అనిష్టాన్నీ తెలిపే మెలకువ భాషలో అతి తేటతనం మొదలయిన వెన్నో తిరుపతి వేంకటకవుల అవధానాన్ని విని చూచే వారిని ఆశ్చర్యపరవశులను చేసేవి.



# 3. బొమ్మలాట – యక్షగానము

**– యస్వీ జోగారావు**

"ప్రాత యనిపించు సరిక్రొత్త పథమునాది" అని యొక విసూత్న కవితా పథమును తీర్చిదిద్దిన భావకవితా శ్రీనాథులు శ్రీ యస్వీ జోగారావు గారు. వీరి స్వస్థలము విజయనగర మండలములోని పార్వతీపురము. వీరి జనని సరస్వతమ్మగారు వాగ్గేయకారిణిగను, జనకులు శ్రీ శిష్ట్లా సాంబశివరావు గారు కవిగను లబ్ధప్రతిష్ఠులు.

శ్రీ జోగారావుగారు ఆంధ్ర విశ్వకళాపరిషత్తు నుండి తెలుగున ఎం.ఏ. పట్టమును సర్వ ప్రథములుగను, పిహెచ్.డి. పరిశోధనా నిబంధమునకు స్వర్ణపదక గ్రహీతలుగను గణనకెక్కి మూడు దశాబ్దములకు పైగా అధ్యాపకవృత్తిని నిర్వహించుచు, రెండు పదులకు మించిన పిహెచ్.డి. పట్టభద్రులకు దర్శకులై ప్రస్తుతము ఆంధ్ర విశ్వవిద్యాలయమందు ప్రాచార్యులు, జాతీయాచార్యులుగ వరలుచున్నారు.

యక్షగానములపై వీరు సల్పిన సమగ్ర పరిశోధనము వీరి దీక్షకు నిదర్శనము. తంజాపురమునందలి సరస్వతీ మహల్లో లోను, ఇతరత్ర అజ్ఞాతముగ పడియున్న అనేక యక్షగానములు వీరి ధర్మమా యని వెలుగు చూచినవి. కవిగా, విమర్శకుడుగా, వక్తగా, వ్యాసకర్తగా సులలిత మనోజ్ఞ భావుకుడుగా, అన్నిటిని మించి ఉత్తమ ఆచార్యుడుగా శ్రీ యస్వీ ప్రసిద్ధి బడసినారు. రెండేండ్లపాటు లెనిన్ గ్రాడ్ విశ్వవిద్యాలయమున తెలుగు ప్రొఫెసర్గా నుండిన వీరు రష్యన్ భాష నేర్చుకొని ఆ భాషా సాహిత్యములను గూర్చి తెల్పియు, కొన్ని ప్రసిద్ధ రష్యన్ రచనలననువదించియు తెలుగు సరస్వతి కెనలేని సేవ చేసినారు.

పంచకల్యాణి, ఉపనిషత్తు, ప్రసన్న కుసుమాయుధము, శృంగార సర్వజ్ఞము– వీరి పద్య కావ్యములు, అప్సరస, మధుర మాధవం వీరి నాటికా సంపుటులు. ఇవిగాక అనేక సమీక్షా వ్యాసములును, సారస్వతనీరాజనము, సప్తతంతువు మున్నగు పెక్కు వ్యాస సంపుటములును సమకాలీన సాహితీవేత్తలలో కవులలో వీరికి సముచిత స్థానమును సమకూర్చినవి. కవిత చెప్పినను, విమర్శ చేసినను, వ్యాసము కూర్చినను వీరి దగు ఒక విలక్షణ శైలి మనకు ద్యోతకమగును. లెక్కకు మిక్కిలి యైన వీరి వ్యాసములు ప్రముఖ పత్రికలలో సాహిత్య సంచికలలో విజ్ఞాన సర్వస్వము, విజ్ఞాన కోశములలో ప్రచురితములై వీరి ప్రతిభను చాటుచున్నవి.

మధుర సరస్వతి, మహాకవి, సాహితీ రత్నాకర బిరుద గ్రహీతలయిన శ్రీ యస్వీ నవ్య కవి ప్రపంచమున విశిష్ట స్థానమును గడించుకొనినారు. తెనుగునాట ప్రసిద్ధమైన బొమ్మలాట–యక్షగానముల స్వరూపము ఈ వ్యాసమున నిరూపితము.

* * *

మనదేశంలో బొమ్మలాట అతి ప్రాచీనకాలం నుంచీ ప్రసిద్ధమైన జానపద కళావినోదంగా పరిఢవిల్లుతూ వచ్చింది. అసలు నాటక కళాభివృద్ధికి దారి తీసింది అదే అనవచ్చు. బొమ్మలాటకు బ్రహ్మలాంటివాఁడు సూత్రధారి. సూత్రధారశబ్దం తరువాత తరువాత ఔపచారికంగా రూపక ప్రస్తావనల కెక్కినా బొమ్మలాటకు కుదిరినంతగా రూపకానికి కుదురదు. సూత్రం పట్టుకుంటేనే గాని బొమ్మల అటే లేదు. అంచాతే ఆమాట పుట్టింది. రూపకంలో స్థావనలో సిరి సూత్రధారుని వాలకం. తెర మరుగైనా బొమ్మలాటలో చిట్టచివరిదాకా అతని అవసరం వుంటుంది. భరతనాట్య శాస్త్రంలో సూత్రధారశబ్దం వున్నదంటే క్రీస్తుపూర్వం రెండు మూఁడు శతాబ్దాలనాటికే బొమ్మలాట ప్రదర్శనాలు ప్రసిద్ధి వహించా యన్నమాట.

క్రీస్తుశకం పదో శతాబ్దినాటి కివి దేశాంతరాలకు గూడా వ్యాపించాయి. జావాలో వీటిని వాయంగ్ వినోదా లంటారు. అవి క్రీ. శ. 1000 నాటికే కదు ప్రసిద్ధములై యీనాటికీ మన రామాయణ మహాభారత గాథలనే ప్రదర్శిస్తూ



ప్రజామోదం పొందుతున్నాయని తెలుస్తోంది. ఈనాడు బొమ్మలాట ప్రపంచ మంతటా ప్రసిద్ధిపొందింది. మన ఆంధ్రదేశంలో కూడా యీ బొమ్మలాట చాలాకాలం నుంచీ ఉంటున్నట్లు ఊహించవచ్చు. పాల్కురికి సోమనాథుని కాలం నుంచీ మనసాహిత్యంలో బొమ్మలాట ప్రసక్తి తరచుగానే కనిపిస్తోంది. ఉదాహరణకు పండితారాధ్య చరిత్ర పర్వతప్రకరణంలో 'భారతాధికథలఁ జీర మఱుఁగుల నారంగ బొమ్మల నాడించు వారుఁ, గడునద్భుతంబుగఁ గంబ సూత్రంబు–లడరంగ బొమ్మల నాడించువారు' అని వుంది. ఇందులో వరుసగా తోలుబొమ్మలాట, కొయ్యబొమ్మలాటా రెండూ సూచింపఁబడ్డాయి. వాటినే కన్నడంలో వరసగా చక్కలదగొంబె, సూత్రదగొంబె అని అంటారు.

మన ఆంధ్రదేశానికి బొమ్మలాట మహారాష్ట్రుల నుండి దిగినట్లు పెద్దలు చెబుతారు. అసలు యీనాటికి గూడా అటు రాయలసీమా యిటు కోస్తాజిల్లా లలోనూ అక్కడక్కడ మిగిలివున్న బొమ్మలాటవాళ్ళను యోగక్షేమం చేస్తే వాళ్ళు మరాటి వాళ్ళని తేలుతుంది. మహారాష్ట్రంలో వాళ్ళపూర్వుల స్థితిగతు లెలావుండేవో చూచాయగా చెప్తాను. శా.శ.1130 అంటే క్రీ.శ.1208లో వేయబడిన దుర్జయాన్వయులైన విప్పరుల కొండవ గుండవ నాయకుల ముక్కామల భూదానకాసనంలో 'సూత్రధారి బొమలయ' అనునత డొక్క ప్రతిగ్రహీతగా పేర్కొనబడ్డాడు. అతడు బొమ్మలాటవాదే కావచ్చు. కాకతీయులనాటి వరంగల్లు జిల్లా గూడూరు శాసనం చివర 'సూత్రధారి కొమ్మోజున బరహా' అంటే సూత్రధారి కొమ్మోజు వ్రాసినది అని వుంది. ఇది తెలుగు వృత్తాలలో నున్న శాసనం. ఒక పానుగల్లు శాసనంలో తూర్పు వైపున నున్న వ్రాతలో 'సూత్రధారి బ్రమ్మోజు బెరసిన సూత్రధారుల కాస్యపల్లిని బానుగంట దశవృత్తి పుడపండ్లు 20 భీమసముద్రము వెనుక పుడమఱుతురు' అని వుంది. ఆ సూత్రధారి కొమ్మోజు బ్రమ్మోజులు పేళ్ళను బట్టియే బొమ్మలాటవారైనట్లును, మహారాష్ట్ర లైనట్లును ఊహించనచ్చు. మహారాష్ట్రమునకు సన్నిహితమైనది కన్నడ దేశం. అదీకాక బొమ్మలాట దేశ ద్రిమ్మరుల కనేక భాషలు రావట మన్నది సహజం. అసలా

మరాటీ బొమ్మలాట వాళ్ళు తొలుత కన్నడ దేశానికి వచ్చి పిదప ఆంధ్రరాష్ట్రానికి ప్రాకివుంటారు. పైశాసనాలబట్టి పదమూఁడో శతాబ్దినాటికే మనరాష్ట్రంలో వాళ్ళ రాజప్రాపకమున నింతభూవసతులు సంపాదించుకొంటూ వున్నట్లు, స్వయంగా తెలుగులో పద్యాల్లో కూడా శాసనాలు వ్రాయగల సామర్థ్యంగలవారైనట్లూ తెలుస్తోంది. తత్రాపి వారు గ్రంథ రచనా ప్రోత్సాహకులూ, స్వయం గ్రంథకర్తలు కూడా అయినట్లు ఈ క్రింది విషయాల వల్ల తెలుస్తోంది. ఆంధ్ర కవితరంగిణి తొమ్మిదో సంపుటంలో ఉదాహరింపబడిన కోదూరి వల్లభసూరి చరిత్రంలో అతడు పాటిగణితం అనే గ్రంథమును కర్ణాటసింహాసనాధీశ్వరులగు కృష్ణ దేవ అచ్యుత దేవరాయళ్ళను కొలిచి మన్నన లందిన "బొమ్మలాట విరుపాధిపకాళని ప్రేరణంబునన్" రచించితి నని చెప్పుకున్నాడు. ఆ కాళయ కుమార తాతాచార్యుని శిష్యుడయినట్లు నెఱదాతయైనట్లును వల్లభసూరి చెప్పాడు. పెనుగొండలో కృష్ణరాయల కోశాధికారిగా నుండి శిల్పకళానిక్షేప మగు లేపాక్షి దేవాలయాన్ని నిర్మించాడని చెప్పబడే విరూపన్న యీ కాళయతండ్రియే యగునాయని అనుమానము. బొమ్మలాటవారి గురించి శ్రీచాగంటి శేషయ్యగా రొకశాసన విషయము నుటం కించారు. కడప మండలమందలి కమలాపురము తాలూకా చిడిపిరాల గ్రామమును చంద్రమయ్య యను నతఁడును (ఇతనిని బొమ్మలాట రయితు అని యందురు) బొమ్మలాట యమృతకవి యను నతఁడును తెరనాటకము లాడు ఆకై పెదవిట్టయ్య యను నతని కిచ్చిన ట్లొక శాసన మున్నది అని. దీనిని బట్టి వారికి బొమ్మలాటలందే కాదు తెరనాటకములందును గల అభిమానము తేటతెల్ల మగుచున్నది. అంతేకాదు. ఆ తెరనాటకము లాడువారికి వీరొక గ్రామం దానం చేశారంటే ఆనాటివారి హుందాగిరీ ఎంతటిదో తెలుస్తోంది. అంటే అప్పటికే ఏరాయలవారి అనుగ్రహం వల్లనో వారిసీమలో వీరికి కొన్ని వృత్తు లేర్పడివుండవచ్చు. వారివృత్తికి స్మారక చిహ్నాలుగా నీనాడు రాయలసీమలో కొన్ని గ్రానునామాలు వినిపిస్తాయి. వాటిని బట్టియో, అసలు కులవృత్తినిబట్టియో వాళ్ళ కాబొమ్మలాట అన్నదే యింటి పేరుగా పరిణమించి వుండొచ్చు. పై శాసనంలో పేర్కొనబడ్డ బొమ్మలాట అమృత కవి రచన లేవో మనకు తెలీవు. ఒక బొమ్మలాట



కుటుంబమునకు చెందిన ఒక్క తెలుగు యక్ష గాన రచన మనకు దక్కినవి. అది కిరాతార్జునీయ మను యక్షగానము. కర్త బొమ్మలాట సాంబయ్య లేక సంబయ్య. అతని తండ్రి బొమ్మలాటశాసనుడు, మోహనకవి నిరుదాంకుడు నైన సిద్ధయ. బొమ్మలాటశాసను డంటే బొమ్మ లాట అనే గ్రామానికి కరణం వంటివాడు. ఆ మోహన కవి రచన లేవో తెలీదు. సంబయ్య కిరాతార్జునీయము ప్రశస్త రచనగల యక్షగానం. ఇందు లేపాక్షి వీరభద్రస్తుతి వుంది. లేపాక్షి అనంతపురం జిల్లా హిందూపురం తాలూకాలో ప్రసిద్ధమైన శివక్షేత్రం. ఆంధ్ర శిల్పకళానిక్షేపం. అక్కడి కిరాతార్జునీయ కుడ్యశిల్పాల దొక ప్రత్యేకత యందురు. సంబయ్య బహుశా ఆ ప్రాంతంవాడై వుంటాడు. అతని కృతిరచన కవే ఉద్బోధకాలై వుంటాయి. ఈ సంబయ్య కన్నడంలో కూడా కరియలంటన విజయము, సారంగధర చరిత్రము అనే యక్ష గానాలు రచించాడు. అంచాత కర్ణాటక కవి చరిత్రకు నెక్కినాడు. అం దితని కాలము క్రీ. శ. 1750 ప్రాంత మని చెప్పబడింది.

మనకు తెలియవచ్చిన బొమ్మలాటవారి తెలుగురచన మరియొకటి బొమ్మలాటహాస్యనాటకము. ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారమున దానికొక తాళపత్రప్రతిగలదు (నెంబరు R. 1394). అది యొక బొమ్మలాట ప్రదర్శనకు ప్రస్తావన. వ్యావహారికధోరణిలో నొక చక్కని మాండలికపు నుడికార ముట్టిపడు వచనప్రచురమైన సంవాదశైలిలో సరసములైన హాస్యప్రసంగ ములతో సాగిన రచన. అసలు బొమ్మలాటవా రాడదలచుకొన్నది శ్రీకృష్ణ విలాసమట. కాని కేతిగాని పెళ్ళి యిందలి ముఖ్య విషయము. గ్రంథకర్త యెవ్వరో తెలీదు కాని ఈ గ్రంథ మధ్యంలో ఒక పంచాంగ ప్రసంగ సందర్భంలో నందన సంవత్సర భాద్రపద శుద్ధ అష్టమి బుధవారం పేర్కొనబడింది. అది గ్రంథరచనాకాలమున కొక భంగ్యంతరసూచన అనుకొంటే స్వామికన్ను పిళ్ళెగారి ఇండియన్ ఎఫెమెరిస్ ప్రకారము క్రీ.శ. 1-9-1652 తేదీకి సరిపోతోంది. గ్రంథంలో పలుతడవ లది "దక్షిణ సింహాసనాధీశ్వరుండు విజయ సేతురఘునాథ భూపాలునినాటక శాలకు సంబంధించినదని వుంది. ఆ సేతు శబ్దమునుబట్టి యిది ఆకాలమున

రామనాథశివగంగమండలాధీశ్వరు లగు సేతు పతులకు సంబంధించిన దని తోస్తుంది. వారిలో విజయరఘునాథ నామధేయులా పదునేడవశతాబ్ది నడుమ గలరు. అం దొకరి ప్రాపకమున నీగ్రంథము వెలసి యుండవచ్చు.

ఇంతవరకు చెప్పిన విషయాలనుబట్టి యిప్పుడు బొమ్మలాటవారిస్థితిగతు లధ్వాన్నంగా వున్నా వెనక భేషుగ్గా వుండేవని తోస్తుంది. ఇంక బొమ్మలాటకీ యక్షగానాదులకూ వున్న సంబంధం స్థూలంగా పరిశీలిద్దాం. ఏవో నాలుగు బొమ్మల నటూయిటూ ఆడించేటంతమాత్రాన అది బొమ్మలాట ప్రదర్శనం అనిపించుకోదు. ఒక కథ తీసుకుని అందలి పాత్రలకు అనుగుణంగా బొమ్మలు తయారు చేసుకుని వాటి నాడిస్తూ వెనుకనుంచి పద్యాల్లో పదాల్లో దరువుల్లో ఆయా పాత్రలప్రవేశ ప్రసంగాదులు, నడుమ ఆ ప్రదృశ్యకథానుసంధానం చేసే సంధివచనాలూ వినిపించాలి. అందుకు సాహిత్యాన్ని ఆశ్రయించాలి. బొమ్మ లాట ప్రదర్శనాల్లో కేవలగద్య రక్తిగట్టదు. అందుకే ఏ'దేశంలోనైనా బొమ్మ లాట ప్రదర్శనానికి వెనక గేయభాగాధికమైన రచననే ఉపయోగిస్తారు. పాశ్చా త్యదేశాల్లో సాధారణంగా 'ఓ పెరా'లను గేయనాటికల నుపయోగిస్తారు. వాటికి గల సంబంధం గూర్చి 'పపెట్ బుక్' (The Puppet Book) అనే గ్రంథంలో యిలా వివరింపబడింది:

"Musical plays and operas if specially arranged, can be given by Puppets. One advantage of opera on the puppet stage is that the conventional gestures of the singers are well within the capacity of the puppet but besides that there is the possible influence any Production might have towards increasing interest in the opera."

అంటే గేయనాటికలను ప్రత్యేకదృష్టితో రచిస్తే బొమ్మలద్వారా ప్రద ర్శించవచ్చు. అలా ప్రదర్శించడంలో కేవల గేయనాటకప్రదర్శకులు సాంప్ర దాయికంగా చూపించవలసిన అభినయాంశాలను ఆ బొమ్మలే ఆదుకోగలవు. అంతేకాక అసలా గేయనాటక ప్రదర్శనయెడల కలిగే ఔత్సుక్యము ప్రభావం యీబొమ్మలాట గేయ రూపక ప్రదర్శనం యెడలకూడా కలుగుతుంది. జావా



ద్వీపవాసులు వారి వాయంగ్ వినోదాల్లో ఉపయోగించే లాకన్లు అను రచనా విశేషాలుగూడా యిల్లాంటివే. . సంస్కృతంలోగూడా చర్మపుత్రికా ప్రదర్శనల కుద్దిష్టమై ఛాయానాటకాలని వున్నాయి, ఇంగ్లీషులో చెప్పవలసివస్తే "షాడో ప్లేస్" (shadow plays) అన్నమాట. తోలు బొమ్మలను ఆటలో తెర వెనుకా దివ్వెకు ముందూ వుంచుతారు. ప్రేక్షకులకు కనపడేవి వాటినాయలు మాత్రమే. అందుకే ఆ పేరు. కొయ్యబొమ్మలాటలో బొమ్మలకు తెరమరుగు వుండదు. కాని వాటికిగూడ ఛాయా నాటక గ్రంథనాగాలు పనికిరాక పోవు. సంస్కృత నాట్య విషయయిక గ్రంథాల్లో ఎక్కడా ఛాయానాటకప్రసక్తి వున్నట్లు కానరాదు. సంస్కృత మహాభారతంలో (XIICCXC V, 5) రూపోప జీవనం అనేవిషయం గురించి నీలకంఠపండితుడిలా వ్యాఖ్యానించాడు: "రూపోప జీవనం జాలమండపి కేతి దాక్షిణాత్యేషు ప్రసిద్ధమ్ । యత్రసూక్ష్మ వస్త్రం వ్యవధాయ చర్మమయై రాకారైః రాజామాత్యాదీనాం చర్యా ప్రదర్శతే" అని, అంటే రూపోప జీవన మనునది జాలమండపిక అను పేర దక్షిణ దేశమున ప్రసిద్ధమైనది. అందు పలుచనిబట్టపై చర్మపుత్రికలద్వారా రాజా మాత్యాదుల చర్యలు ప్రదర్శింపబడును అని అర్థము. ఈ విషయము నాకు డాక్టరు ఎమ్. కృష్ణమాచార్యులవారి (History of classical Sanskrit Literature) గ్రంథంనుండి ఎరుకపడినది. అందులో దేశంలో వివిధ ప్రాంతాలకూ వివిధ కులాలకూ సంబంధించిన కొన్ని ఛాయానాటకాలు పేర్కొనబడ్డాయి.

అవి అన్నీ పన్నెండో శతాబ్ది కిటీవలివే అంతకు పూర్వపు రచనల గురించి తెలియవచ్చుట లేదు. ఆ ఛాయానాటకకర్తలు చాలమంది రాజాస్థానము లలం కరించినవా రగుట గమనింపదగినది. ఆయాఛాయానాట కేతివృత్త ములన్నీ పౌరాణికాలే గాని వికలకవికృతిమాత్రము విశిష్టమైనది. అది చారిత్రకము. క్రీ.శ. 1480–1660 సం॥ల నడుమ బీజపురమును పరిపాలించిన ఆదిల్లరాజ వంశచరిత్రకు సంబంధించినది. సంస్కృత ఛాయా నాటకమలందు సుభటుని దూతాంగదము ప్రసిద్ధమైనది. అది క్రీ.శ. 1242 ప్రాంతమున అనిహిల్ విద్

ప్రభువు త్రిభువనపాలదేవుని కొలువున ప్రదర్శింపబడినది, దూతాంగద మచ్చెనది. అందు గద్యభాగముకంటే పద్యభాగమే ఎక్కువ. కడమ ఛాయా నాటకములు నట్లే యుండు నని ఊహింపవచ్చు.

బొమ్మలాటలకు పాశ్చాత్యదేశాలలో ఓపెరాలు, జావాద్వీపములలో లాకన్లు, మనదేశంలో సంస్కృతమున ఛాయానాటకాలూ మొదలైనవాటివలె తెలుగులోనూ కన్నడంలోనూ యక్షగానా లుపయోగపడుతూ వచ్చాయి. యక్షగానము పిదప కాలమున ఒక విశిష్ట రూపక్రియగా రూపొందిన మొదట గేయరూపమున కథాఖ్యానమే ప్రధానాశయంగా ప్రారంభింపబడింది. అందులో పదద్విపదలు, గద్యపద్యాలు, రాగతాళధారాళములగు దరువులూ ఒకటేమిటి ఎటువంటి ఛందోబంధమైనా, ఎటువంటిరచనావిశేషమైనా యిమిడిపోతాయి. అందుచేత నాటకంలాగ ప్రయోగించడానికిగాని, హరికథలవలె ఆఖ్యానించడానికి గాని, పురాణంలాగ పఠించడానికి గాని పనికి వస్తుంది. బొమ్మలాట ప్రదర్శనకి వెనక పాటగా మరింతసౌలభ్యం వుంది యక్షగానంలో. ఈనాటికి కన్నడ దేశంలో మైసూరు ప్రాంతమున వారిబొమ్మలాటలు చక్కద సూత్రద గొంచెలకు రెంటికిని యక్షగానాలకూ అనుబంధం వుందని తెలుస్తుంది. అలాగే మన ఆంధ్రదేశంలో ఈనాడు అక్కడక్కడ మిగిలివున్న బొమ్మలాటవారి ప్రదర్శనలు చూస్తే వాళ్లు ఆయా ప్రాంతపు యక్షగానకవుల రచనలను వినియోగించుకొన్నట్లు తెలుస్తుంది. బొమ్మలాటలగురించి జాన పదులలో కొన్ని నమ్మకాలున్నాయి. ఉత్తరగోగ్రహణం ఆడిస్తే వానలు కురుస్తాయిట! వానలకీ ఆకథకీ వున్నసంబంధం ఏమిటో తెలీదు కాని యీ నాడును కాకినాడ ప్రాతంపుపల్లె ప్రజ లానమ్మకంతో వానలు పడనప్పుడు మాధవపట్నం బొమ్మలాటవారి నాహ్వానిస్తారు. వాళ్లు చెప్పే ఉత్తరగోగ్రహ ణంలో ధేనువుకొండ వెంకయ్యగారి విరాటపర్వ యక్షగానంలోని దరువులను గుర్తించవచ్చు.

క్రీ.శ.1850 ప్రాంతమున గంజాంజిల్లా గుజ్జువాడనివాసి మరింగంటి భట్టరు రామానుజాచార్యులు రచించిన శ్రీరామనాటకము బొమ్మలాట రామాయణముగా ప్రసిద్ధిపొందింది. ఇందలి కథ లక్ష్మణ మూర్ఛ. మాధవపట్నం బొమ్మలాటవారి



లక్ష్మణ మూర్ఛలో పద్యాలూ, దరువులూ వినిపిస్తాయి. అసలు కొందరు యక్షగాన కవులు బొమ్మలాటలను దృష్టిలో పెట్టుకొని రచించడంకూడాకద్దు. ఉదాహరణకు 19 వ శతాబ్ది చివర వీణె సుబ్బరాజు, గాజుల పెండ్లూరి శేషగిరిరాజు అనువారు రచించిన సంతవేలూరు కుశలవుల నాటకము "ఆరురాత్రిళ్ళ నాటకమునకును బొమ్మలాటకును ఉపయోగముగా రచింపబడి"నట్లు గ్రంథముల పత్రముమీదనే గలదు (ఒకప్రచురణ: వెస్టు వార్డు అండు కంపెనీ, మదరాసు, 1931), పర్లాకిమిడి కడనున్న సాత పట్నము వాస్తవ్యుడు కోట వెంకటప్పయ్యశాస్త్రి అనునాయన క్రీ.శ.1893లో బాణాసురనాటకం రచించి దానికి పీఠికతానే వ్రాస్తూ అందులో ఈగేయ ప్రబంధము చర్మవిగ్రహములచే నాడించుటకును, వేషముల ధరించి నాటక మాడుటకును అనుకూలముగ నుండునటుల రచింపు డని నామిత్రు లొక కొందఱు ప్రోత్సాహపఱచినందున నే నందుల కియ్యకొంటి నని వ్రాసెను (ఇది మదరాసు ఇండియన్ లా ప్రెస్సులో ముద్రితము–1894లో). ఇందు లొట్టకిత్తడు, రత్నాలు, పోలిగాడు అనువారి హాస్యప్రసంగ మచ్చుబొమ్మలాటలలోని జుట్టుపోలిగాడు. బంగారక్క, గంధోళిగాళ్ల ప్రసంగం లాగే వుంటుంది. అసలు వాళ్లసంబంధం, సందర్భం అటువంటివే. బొమ్మలాటవాళ్లు గొల్లక లాపాల్లో వలె తరచు అమరశ్లోకములు నేకరువు పెడతారు. అమరశ్లోకము లుదాహరింపబడిన యక్షగానము లనేకము గలవు. ఉదా: జిల్లెళ్ళమూడి వెంకటరామదాసామాత్యుని జాంబవతీమానము (ఆంధ్రసాహిత్యపరిషత్తాకు పత్రప్రతి నెం 3066) మొదలైనవి. అట్టివి కొన్నిబొమ్మలాటలకు నుదిష్టములై నవే అని చెప్పవచ్చు. బొమ్మలాటల్లో కేతిగా డొకసాంప్రదాయిక హాస్యపాత్ర. కేతినాయడివాలకం చాలా యక్షగానాల్లో కూడా వస్తుంది. కొన్ని అచ్చయిన యక్షగానాల్లో అందలి పాత్రల బొమ్మలుకూడా అచ్చుకాబడి వుంటాయి. అవి చూస్తే చాలామట్టుకు బొమ్మలాట వాలకాలే గుర్తుకొస్తాయి. మీద పేర్కొనబడిన బొమ్మలాటహాస్యనాటకంలో కొన్ని ప్రదర్శన సూచనలు వున్నాయి. – 'బొమ్మలాటకు మొదట తోడియమంగళం పాడి, ఆ వెనక విఘ్నేశ్వరునిమీద పదంపాడుచున్నె విఘ్నేశ్వరునీ కొలువెత్తి సభావర్ధన చదివి అ చెసక విఘ్నేశ్వరునినాట్యం యెత్తి ఆడించేది. ఆ నాట్యం వెనుక తెరహాస్యం

చెప్పి కొలువుపదం పాడి కథకు మొదట కొలువెత్తేది. - ఇక్కడ కోటిమేళం చేసేది' మొదలైనవి. ఆ ప్రదర్శనకు హంగుదారులు పురుములు "పూదేవారున్ను, పుషాంగాలు గోకేవారున్ను, మత్తళాలు మిట్టేవారున్ను, తాళాలు తెన్నే వారున్ను, దండెలు ఎగరవేసేవారున్ను" నట. ప్రదర్శనప్రక్రియ కొంతమట్టు కానాటి దక్షిణ దేశీయ యక్షగాన ప్రదర్శన సంప్రదాయసంవాదిగా వుంది. బొమ్మలాట సంబయ్య యక్షగానాలనే రచించడం చూస్తే తమ బొమ్మలాటల కోసమే రచించాడా అనిపిస్తుంది. ఆయావిషయాలనుబట్టి చూస్తే బొమ్మలాట వాళ్లకి నోట తెలుగు పట్టినప్పటినుంచీ, తెలుగులో యక్షగానాలు పుట్టినప్పటి నుంచీ బొమ్మలాటలకూ యక్షగానాలకూ అనుబంధం యేర్పడి అది తరాలు గడచినకొద్దీ పెంపొందుతూ వచ్చిం దనిపిస్తుంది. ఇటీవల నాటకాలూ సినీ మాలూ వచ్చాక యక్షగానాలు మూలబడ్డాయిబీ బొమ్మలాట ప్రదర్శకుల కనలే గతులు, లేవు. కాని ప్రభుత్వం కాస్త పూనుకొంటే వారిప్రసంగాలు రికార్డుచేసి, వారిప్రదర్శనలకు డాక్యుమెంటరీ ఫిల్ములు తీసి, సచిత్రములైన తచ్చరిత్రగ్రంథ ములను తయారు చేసి ఆ విషయమైన మన ప్రాచీన సంస్కృతీ స్వరూపం తరువాత తరాలవారి తలపోతల నెమరువేతల కైనా అందించినారు.



# 4. తెలుగు సంస్థానాలు-సాహిత్య పోషణ

**- తూమాటి దొణప్ప**

డా॥ తూమాటి దొణప్ప (జ.1926) ఆంధ్ర భాషాసాహిత్యవేత్తలలో అగ్రగణ్యులు. నాగార్జున విశ్వవిద్యాలయములో ఆంధ్రశాఖాధ్యక్షులుగానున్న ఆచార్య దొణప్పగారు తెలుగు భాష, సంస్కృతి, జానపద సాహిత్యము, హరికథలు, సంస్థానములు-సాహిత్య పోషణము మొదలైన పెక్కు విషయములనుగూర్చి సాధికారముగ ప్రవచింపగల దిట్ట. నేటి తెలుగు విద్వల్లోకమున లోతైన పాండిత్యమునకు దొణప్పగారిని తార్కాణగా చెప్పిన అతిశయోక్తి కాదు.

అనంతపురం జిల్లా, రాయదుర్గం తాలూకా, రాకట్ల గ్రామములో జన్మించిన శ్రీ దొణప్పగారు వాల్తేరులో 1953లో ఆనర్సు ముగించి, 1965లో 'వైకృత పద స్వరూప నిరూపణము'నకు పిహెచ్.డి. పట్టమును, సర్ రఘుపతి వెంకటరత్నం నాయుడు స్వర్ణపతకమును పొందినారు. వీరి 'ఆంధ్ర సంస్థానములు-సాహిత్య పోషణము' ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ బహుమతిని పొందినది. వీరి 'తెలుగు హరికథా సర్వస్వం' అకాడెమీ బహుమతినేగాక, డి.లిట్. పట్టమును కూడ ఆర్జించి పెట్టిన మహాగ్రంథము. ప్రస్తుత పాఠ్య భాగము 'తెలుగులో క్రొత్త వెలుగులు' అను వ్యాస సంపుటి నుండి గ్రహింపబడినది.

"మణినా వలయం వలయేన మణి
ర్మణినా వలయేన విభాతి కరః
కవినా చ విభు ర్విభునా చ కవిః
కవినా విభునా ప్రతిభాతి సభా"

మణివల్ల కడియమూ, కడియంవల్లమణి, మణి-కడియం రెండిటివల్లా తొడిగిన చెయ్యీ శోభిస్తాయి. అలాగే కవిమూలంగా ప్రభువూ, ప్రభువు మూలంగా

కవీ, కవిప్రభువులిద్దరి మూలంగా రసికజనసభా శోభిస్తాయి సాహితీ పోషణమన్నది దేశపాలకుల విధులలో ముఖ్యమైనదన్న విశ్వాసం వేదకాలనించీ అనూచానంగా వస్తూవుందని విమర్శకులు వివరిస్తూవుంటారు. యుగయుగాలుగా చక్రవర్తులు, వారి సామంతులు, దేశంలోని యితర శ్రీమంతులు మొదలైనవారి ఆశ్రయాల వాలంలో సాహితీవృక్షం శాఖోపశాఖ లుగా విస్తరించి కావ్యపుష్ప ఫల సౌరభాలను సీమాంతాలదాక వ్యాపింప జేస్తూ వచ్చింది; రాజోపప్లవాదుల వల్ల అప్పుడప్పుడు ఆకులపాటు కలిగినా ఎప్పటికప్పుడు సరికొత్తగా చిగిర్చి, రెమ్మలెత్తి, కొమ్మలువేసి, ఏపుగా పెరిగి, పూచి, కాచి, ఫలించి, రసికజన స్వాదు ఫలాలను ప్రసాదిస్తూ వచ్చింది. తెలుగు సంస్థానాధీశ్వరులూ జమీందారులూ ఈ సాహితీవృక్షానికి తమ కాలంలో యథాశక్తిగా దోహదంచేసి, కావ్యపుష్పసారాన్ని తీసి, రసికలోకంలో కొత్త అత్తరుల ఘుమఘుమల్ని గుబాళింపజేసిన తీరు తెన్నులను ఈ ప్రసం గంలో విహంగావలోకనం చేద్దాం.

పండువంటి విజయనగర సామ్రాజ్యం అంతరించిపోగా దాని శిథిలాల మీద చిన్న చిన్న సంస్థానాలెన్నో అవతరించాయి. ఇవి యింగ్లీషు కుంఫిణీ పాలన కాలంలో ఎన్నెన్నో పరిణామాలకులోనై చివరికి జమీందారీలుగా మార్పొందాయి. 1802 నాటి శాశ్వతకర నిర్ణయంతో కొత్త కొత్త జమీందారీలు, ప్రొప్రయిటరీ యెస్టేటులు అనేకం రూపొందాయి. తెలంగాణంలోని సంస్థానాలు కొన్ని సుల్తానులకాలంలోనూ, మరికొన్ని నిజాముల హయాములోనూ ఏర్పడ్డాయి. ఆంధ్రప్రాంతంలోని జమీందారీలు నాలుగువందలకు పైబడి; తెలంగాణంలోని సంస్థానాలు పాతిక పైచిలుకు. వీటిలో సాహితీ పోషణంగావించిన సంస్థానాలు నూటికి దగ్గర దగ్గరగా వుంటాయి. సాగరాంధ్రంలో అమరావతి, చల్లపల్లి, నరసరావుపేట, నూజివీడు, పిఠాపురం, పెద్దాపురం, బొబ్బిలి, ముక్త్యాల, మునగాల, విజయనగరం సంస్థానాలూ, పశ్చిమాంధ్రంలో కార్వేటినగరం, కాళహస్తి, వెంకటగిరి సంస్థానాలూ; తెలంగాణంలో ఆత్మకూరు, గద్వాల, జటప్రోలు, దోమకొండ, వనపర్తి, సురపురం సంస్థానాలూ కొన్ని ముఖ్యకేంద్రాలుగా పేర్కోవచ్చు. విజయనగర ప్రభు వుల ముత్యాల శాలలో ముద్దుముచ్చటలు చెల్లించుకున్న



ఆంధ్రసాహిత్య లక్ష్మి అనంతరయుగాలలో ఈ చిన్న చిన్న పాలకుల దివాణాలలో తల దాచుకోవలసి వచ్చింది. చేతికిచిక్కిన చిన్న చిన్న సీమలను జారిపోకుండా జాగ్రత్త పర్చుకోవటంలోనో, కుటుంబ కలహాల గొడవలలోనో యెడాపెడా నలుగుతూవున్నందున చాలమందికి కవితాగానాలకూ, శాస్త్ర చర్చలకూ, సాహితీ గోష్ఠులకూ తీరిక లేకపోయినట్లు గోచరిస్తుంది.

సమరాంగణంలోనూ, సాహితీరంగంలోనూ సవ్యసాచిత్వం నెరపి సై యనిపించుకున్న నన్నెచోడుడు, బుద్ధారెడ్డి, సర్వజ్ఞసింగ భూపాలుడు, కాటయ వేమారెడ్డి, కృష్ణరాయలు, రఘునాథ నాయకుడు మొదలైన రాజకవులలాగా మన చర్చాయుగంలో కూడ కవిరాజులవంటి రాజకవులెందరో వెలసి వుండటం వొక విశేషం. జటప్రోలు సురభి మాధవరాయలు, బిక్కినవోలు కామినేని యెల్లారెడ్డి, కళింగ విజయనగరం పూసపాటి తమ్మ భూపాలుడు, గద్వాల ముష్టిపల్లి సోమభూపాలుడు, వనపర్తి అష్టభాషాకవి గోపాలరాయలు, పెద్దాపురం వత్సవాయ బలభద్ర జగపతీ, మొగల్తుర్రు కలిదిండి రామరాజ బహద్దరు, బొబ్బిలిరావు రాయడప్ప రంగారావు, సురపురం రాజా బహిరీపామ నృపాలుడు, సంగంవలస రాజా మృత్యుంజయ నిశ్శంక బహద్దరు, పోలవరం కొచ్చర్లకోట కృష్ణారావు, లక్కవరం మంత్రి ప్రెగ్గడ భుజంగరావు, నూజివీడు మేకా వెంకటాద్రి అప్పారావు బహద్దరు, దేవిడి కందుకూరి బాలసూర్యప్రసాద రావు– ఇంకా ఎందరో పాలకులు కృతిభర్తలుగా సైతం సాహిత్య పౌరోహిత్యాన్ని సమర్థంగా సరసంగా నిర్వహించారు.

అమరావతి, ఉర్లాం, చల్లపల్లి, పిఠాపురం, విజయనగరం వంటి సంస్థానాలు సంస్కృత విద్యాలయాలను నెలకొల్పటం వల్లనూ, ఉర్లాం, పిఠాపురం, వనపర్తి వంటి సంస్థానాలు యేటేట వేదశాస్త్ర పరీక్షల్ని నిర్వ హించి, పండితలోకాన్ని పోషించడం వల్లనూ ఈ సీమలో ఆర్షధర్మ విజ్ఞాన జ్యోతి ఆరిపోకుండ నిల్చిందని విజ్ఞులు పేర్కొంటూవుంటారు. ఉంద్రాజవరం, ఎర్నగూడెం, కపిలేశ్వరపురం, గద్వాల, దోమకొండ, పిఠాపురం, పోలవరం, బొబ్బిలి, ముక్త్యాల, వనపర్తి, విజయనగరం, వుయ్యూరు, వెంకటగిరి మున్నగు సంస్థానాలు అచ్చుకూటాలను స్థాపించి,

ప్రాచీనార్వాచీన గ్రంథాలను ప్రచురించీ భాషోపకారం గావించారు. చల్లపల్లి, పాల్వంచ, పిఠాపురం, వల్లూరు జమీందారులు సాహితీ సేవకులైన యితరులు స్థాపించిన ముద్రణా యంత్రశాలలకు ఆర్థికంగా సాయపడ్డారు. గ్రంథప్రచురణ మండలులకూ, సాహితీ సంస్థలకూ, సాహితీ పత్రికలకూ, తదితర విద్యాసంస్థలకూ జమీం దారులందరూ ఉదారంగా విరాళాలిచ్చి భాషోద్ధరణకు తోడ్పడ్డారు. ఎర్నగూడెం, జయంతిపురం, పోలవరం, లక్కవరం మొదలైన జమీందారులు స్వయంగా సాహిత్య పత్రికలను స్థాపించి, నిపుణంగా నిర్వహించి సాహిత్యాసక్తిని పెంపొందించారు.

ఆస్థానకవి పండితులను పోషించటమేకాక, తెలుగుసీమ నాలుగంచుల నించీ, ఇరుగు పొరుగు సీమలనించీ తమ ఆస్థానాలకువచ్చే కవి పండితులతో అవధానాదులూ, శాస్త్రార్థాలూ, సాహితీ చర్చలూ జరిపించి, వార్షికాలు, భూదానాలు, గజారోహణాది సత్కారాలతో వారిని సమ్మానించి పాలకు అనేకులు పరాభారత సంప్రదాయాలను పునరుద్ధరించారు.

అనకాపల్లి, ఉంద్రాజవరం, కపిలేశ్వరపురం, చల్లపల్లి, పిఠాపురం, బొబ్బిలి, వనపర్తి, విజయనగరం, వుయ్యూరు మున్నగు జమీందారులు విశ్వవిద్యాలయాలకు ప్రోఛాన్సలర్లుగానో వైస్ ఛాన్సలర్లుగానో, సెనేట్, సిండికేటు సభ్యులుగానో వుంటూ విద్యారంగంలో చేసిన విశిష్టమైన సేవను తెలుగులోకం విస్మరించలేదు. రాజకీయరంగంలోనూ, సాంఘిక సేవాక్షేత్రంలోనూ కొందరు జమీందారులు నిర్వహించిన, నిర్వహిస్తున్న ప్రధాన పాత్ర జగమెరిగిన సత్యం.

ఈ యుగం చివరిదశలో ఆయా సంస్థానాలను పాలించినవారిలో స్త్రీలు చాలమంది వుండటం వొకవిశేషం. కవిపండిత పోషణలో, సాహితీ సముద్ధరణలో వీరంతా విశేషాసక్తిని ప్రదర్శించటం-యాదృచ్ఛిక సంఘటన మే అయినా- వింతలలో వింతగా కన్పించకపోదు. అనకాపల్లి జమీందారిణి గొడే చిట్టి జానకయ్యమ్మ గజపతిరావు, ఆత్మకూరు సంస్థానప్రభ్విణి సవైరాణి భాగ్యలక్ష్మమ్మదేవి, క్రోలంక జమీందారిణి రావు రామ్మయ్యమ్మారావు. గద్వాల మహారాణి



ఆదిలక్ష్మీదేవమ్మ, గూటాల జమీందారిణి మన్యం మహాలక్ష్మమ్మ, తుని మహారాణి వత్సవాయ వెంకట సుభద్రయ్యమ్మ జగపతిరావు, పాపన్నపేట సంస్థానాధీశ్వరి రాణి వెంకటలక్ష్మాయమ్మ సర్దేశాయి మొదలైన వారు తమ పూర్వులు పోయిన దారిలో నడిచి విద్వత్పోషణం గావించిన సాధ్వీమణులు. వీరిలో కొందరు కవయిత్రులుండటం మరో విశిష్టత. విశాఖపట్టణం గొడేవారి ఆడుబడుచు మదిన సుభద్రయ్యమ్మ, మహారాణి గొడె చిట్టి జానకయ్యమ్మ, చెలికాని చెల్లయ్యమ్మ, రాణి వెంకట లక్ష్మాయమ్మ సర్దేశాయి మున్నగువారు సాహిత్య చరిత్రలో మరుగువడిన మాణిక్యాలు.

ఇక, యీ యుగంలో ప్రవర్తితమైన సాహితీశాఖలనుగూర్చి సంగ్రహంగా పరిశీలిద్దాం. పూర్వయుగాలలో రూపొందిన సకల సాహిత్యశాఖలూ యా యుగంలో కన్పిస్తాయి. అచ్చతెనుగుకావ్యాలు, అనేకార్థకకావ్యాలు, క్షేత్రమహాత్మ్యాలు, చారిత్రిక కావ్యాలు, తాత్త్విక రచనలు, నాటకాలు, పురాణ్యాలు, ప్రబంధాలు, యక్షగానాలు, వచనరచనలు, విమర్శకగ్రంథాలు, శతకాలు, తర్క వ్యాకరణాలంకార జ్యోతిషాది శాస్త్ర రచనలు- ఇంకా ఎన్నో శాఖలు వెలిశాయి.

ములుగు పాపయారాధ్యుల సర్వమధురం, మండపాక పార్వతీశ్వర శాస్త్రి శ్రీ కృష్ణాభ్యుదయం అచ్చ తెనుగు కావ్యాల్లో పేర్కోదగ్గవి.

అనేకార్థక కావ్యాలలో తిరుమల బుక్కపట్టణం వెంకటాచార్యుల అచలాత్మజా పరిణయం, వనపర్తి చెన్నకృష్ణకవి యాదవభారతీయం, గద్వాల పోకూరి కాశీపతి సారంగధరీయం, ఓరుగంటి సోమ శేఖరకవి రామకృష్ణార్జున రూపనారాయణీయం, మంత్రి ప్రెగ్గడ సూర్యప్రకాశరాయకవి కృష్ణార్జున చరిత్రం చమత్కార చారువులుగా చెప్పవచ్చు.

ఏనుగు లక్ష్మణకవి రామేశ్వరమాహాత్మ్యం, దేవులపల్లి సుబ్బరాయశాస్త్రి మహేంద్రవిజయం, కాకరపర్తి కృష్ణకవి ముఖలింగ క్షేత్రమాహాత్మ్యం క్షేత్ర మాహాత్మ్య కృతుల్లో చెప్పుకోదగ్గవి.

చారిత్రిక కావ్యాల్లో దిట్టకవి నారాయణకవి రంగరాయ చరిత్రం, చత్రాతి లక్ష్మీనరసకవి పద్మనాభయుద్ధం, పరవస్తు వెంకటరంగాచార్యుల గణించదగతం, పార్వతీశ్వరశాస్త్రి రాధాకృష్ణసంవాదం ప్రముఖంగా పరిగణించదగ్గవి.

పురాణాలలో కాణాదం పెద్దన మత్స్యపురాణం, రాజాబహిరీ పామ నృపాలుని భార్గవపురాణం, మండ కామేశ్వరకవి కూర్మపురాణం, ముందుంచి అప్పయ్య దీక్షితుల విష్ణుపురాణం, రామనరసింహకవుల భాగవత పురాణం ప్రసిద్ధ రచనలు.

ఈ యుగంలో ప్రబంధాలు పరశ్శతాలుగా రవింపబడ్డాయి. సురభి కుమారధూర్జటి ఇందుమతీపరిణయం, కాణాదం పెద్దన ముకుందవిలాసం, వక్కలంక వీరభద్రకవి వాసవదత్తాపరిణయం, పూసపాటి విజయరామరాజు విష్ణుభక్తి సుధాకరం, కలిదిండి రామరాజు వరసావిత్రి చరిత్రం, మాడభూషి నృసింహాచార్యుల వల్లీపల్లవో జ్ఞానం, ఓరుగంటి సోమశేఖరకవి ప్రభావతీ పరిణయం, శిష్టావెంకట సుబ్బయ్య హృదయాభిరామం నాజూకు పోకడలు పోయిన నవ్య ప్రబంధాలుగా ఉదాహరించవచ్చు.

యక్షగానాలలో రాయదుర్గం పాలకుడు కర్ణాటకరాయ దళవాయి తిమ్మభూపాలుని ప్రసన్న వెంకటేశ్వర విజయవిలాసం, వరుకూరి నారాయణప్ప పారిజాత ప్రబంధం, కాకరపర్తి నృసింహకవి సంగీతసారంగధర, మృత్యుం జయ నిశ్శంక బహద్దరు పారిజాతం మేలిరచనలుగా పరిగణించవచ్చు.

శతకశాఖలో అడిదము సూరకవి, గోగులపాటి కూర్మనాథకవి, తేడ పూసపాటి వీరపరాజు, మండపాక పార్వతీశ్వరకవి ప్రసిద్ధులు.

తిట్టుకవితలో జగ్గకవి చంద్రరేఖావిలాపం, లక్ష్మణకవి రావణ దమ్మీయం, పోలిపెద్ది వెంకటరాయకవి తిట్లదండకం, పన్నాల రామబ్రహ్మశాస్త్రుల ఖలకర్ణవిషాయణం, విక్కిరాల రంగాచార్యుల శార్దూలశతకం విశిష్ట రచనలు.

తాత్త్విక రననలలో ఉర్లాం వారి ప్రత్యూష ప్రబోధం, కురం వారి మహావాక్య రత్నావళి, బొబ్బిలివారి హిందూమతం, లక్కవరంవారి తత్త్వమీమాంసా,



విజయనగరంవారి ఆంధ్ర వైశేషికోపస్కారం, వెంకటగిరివారి సర్వమతసార సంగ్రహాదులు ముఖ్యమైనవి.

చారిత్రిక విమర్శనలో జటప్రోలుపండితులు వెల్లాల సదాశివశాస్త్రిగారి ఆంధ్రచరిత్ర విమర్శనం, తుని సంస్థాన పండితులు కాశీభట్ట బ్రహ్మయ్య శాస్త్రిగారి పెద్దాపుర సంస్థానచరిత్ర విమర్శనం మేటిరచనలు.

ఇక, నాటకాలమాట వివరించనక్కరలేదు. సంస్కృతాంధ్రరచనల అనువాదాలేకాక, స్వతంత్రరచనలు సైతం వెలిశాయి. తిరుపతి వెంకటకవులు, వసురాయలు, సత్యవోలు కామేశ్వర కవి, రాజాభుజంగరావు, గిడుగు సీతాపతి మున్నగువారి ఆంధ్రీకృతులు ఎన్నిక కెక్కినవి. స్వతంత్ర రచనలలో గురజాడ అప్పారావుగారి ఆంధ్ర వీరలక్ష్మీ విజయం, గంపలగూడెం జమీందారు కోటగిరి వెంకటకృష్ణారావుగారి నాటకాలు, పిఠాపురం యువరాజావారి నాటకాలు, మందసా సంస్థానాశ్రితులు జి.సి. వి. శ్రీనివాసాచార్యుల కమలాప హరణం, పోలవరం ఆస్థానకవులు తిరుపతి వెంకటకవులు భారతకథానాటకాలు, పిఠాపురం ఆశ్రితులు పానుగంటివారి నాటకాలు, మైలవరం పండితులు మల్లాది అచ్యుతరామశాస్త్రి నాటకాలు ప్రశస్తరచనలుగా భావించవచ్చు.

ఇక, యీ యుగంలో మూర్తికట్టిన సాహిత్యాన్ని ఖరీదు కట్టటం చివరి అంశంగా మిగిలివుంది. విమర్శకులు ఈ యుగాన్ని బహూపపత్తికంగా క్షీణయుగమని పరిగణించటం కద్దు. ఈ యుగంలో పాండిత్యపు పదను హెచ్చి, కవిత్వపు కదను తగ్గిన మాటమాత్రం వాస్తవం. అంతర్దృష్టి చెదరి, బాహ్యదృష్టి ముదరటమే దీనికి ముఖ్యకారణంగా పేర్కోవచ్చు. పాశ్చాత్యవాసన మూలంగా సాంఘికార్థికాది వ్యవస్థలలో వచ్చిన మార్పు సైతం యీ రుచిభేదానికి దోహదం చేసిందనవచ్చు. రస నిర్భరమైన కవితావ్యవసాయంకంటే, అవధానవిద్యలూ, ఆశుకవితారీతులూ, సమస్యాపూరణాలూ సంస్థాన పాలకులనూ, వారి ఆస్థాన సభ్యులనూ అమితంగా ఆకర్షించినట్లు కనిపిస్తుంది. ప్రభువును బట్టికదా పరివారం. సాహిత్య స్రష్టలలో కూడ కళాదృష్టి సన్నగిల్లి, శాస్త్రదృష్టి ప్రబలటంకూడా యీ

సాహిత్యం యిలా రూపొందటానికి హేతువుగా నిరూపించవచ్చు. అంతేకాదు, తర్క కర్కశ బుద్ధులైన శాస్త్ర పండితులు చాలమంది సాహితీరంగంలో ప్రవేశించి, పాలకుల మెరమెచ్చుల కోసం, పాండిత్య ప్రకటనకోసం కవిత్వపు గారడీ కసరత్తుల గమ్మతలు చెయ్యటంవల్ల అక్షర నియమాదిక రచనలు–అంటే నిరూష్మ నిరోష్ఠ్య అనేకార్థక అపంచవర్గీయ నిర్గద్య చిత్రబంధ శుద్ధాంధ్ర రచనలు అతివేలంగా అవతరించాయి.

ఈ సాహిత్యమంతా నిలుస్తుందని సహృదయ విమర్శకులెవ్వరూ జోస్యం చెప్పలేరు. దీనిలో చాలపాలు కాలపరీక్షకు ఆగలేక పోవచ్చు. పూర్వ పూర్వ యుద్ధాలలోని యెంతెంత చెత్తకొట్టుకుపోయి, ఉత్తరోత్తర యుగాలలో నికర మైన సరకు ఎంతవరకు నిల్చి మనదాకా వచ్చిందో మనం అంచనావేస్తూనే వున్నాం. బండ్ల కెత్తవలసినంత చెత్త పోగా, వుత్తమపదార్థం యేచిన్న మెల్లో చేతి కందటం మన అనుభవంలోనిదే. ఇందులో ముక్కాలు మువ్వీసం కొట్టుకుపోయి వీసంపాలు నిల్చినా చాలు. 'కతి కవయః కతి కృతయః కలి లుప్తాః కతి చరంతి' అనికదా నీలకంఠదీక్షితసూక్తి. ఇంతేకాకుండా యీ యుగంలోని సాహిత్యం ఆంధ్రసృష్టిని ఉన్నతస్థాయికి ఉద్ధరించలేదని మన నిందించనక్కరలేదు. ఉన్నతస్థాయిమాట అలావుంచండిబీ ఉన్నతస్థానంనించి పతనం కాకుండా ఆదుకోవటానికి కొంతలో కొంతయినా తోడ్పడిందని ఒప్ప కోక తప్పదు. అయినా, ఏమాటకామాటే చెప్పుకోవాలికదా! మెరుగూ తరుగు యుగధర్మం కాబట్టి, సాహితీకృషిని పోషించి, ప్రోత్సహించాలనే సనాతన సంప్రదాయాన్ని నిలబెట్టినందుకైనా మన మీ సంస్థానాధీశ్వరులని ప్రశంసించక తీరదు. సరసులు దోషై కదృక్కులు కాకూడదు కదా!

**'పదవిహ్వాలతా కాపి స్పృహణీయా భవతి రస కవీంద్రాణాం**
**ఘన జఘన స్తనమండల భారాలసగామినీనాంచ'**

అన్న భోజరాజోక్తిని యిట స్మరించటం యుక్తం.



# వ్యాకరణము

## సంధులు

సంధి అంటే కలయిక అని అర్థం. వ్యాకరణంలో సంధి అంటే రెండు పదాల కలయిక అని అర్థం. సంధిగత పదాల్లో కనీసం రెండు పదాలు ఉండాలి. అందులో మొదటి పదాన్ని పూర్వపదమని, రెండవపదాన్ని పరపదమని అంటారు.

### సంధులు – పారిభాషిక పదాలు

1. నిత్యము : చెప్పిన వ్యాకరణ కార్యము తప్పక జరిగినచో దానిని నిత్యము అంటారు.

ఉదా : రాముడు + అతడు = రాముడతడు.

2. నిషేధము : చెప్పిన వ్యాకరణ కార్యము జరుగకున్నచో అది నిషేధము అగును.

ఉదా : వెల + ఆలు = వెలయాలు

3. వైకల్పికము
(లేక) విభాష : చెప్పిన వ్యాకరణం జరుగుట మరియు జరుగ కుండుట ఉన్నచో అది వైకల్పికము. ఇందులో వ్యాకరణ కార్యము జరిగిన రూపము, జరుగని రూపము ఉండును.

ఉదా : పుట్టిన + ఇల్లు – పుట్టినిల్లు – పుట్టినయిల్లు

4. బహుళము : చెప్పిన వ్యాకరణ కార్యము కొన్నిచోట్ల నిత్యంగా, కొన్నిచోట్ల నిషేధంగా, కొన్నిచోట్ల విభాషగా మరికొన్ని చోట్ల అన్యవిధంగా జరిగినచో అది బహుళము.

ఉదా : (నిత్యం) రామ + అయ్య = రామయ్య
(నిషేధం) దూత + ఇతడు = దూతయితడు
(వైకల్పికం) మేన + అల్లుడు = మేనల్లుడు, మేనయల్లుడు
(అన్యవిధము) ఒక + ఒక = ఒకానొక

5. లోపము : వ్యాకరణ కార్యమునను సరించి ఒక అక్షరము లోపించినచో అది లోపము

ఉదా : భయము + పడు = భయపడు

6. ద్విత్వము లేక ద్విరుక్తము : ఒకే హల్లు రెండు సార్లు వచ్చినచో దాన్ని ద్విత్వము లేక ద్విరుక్తము అంటారు.

ఉదా : క్క, గ్గ, మ్మ, య్య, స్స.

7. సంయుక్తము : ఒక హల్లుకు మరొక హల్లు ఒత్తుగా ఉన్నచో అది సంయుక్తము. అనగా వేర్వేరు హల్లుల కలయిక సంయుక్తము.

ఉదా : విద్య (ద్య – సంయుక్తము) లక్ష్మి (క్ష్మి – సంయుక్తము)

8. ఆదేశము : ఒక అక్షరాన్ని తొలగించి దాని స్థానంలో మరొక అక్షరం వచ్చినచో దాన్ని ఆదేశం అంటారు.

ఉదా : కాయ + కూర = కాయగూరలు (గకారం ఆదేశం).

9. ఆగమము : ఒక అక్షరం ప్రక్క మిత్రునివలె వచ్చి మరొక అక్షరం చేరినచో అది ఆగమము అగును.

ఉదా : నీ+రూపము = నీదు రూపము (దు–ఆగమము)

10. ఏకాదేశము : రెండు అక్షరాలు లోపించి, ఆ రెండక్షరాల స్థానంలో ఒకే అక్షరం వచ్చినచో అది ఏకాదేశము.

ఉదా : కవి + ఇంద్రుడు = కవ్ + ఇ + ఇ + ంద్రుడు = కవీంద్రుడు (ఇ + ఇ స్థానంలో ఈ)

11. సంశ్లేషము : సంశ్లేషమనగా మీది హల్లుతో కూడి ఉండుట.

ఉదా : పూచెన్ + గలువలు = పూచెన్గలువలు.



12. ఆమ్రేడితము : ద్విరుక్తము యొక్క పరరూపము ఆమ్రేడితము. అనగా ఒకే పదాన్ని రెండుసార్లు పలికినచో అందు రెండవ పదం ఆమ్రేడితం

ఉదా : అక్కడ + అక్కడ (గీతగీసిన పదము ఆమ్రేడితము)

13. బిందువు– అనుస్వారము : దీనినే 'సున్న' అంటారు. ఇది పూర్ణబిందువు (నిండుసున్న), ఖండ బిందువు (అరసున్న) అని రెండు విధాలు.

ఉదా : పూర్ణ బిందువు : గంప, దండ

ఖండ బిందువు : అఁట, వెలఁది.

14. అచ్చులు : వర్ణమాలలోని 'అ' నుండి 'ఔ' వరకు ఉన్న 16 అక్షరములు అచ్చులు. వీనికే స్వరములు అనిపేరు. అవి– అ, ఆ, ఇ, ఈ, ఉ, ఊ, ఋ, ౠ, ఒ, ఒ, ఎ, ఏ, ఐ, ఒ, ఓ, ఔ.

15. హల్లులు : వర్ణమాలలో 'క' నుండి 'హ' వరకు గల 37 అక్షరములు హల్లులు.

16. హ్రస్వములు : ఒక మాత్ర కాలములో ఉచ్చరించబడే అచ్చులు, ఆ అచ్చులతో కూడిన హల్లులు అనగా అ, ఇ, ఉ, ఋ, ఎ, ఒ అనే అచ్చులు. ఆ అచ్చులతో కూడిన హల్లులు హ్రస్వములు.

17. దీర్ఘములు : రెండు మాత్రల కాలములో ఉచ్చరింపబడే ఆ, ఈ, ఊ, ౠ, ఇ, ఏ, ఐ, ఓ, ఔ అనే అచ్చులు, ఆ అచ్చులతో కూడిన హల్లులు దీర్ఘములు అగును.

18. తత్సమములు : సంస్కృత, ప్రాకృత పదాలతో సమానమైన పదాలను తత్సమములు అందురు.

ఉదా : రాముడు, అగ్ని

19. తద్భవము : సంస్కృత ప్రాకృత పదముల నుండి పుట్టిన పదములను తద్భవములు అందురు.

ఉదా : ఆకసము, పయనము

20. దేశ్యములు : త్రిలింగదేశములో వ్యవహారములో ఉన్న పదాలను దేశ్యములు అందురు.

ఉదా : ఊరు, పేరు, ఇల్లు, ముల్లు.

21. త్రికము : ఆ, ఈ, ఏ అను సర్వనామములను త్రికము అందురు.

22. పరుషములు : కఠినముగా పలుకబడు హల్లులు పరుషములు. ఇవి ఐదు.

ఉదా : క, చ, ట, త, ప.

23. సరళములు : సరళములు అనగా తేలికగా పలుకబడు హల్లులు ఇవి ఐదు.

ఉదా : గ, జ, డ, ద, బ.

24. స్థిరములు : పరుష సరళములు కాక మిగిలిన 25 హల్లులు స్థిరములు.

25. వర్గయుక్కులు : ఐదు వర్గములలోని సరిసంఖ్యలో గల 10 అక్షరములు వర్గయుక్కులు. అవి

ఉదా : ఖ, ఘ, ఛ, ఝష ఠ, ఢ, థ, ధ, ఫ, భ.

## సంస్కృత సంధులు

సంస్కృత పదములకు, సంస్కృత పదములకు మధ్య కలుగు సంధులను సంస్కృత సంధులు అందురు. సంస్కృత సంధులలో అచ్చులు, అచ్చులు కలిసి సంధి ఏర్పడినచో వాటిని "అచ్ సంధులు" అని, హల్లులు, హల్లులు కలిసి సంధి జరిగినచో వానిని "హల్సంధులు" అని అందురు.

పాఠ్యప్రణాళికలో సంస్కృతసంధులలో కేవలము నాలుగు అచ్ సంధులు మాత్రమే చేర్చబడినవి. అవి. 1. సవర్ణదీర్ఘసంధి, 2. గుణసంధి, 3. వృద్ధిసంధి, 4. యణాదేశసంధి.



1. సవర్ణదీర్ఘ సంధి : సవర్ణమనగా ఒకే అక్షరమని అర్థము. అ, ఇ, ఉ, ఋలకు సవర్ణములు పరమైనచో వాని దీర్ఘములు ఏకాదేశమగును.

ఉదా : దేవ + ఆలయము = దేవాలయము (అ + ఆ = ఆ)

కవి + ఇంద్రుడు = కవీంద్రుడు (ఇ + ఇ = ఈ)

గురు + ఉపదేశము = గురూపదేశము (ఉ + ఉ = ఊ)

మాతృ+ఋణము = మాతౄణము (ఋ+ఋ = ౠ)

2. గుణసంధి : అకారమునకు ఇ, ఉ, ఋలు పరములైనచో క్రమముగా ఏ, ఓ, అర్లు ఏకాదేశమగును.

అ + ఇ = ఏ

అ + ఉ = ఓ

అ + ఋ = అర్

ఉదా : రాజ + ఇంద్రుడు = రాజేంద్రుడు

మానవ + ఉత్తముడు = మానవోత్తముడు

దేవ + ఋషి = దేవర్షి

3. వృద్ధిసంధి : అకారమునకు ఏ, ఐలు పరములైనపుడు ఐకారము, ఓ, ఔలు పరములగునపుడు ఔకారము ఏకాదేశమగును.

అ + ఏ – ఐ = ఐ

అ + ఓ – ఔ = ఐ

ఉదా

ఏక + ఏక = ఏకైక

దివ్య + ఓషధి = దివ్యౌషధి

దేశ + ఔన్నత్యము = దేశౌన్నత్యము

4. యణాదేశసంధి : ఇ, ఉ, ఋ అను అక్షరములకు అసమానమైన అచ్చు పరమైనచో క్రమముగా య్, వ్, ర్‌లు ఆదేశమగును.

ఉదా : అతి + అంతము = అత్యంతము (ఇ + అ = య్)

అణు + అస్త్రము = అణ్వస్త్రము (ఉ + అ = వ్)

పితృ + ఆజ్ఞ = పిత్రాజ్ఞ (ఋ + అ = ర్)

## తెలుగు సంధులు

సంస్కృతములోని సంధికి, తెలుగులోని సంధికి కొంచెము భేదమున్నది. తెలుగులోని సంధికి సూత్రము ఇది.

సూత్రము : పూర్వపరస్వరంబులకు పరస్వరంబు ఏకాదేశంబగుట సంధియనంబడు. తెలుగులో పూర్వపదము చివర, పరపదము మొదట అచ్చు ఉండాలి. ఆ రెండు అచ్చులకు బదులుగా పరపదము మొదట ఉన్న అచ్చు ఏకాదేశముగా వచ్చినచో అది సంధి.

ఉదా : రాముడు + అతడు = రాముడ్ + ఉ + అ + తడు
రాముడ్ + అ + తడు = రాముడతడు

5.గసడదవాదేశ సంధి : సూత్రం-1. ప్రథమమీది పరుషములకు గ-స-డ-ద-వలు బహుళముగానగు.

ఉదా : వాడు + కొట్టె = వాడుగొట్టె, వాడుకొట్టె
అపుడు + చనియె = అపుడు సనియె, అపుడు చనియె
వారు + పోరు = వారు వోరు, వారు పోరు

సూత్రం-2. ద్వంద్వంబున పదంబుపై పరుషములకు గ-స-డ-ద-వ-లు అగు.

ఉదా : కూర + కాయ = కూరగాయలు
తల్లి + తండ్రి = తల్లిదండ్రులు
ఊరు + పల్లె = ఊరువల్లెలు.

6.రుగాగమ సంధి : 1. కర్మధారయమునందు పేదాది శబ్దములకు ఆలు శబ్దము పరంబగునపుడు రుగాగమంబగు.
(పేద, బీద, జవ, కొమ, బాలింత, మనుమ, ముద్ద, గొడ్డు మొదలైనవి పేదాదులు)

ఉదా : పేద + ఆలు - పేద + రు + ఆలు = పేదరాలు
బీద + ఆలు-బీద + రు + ఆలు = బీదరాలు
మనుమ+ఆలు-మనుమ+రు +ఆలు = మనుమరాలు



సూత్రం- 2. కర్మధారయమునందు తత్సమ శబ్దములకు ఆలు శబ్దము పరంబగునపుడు అత్వంబునకు ఉత్వంబును రుగాగమంబునగు.

ఉదా : ధీర + ఆలు - ధీరు + రు + ఆలు = ధీరురాలు
గుణవంత + ఆలు - గుణవంతు + రు + ఆలు = గుణవంతురాలు.

7.ద్విరుక్తటకారసంధి : కుఱు, చిఱు, కడు, నడు, నిడు శబ్దంబుల ఱ-డలకు అచ్చు పరంబగునపుడు ద్విరుక్తటకారంబగు.
వివరణ : ద్విరుక్తటకారమనగా ట్టి. కుఱు, చిఱు, కడు, నడు, నిడు శబ్దములలోని ఱ, డలకు అచ్చుపరంగా వస్తే ఱ, డలకు బదులుగా ట్ట్ ఆదేశంగా వస్తుంది.

ఉదా : కుఱు + ఉసురు = కుట్టు + ఉసురు = కుట్టుసురు
చిఱు + ఎలుక = చిట్టు + ఎలుక = చిట్టెలుక
కడు + ఎదురు = కట్టు + ఎదురు = కట్టెదురు
నడు + ఇల్లు = నట్టు + ఇల్లు = నట్టిల్లు
నిడు + ఊర్పు = నిట్టు + ఊర్పు = నిట్టూర్పు.